మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 39 • పేజీలు:12+16 • వెల: రూ.5 మంగళవారం • 9-1-2018 www.manamnews.com /manamnews



అష్టభార్యల 'కష్ట'సఖుడు

ఎనిమిదేళ్లు... ఎనిమిది పెళ్లిళ్లు

తమిళ 'పురుషోత్తమ్'డి కృష్ణలీల

తొలుత ముగ్గురితో మూడుముళ్లు

ఇద్దరి నుంచి రూ.4.5 కోట్లు స్వాహా

ఆపై మరో నలుగురికి పసుపుతాడు

7లో..

'గోల్డెన్ గ్లోబ్'లో భారతీయుడు

భారత సంతతి టీవీ నటుడికి తొలిసారి అవార్డు

నేనొక ప్రేమ పిపాసిని

లేటు వయసు ఘాటు ప్రేమ

'కుటుంబం'లో..

ఆ నవ్వుకు ఎంత కష్టం!

కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కమెడియన్.. ఆర్థిక పరిస్థితి బాగోక ఇంట్లోనే చికిత్స

గుండు హనుమంతరావుకు సర్కారు సాయం.. సీఎం సహాయ నిధి నుంచి 5 లక్షలు విడుదల

మానవతా దృక్పథంతో స్పందించిన ప్రభుత్వం.. ఆయనకు మరింత సాయం అవసరం



హైదరాబాద్, జనవరి 8:

నిన్న మొన్నటి వరకు ఆయన వెండితెరతో పాటు బుల్లితెర మీద కూడా నవ్వులు పండించి, పదిమందినీ నవ్వించి అందరినీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంచిన కమెడియన్. ఇప్పుడు తన ఆరోగ్యం విషమించి మంచాన పడ్డారు. సినిమాలలో హాస్యపాత్రలతో పాటు.. టీవీలలో వచ్చే 'అమృతం' సిరీస్‌లో తనదైన శైలిలో హడావుడి పడుతూ అందరినీ నవ్వించిన గుండు హనుమంతరావు **మిగతా 6లో..**



పంట పండాలె!

రైతు ఇండ్లల్ల సిరులు నిండాలె

పాత రోజులు యాది రావాలె

రూ.783 కోట్లతో తుమ్మిళ్ల లిఫ్టు

సీఎం కేసీఆర్‌తో ప్రారంభోత్సవం

'ఉమ్మడి'లో ఆర్డీఎస్‌కు అన్యాయం

కళ్లుండీ చూడలేని కాంగ్రెస్ నేతలు

లిఫ్టు శంకుస్థాపనలో మంత్రి హరీశ్

అలంపూర్, జనవరి 8 (మనం న్యూస్):

రాష్ట్రంలో చివరి ప్రాంతమైన నడిగడ్డకు తుమ్మిళ్ల లిఫ్టుతో మంచి రోజులు మళ్లీ వస్తాయని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు **మిగతా 6లో..**

తెలంగాణ నంబర్ 1

మూడున్నరేళ్లలో కుట్రలు పటాపంచలు

ఈవోడీబీలో దేశంలోనే తొలి స్థానం

24 గంటల కరెంటు సుసాధ్యమైంది

ఐటీ ఎగుమతులను రెట్టింపు చేశాం

ఆ రంగంలో లక్ష ఉద్యోగాలిచ్చాం: కేటీఆర్

ఆస్ట్రేలియా తరహాలో కరీంనగర్‌లో రోడ్లు: ఈటల

జిల్లా కేంద్రంలో ఐటీ టవర్‌కు శంకుస్థాపన

స్థలం కేటాయిస్తే మరో ఐటీ టవర్‌కు హామీ






కరీంనగర్, జనవరి 8 (మనం ప్రతినిధి):

ఐటీ రంగంలో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రంగంలో మూడేళ్లలోనే లక్ష వరకు ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. వాణిజ్య సౌలభ్యం (ఈవోడీబీ)తోపాటు అన్ని రంగాల్లోనూ తెలంగాణ నంబర్ 1 **మిగతా 6లో..**

ఇదీ లోకం!



రాజకీయాల్లోనైనా గెలిచి తీరండి సార్..!

నేను చేసింది.. ఇంకెవరూ చేయొద్దు



మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ప్రజలకు టీవీ యాంకర్ ప్రదీప్ సూచన

తండ్రితో కలిసి కౌన్సెలింగ్‌కు హాజరు

తాగి ఎందుకు నడపకూడదో తెలిసొచ్చిందని వ్యాఖ్య

హైదరాబాద్, జనవరి 8: ''నేను చేసింది దయచేసి ఎవరూ చేయొద్దు. మద్యం తాగి వాహనాలు నడపొద్దు'' అని టీవీ యాంకర్ ప్రదీప్ సూచించారు. గత నెల 31న అర్ధరాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో **మిగతా 6లో..**



నిద్ర మత్తు ప్రాణాలు తీసింది

బోల్తాకొట్టిన బొలెరో వాహనం

ఐదుగురు కూలీల దుర్మరణం

25 మందికి తీవ్ర గాయాలు

పలువురి పరిస్థితి విషమం

కార్గోలో 40 మంది ప్రయాణం

జోగులాంబ-గద్వాల జిల్లాలో ఘటన

హైదరాబాద్, జనవరి 8:

డ్రైవర్ నిద్రమత్తుకు తోడు.. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనం నడపడంతో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. చిన్నపాటి **మిగతా 6లో..**



వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలో స్వల్ప మార్పు చోటుచేసుకుంటుంది. చలి గాలులు వణికిస్తాయి. గంటకు 12కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 29 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 66 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి సా.4.15 తదుపరి నవమి; నక్షత్రం: చిత్త తె.3.02 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ.10.10–11.51; దుర్ముహూర్తం: ఉ.9.05–9.49, మ.2.14–2.58; రాహుకాలం: మ.3.09–4.31; అమృతఘడియలు: రా.8.19–10.01; శుభసమయం: ఉ.8.00–8.23, సా.4.30–6.00.

సూర్యోదయం: 6.53,

సూర్యాస్తమయం: 5.54

గనేరియా.. వదలదయా!

మందులకూ లొంగని మొండిరోగం

యాంటీబయాటిక్‌లకు నిరోధకత

రాకుండా జాగ్రత్తపడటం మంచిది


వచ్చిందంటే వదలడం మహా కష్టం

పరిశోధన దశలో మూడే మందులు

కొత్తగా వచ్చే అవకాశాలు అంతంతే

77 దేశాలలో కొనసాగిన పరిశోధన

జంట నగరాల్లోనూ అదే పరిస్థితి





హైదరాబాద్, జనవరి 8:

ఐదు నిమిషాల శారీరక సుఖం కోసం చూసుకుంటే జీవితాంతం వదలని సుఖవ్యాధులు పట్టి పీడిస్తాయి. ఇంతకుముందయితే ఏవో నాలుగు రకాల మందులు వేసుకుంటే అవి నయమయ్యేవి. కానీ, ఇప్పుడు ఎన్ని రకాల మందులు వాడినా లొంగని మొండిఘటంలా 'గనేరియా' తయారైంది. ఈ **మిగతా 6లో..**



అంపశయ్యపై 'బిల్ట్'

జీతాల్లేక కార్మికుల ఆకలి కేకలు

దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలు

నిరాహార దీక్షతో కార్మికుల నిరసన

నెలల తరబడి తెరుచుకోని గేట్లు

అండగా ఉంటామన్న రాష్ట్ర ప్రభుత్వం

అయినా స్పందించని యాజమాన్యం

నేడు సర్కారు-యాజమాన్యం చర్చలు

శుభవార్త వస్తుందని కార్మికుల ఎదురుచూపు

హైదరాబాద్, జనవరి 8(మనం ప్రతినిధి):

దేశంలోని అతిపెద్ద కాగితం పరిశ్రమలలో అదొకటి.. కొంతకాలం క్రితం కార్మికులతో కళకళలాడిన పరిశ్రమ.. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి అన్నం పెట్టిన పరిశ్రమ నేడు మూగబోయింది. యాజమాన్య వైఖరితో **మిగతా 6లో..**

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం

- **ఆ దిశగా కొత్త పంచాయతీరాజ్ చట్టం**
- **సబ్ కమిటీ తొలి సమావేశంలో జూపల్లి**

హైదరాబాద్, జనవరి 8: మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందిస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనకు ఏర్పాటుచేసిన మంత్రుల సబ్ కమిటీ తొలి సమావేశం సోమవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలో జరిగింది. మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కేటీఆర్, తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, ఇంద్రకరణ్ రెడ్డి, అధికారులు హాజరయ్యారు. గ్రామాల రూపురేఖలు మార్చేలా.. గ్రామస్వరాజ్యం సాకారమయ్యేలా చట్టం రూపొందుతుందని ఆ సమావేశం అనంతరం మంత్రి జూపల్లి మీడియాతో అన్నారు. సర్పంచులకు మరిన్ని అధికారాలు, పెద్ద ఎత్తున నిధులు ఇవ్వడం ద్వారా స్థానిక సంస్థలను బలోపేతం చేస్తామన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు. ఖర్చు తగ్గించేలా ఎన్నికల ప్రక్రియను త్వరగా పూర్తి చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సబ్ కమిటీ సూచించింది. మరిన్ని అంశాలపై చర్చించేందుకు మంగళవారం కూడా సబ్ కమిటీ సమావేశం జరుగుతుందని చైర్మన్ జూపల్లి కృష్ణారావు తెలిపారు.

ఫేక్‌న్యూస్ అవార్డుల వాయిదా

- **ఈ నెల 17న ఇస్తామన్న డొనాల్డ్ ట్రంప్**

వాషింగ్టన్, జనవరి 8: అమెరికన్ మీడియా మీద ఇప్పటికే తీవ్ర స్థాయిలో మండిపడుతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాను ప్రకటిస్తానని చెప్పిన 'ఫేక్ న్యూస్ మీడియా' అవార్డులను ఈనెల 17కు వాయిదా వేశారు. 'అత్యంత అవినీతిమయమైన, పక్షపాతంతో కూడిన' అమెరికన్ ప్రధానస్రవంతి మీడియాకు వాళ్ల అవినీతికి గాను అవార్డులు ఇస్తామని ఆయన అన్నారు. సీఎన్ఎన్, ఏబీసీ న్యూస్, ద న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్ లాంటి ప్రధాన మీడియాతో ట్రంప్ ఎప్పటి నుంచో జుట్టు జుట్టు పట్టుకుంటున్నంత పని చేస్తున్నారు. ఈసారి ఏకంగా ఫేక్ న్యూస్ అవార్డులు ఇస్తామని చెప్పారు. వాస్తవానికి 8వ తేదీనే ఇవి ఇస్తామని తొలుత చెప్పినా, తర్వాత దాన్ని 17కు వాయిదా వేస్తున్నట్లు తాజాగా ట్వీట్ చేశారు. ఈ అవార్డుల ప్రాధాన్యం, వాటిపై ఆసక్తి అందరూ ఊహించినదాని కంటే చాలా ఎక్కువగా ఉందన్నారు. వివిధ విభాగాలలో నిజాయితీరాహిత్యం, చెడ్డ రిపోర్టింగ్ అంశాల కింద అవార్డులు ఇస్తామని.. ఇచ్చేవరకు వేచి చూడాలని ఆయన తన ట్వీట్ల వరుసలో పేర్కొన్నారు. మొత్తం అందరికంటే ఘనులకు కింగ్ ఆఫ్ ఫేక్ న్యూస్ ట్రోఫీ కూడా ఇస్తామని గత సంవత్సరం నవంబరు 27న చెప్పారు. ఏయే పత్రికలు 'పొరపాటున' అంటూ అధ్యక్ష ఎన్నికల సమయంలో తన పరువు తీయడానికి, తనపై బురద చల్లడానికి ఎలా ప్రయత్నించాయో ఎన్నికల తర్వాత తేదీలతో సమా ఆయా వార్త సంస్థలను పేర్కొంటూ ట్రంప్ ట్విట్టర్‌లో విరుచుకుపడ్డారు. చివరకు తాను అధ్యక్షుడినైన తర్వాత కూడా టైమ్ పత్రిక 'పొరపాటు'గానే.. తాను ఓవల్ కార్యాలయం నుంచి మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ విగ్రహాన్ని తొలగించినట్లు రాసిందని చెప్పారు.



బార్‌లో భారీ అగ్నిప్రమాదం

- **ఈసారి బెంగళూరులో దారుణం**
- **ఐదుగురు సిబ్బంది సజీవ దహనం**

బెంగళూరు, జనవరి 8: బెంగళూరులోని కలాసి పాళ్యం ప్రాంతంలో సోమ వారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కైలాష్ బార్ అండ్ రెస్టారెంట్లో సంభవించిన ఈ ప్రమాదంలో ఐదుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. వీరంతా పొట్టకూటి కోసం బెంగళూరుకు వలస వచ్చిన వారేనని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో తూమకూరుకు చెందిన స్వామి(23), ప్రసాద్(20), మహేశ్ (35)లతో పాటు హసాన్ నుంచి వచ్చిన మంజునాథ్(45), మాండ్యాకి చెందిన కీర్తి(24) ఉన్నారు. తెల్లవారు జామున 2:30 గంటలకు సిబ్బంది గాఢనిద్రలో ఉన్న సమయంలో రెస్టారెంట్‌లో మంటలు చెలరేగాయని, దీంతో ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమేంటనేది ఇంకా తెలియరాలేదని వెస్ట్ డివిజన్ డీసీపీ ఎమ్ఎన్ అనుచేథ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే విచారణ ప్రారంభిం చామని, విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రమాదంపై సమాచారం అందగానే మూడు ఫైరింజన్లతో సహాయక బృందాలు తరలివెళ్లాయి. అయితే అప్పటికే రెస్టారెంటులో మంటలు అలుముకోవడంతో నిద్రిస్తున్న బాధితులను కాపాడలేకపోయామని అధికారులు పేర్కొన్నారు.




వరంగల్ జిల్లాలో జరిగే మేడారం జాతరకు రావాలని మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగరరావు, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ను ఆహ్వానిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్



అబుదాబిలో భారతీయుడికి జాక్‌పాట్

లాటరీలో రూ.20 కోట్లు గెల్చుకున్న హరికృష్ణ

అబుదాబి, జనవరి 8: ఉద్యోగం కోసం దుబాయ్ వలస వెళ్లిన ఓ కేరళ జంటకు భారీ జాక్‌పాట్ తగిలింది. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలన్న చందంగా.. కనీవినీ ఎరుగని మొత్తాన్ని వారు గెల్చుకున్నారు. ఇటీవల కొనుగోలు చేసిన ఓ లాటరీలో జాక్‌పాట్ విన్నర్‌గా నిలిచి ఏకంగా 12 మిలియన్ దీరామ్(అక్షరాలా ఇరవై కోట్ల రూపాయ)లు అందుకోబోతున్నారు. అబుదాబి చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తాన్ని ఇప్పటి వరకూ ఎవరూ గెల్చుకోలేదని సమాచారం. ఈ లాటరీ విజేత తానేనన్న సమాచారాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని హరికృష్ణన్ వి. నాయర్ చెబుతున్నారు. భారత్‌లోని కేరళకు చెందిన హరికృష్ణ భార్య, కొడుకుతో ఉద్యోగ రీత్యా దుబాయ్ వెళ్లారు. స్థానికంగా ఉన్న ఓ కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. ఉద్యోగ విధుల తర్వాత అప్పుడప్పుడూ లాటరీ టికెట్‌లు కొనుగోలు చేస్తూ తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం హరికృష్ణకు అలవాటు.. ఈ క్రమంలో ఆయన కొనుగోలు చేసిన బిగ్ రాఫిల్ డ్రా లాటరీ టికెట్‌కు బంపర్ ప్రైజ్ లభించింది. లాటరీలో ఏకంగా జాక్‌పాట్ తగిలి 20 కోట్ల రూపాయలను అందుకోబోతున్నారు. గతంలోనూ ఒకటీ రెండు సార్లు లాటరీ టికెట్లు కొన్నా ఎలాంటి బహుమతి అందుకోలేదని హరికృష్ణ తెలిపారు. కాగా, లాటరీ బహుమతి కింద అందుకోనున్న పెద్ద మొత్తంతో ఏం చేయనున్నారని స్థానిక మీడియా హరికృష్ణను ప్రశ్నించగా.. ప్రస్తుతానికి ఏంచేయాలనే విషయం ఆలోచించలేదని చెప్పారు. ప్రపంచాన్ని చుట్టిరావాలని ఎప్పటి నుంచో తనకున్న కోరికను త్వరలో తీర్చుకోనున్నట్లు తెలిపారు. దీంతోపాటు కుటుంబానికి అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేయడం, సామాజిక సేవాపరమైన కార్యకలాపాలకు కొంత దానం చేయనున్నట్లు వివరించారు.



ప్రియుడితో కలిసి భర్త హత్య

- **అక్రమ బంధానికి అడ్డు తగిలాడనే..**
- **రాజన్న సన్నిధిలో ఓ మహిళ దారుణం**
- **ఆలయ సమీపంలో కిరాతకం.. ఆపై పరారీ**



వేములవాడ, జనవరి 8(మనం న్యూస్): తన అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడనే ఉద్దేశంతో ఓ మహిళ తన భర్తనే కడతేర్చింది. ప్రియుడి సాయంతో గొంతుకోసి అతి కిరాతకంగా హత్య చేసింది. వేములవాడ రాజన్న ఆలయం సమీపంలోనే ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం! మెదక్ జిల్లా ఘన్‌పూర్ మండలం నంగనూర్‌కు చెందిన బండి బాలయ్య(37) పెళ్లయిన కొత్తలోనే గల్ఫ్‌కు వలస వెళ్లాడు. కొత్తగా పెళ్లయినా.. కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలు తీరాలంటే కొంతకాలం భార్య నర్సవ్వకు దూరంగా ఉండక తప్పదని నిర్ణయించుకున్నాడు. కొన్ని సంవత్సరాలపాటు అక్కడే గడిపి ఇటీవలే తిరిగి వచ్చాడు. అయితే, భర్త గల్ఫ్‌కు వెళ్లడంతో నర్సవ్వకు స్థానికంగా ఉండే ఓ యువకుడితో అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ బంధం ఇలా కొనసాగుతుండగా.. భర్త బాలయ్య తిరిగి రావడం నర్సవ్వకు ఆటంకంగా మారింది. ప్రియుడిని కలుసుకోవడం కుదరకపోవడంతో భర్తను అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా ప్రియుడిని, భర్తను తీసుకొని నర్సవ్వ వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంది. సాయంత్రంపూట భర్తకు మద్యం తాగించి మత్తులోకి జారుకునేలా చేసింది. అర్ధరాత్రి దాటాక ప్రియుడితో కలిసి కత్తితో దాడిచేసి గొంతుకోసింది. దీంతో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నర్సవ్వ తన ప్రియుడితో కలిసి పారిపోయింది. కాగా, నాలుగు నెలల క్రితం వేములవాడ పట్టణానికి చెందిన వివాహితపై దాడిచేసిన భర్త నడిరోడ్డుపై గొంతుకోసి చంపిన సంఘటన మరువక ముందే తాజా ఘటన చోటుచేసుకోవడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే, బాలయ్య హత్యకు పాల్పడిన నర్సవ్వ, ఆమె ప్రియుడు ప్రస్తుతం పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. వారికోసం గాలింపుచర్యలు చేపట్టినట్లు వేములవాడ టౌన్ సీఐ వెంకటస్వామి తెలిపారు.



అక్రమార్కుల ముఠా పట్టివేత

- రాష్ట్రం దాటుతున్న పీడీఎస్ బియ్యం
- ఒక లారీ సహా 5 వాహనాలు సీజ్
- అమ్మకానికి తరలిస్తున్న 'సబ్సిడీ' గొర్లు
- క్రయవిక్రయాలు నేరం.. పీడీయాక్ట్ నమోదు

నెల్లికుదురు, జనవరి 8(మనంన్యూస్): ప్రభుత్వం పేదలకు రూపాయికి కిలో బియ్యం అందిస్తున్న ప్రజాపంపిణీ బియ్యం అక్రమ తరలింపు దారులు పక్కదారి పట్టించడంపై ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. పి.డి.ఎస్ బియ్యం అక్రమ రవాణాదారులపై పీడీ యాక్ట్ ఉపయోగిస్తామని హెచ్చరించారు. నెల్లికుదురు ఎస్సై గోదరి రాజ్‌కుమార్ అధ్వర్యంలో పోలీసులు మాటువేసి సోమవారం నాడు పట్టుకున్నారు. కురవి మండలం అయ్యగారిపల్లికి చెందిన చెరువేరిల నవీన్, మానుకోటకు చెందిన తవిసి వీరబద్రంలు గత కొన్ని సంవత్సరాలుగా పిడిఎస్ బియ్యంను అక్రమంగా ప్రజల నుంచి రూ.10 రూపాయాలకు కిలో కొనుగోలు చేస్తూ మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో పక్కా సమాచారం మేరకు మండలంలోని ఆలేరు శివారు బోడ్యతండ సమీపంలో నెల్లికుదరు పోలీసులు బియ్యం తరలిస్తున్న లారీ, బోలేరో, రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని పట్టుకున్నారు. లారీ, బోలేరోలోనిసుమారు 200 క్వింటాల బియ్యాన్ని సంబందిత వాహనాలను సీజ్ చేశామన్నారు. సంబందిత అక్రమ రవాణాదారులు నవీన్, వీరభద్రంలతోపాటు కూలీలు గుంటి శ్రీకాంత్,అజ్మీరా శంకర్, తాజ్ మహమ్మద్‌లను అరెస్ట్ చేశామన్నారు. మరో నలుగురు మానుకోట మండలం పర్వతగిరిగ్రామానికి చెందిన భూక్య విష్ణు, నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట గ్రామానికి చెందిన ఉపేందర్, ఈగ మంగయ్య,శంకర్‌లు పరారీలోఉన్నట్లు తెలిపారు. వీరందరిపై రౌడీషీట్ ఓపెన్‌చేసి పిడియాక్ట్‌కు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడి గొర్లు అమ్మే వాళ్లను వదలం..

గొల్లకుర్మలకు ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ గొర్లను అక్రమంగా ఖరీదుచేసి తరలిస్తున్న ముఠాను మండలంలోని రామకృష్ణ పాఠశాల క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై గోదరిరాజ్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నెల్లికుదురు వైపునుంచి బొలేరో వాహనంలో తరలిస్తున్న అక్రమ గొర్లను గుర్తించామన్నారు. మండలంలోని రావిరాల చెందిన పోతరాజు యాదయ్య, కత్తుల నాగయ్యలు తమకు వచ్చిన 27 సబ్సిడి గొర్లను సూర్యపేట జిల్లా నూతన్‌కల్ మండలం, చిలపకుంట గ్రామానికి చెందిన జెటెంగి లింగయ్యకు అమ్ముకున్నారు. వీటిని బొలేరోవాహనంలో తరలిస్తున్న క్రమంలో స్వాదీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య



గుమ్మిడిదల, జనవరి 8(మనం న్యూస్): సహచర విద్యార్థుల వేధింపులు తట్టుకోలేక ఓ విద్యార్థిని ఆత్మహత్య ప్రయత్నం చేసింది. ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రగాయాలపాలైన యువతిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. గుమ్మిడిదల మండలం దోమడుగు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న హైస్కూల్లో చదువుకుంటున్న విద్యార్థిని లావణ్య(14) తోటి విద్యార్థుల వేధింపులతో మనస్థాపం చెందింది. ఈ నెల 2న స్కూలునుంచి ఇంటికి చేరుకున్న లావణ్య.. ఇంట్లోని కిరోసిన్‌ను ఒంటిపై చల్లుకుని నిప్పంటించుకుంది. దీనిని గమనించిన తల్లిదండ్రులు వెంటనే మంటలు ఆర్పి లావణ్యను గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్సపొందుతూ లావణ్య సోమవారం మృతి చెందింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై మహిళ, విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం కలిగించాల్సిన అధ్యాపకులు, వేధిస్తుంటే ఏంచేస్తున్నారని వారు నిలదీశారు. లావణ్య మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హీరో నితిన్‌పై కేసు కొట్టివేత

- **'అఖిల్ ' సినిమా కేసులో హైకోర్టు తీర్పు**

హైదరాబాద్, జనవరి 8 (మనం లీగల్ ప్రతినిధి): అఖిల్ సినిమా హక్కులు ఇవ్వలేదంటూ తెలుగు సినిమా హీరో నితిన్, ఆయన సోదరిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టేస్తూ తీర్పు చెప్పింది. హీరో నితిన్, ఆయన సోదరి నిఖితారెడ్డిపై అభియోగాలను కొట్టివేస్తూ హైకోర్టు న్యాయమూర్తిఎం.సత్యనారాయణమూర్తి ఇటీవల తీర్పు చెప్పారు. అఖిల్ అనే సినిమా హక్కుల కోసం తమ వద్ద రూ.50 లక్షలు తీసుకుని ఇవ్వలేదంటూ స్థానిక సైనిక్‌పురి కాలనీకి చెందిన గంగాధర సత్యనారాయణ మల్కాజిగిరిలోని 20వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో 2017 సెప్టెంబర్‌లో కేసు వేశారు. ఈ కేసులో వరసగా శ్రేష్ఠ మూవీస్, నిర్మాత అయిన నితిన్ తండ్రి సుధాకర్‌రెడ్డిలపై, నిఖిత, అఖిల్‌లు నిందితులుగా చేర్చిన కేసులో కోర్టు సమన్లు జారీ చేసింది. శ్రేష్ఠ మూవీస్ సుధాకర్‌రెడ్డికి సంబంధించినదని, తమపై కావాలని కేసు పెట్టారని నితిన్, నిఖితల వాదనను హైకోర్టు ఆమోదించింది.


ఈ పుట్టిన రోజు నాకు ప్రత్యేకం: తరుణ్

- **విద్యార్థుల ధాతృత్వం గొప్ప విషయం**
- **అనాథల మధ్య పుట్టిన రోజు వేడుకలు**

హైదరాబాద్, జనవరి 8: వందలాది చిన్నారుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని సినీ నటుడు తరుణ్ పేర్కొన్నారు. సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి నగరంలోని అనాథ పిల్లలతో ఆయన ఆడిపాడారు. ఈ సందర్భంగా అనాథాశ్రమాలకు 200 కిలోల బియ్యం, 150 కిలోల పిండి, 100 కిలోల పప్పులు, చక్కెర సహా సబ్బులు, బ్రష్‌లు, బట్టలు, షాంపూలు తదితర వస్తువులను తరుణ్ అందజేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పల్లవి మోడల్ స్కూల్ భాగస్వామ్యం వహించింది. ఈ కార్యక్రమంలో జంట నగరాల చుట్టు పక్కల ఉన్న మొత్తం 28 అనాథాశ్రమ పిల్లలను ఒకచోట చేర్చి వేడుకలు నిర్వహించారు. అనాథ పిల్లలకు వస్తువులు, దుస్తుల పంపిణీ తర్వాత నిర్వాహకులు విద్యార్థినీ విద్యార్థుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో తరుణ్‌కూడా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పుట్టిన రోజు తనకు ప్రత్యేకంగా గుర్తుండిపోతుందని అన్నారు. సుమారు ఏడు వందల మంది పిల్లల కేరింతల మధ్య కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చి అనాథలకు తమ వంతు సాయం చేయడం గొప్ప ముందడుగని పేర్కొన్నారు.



అమెరికా మా మిత్ర దేశం కాదు



- **ఆ దేశంతో మైత్రి ముగింపు దశకు చేరింది**
- **పాక్ విదేశాంగ మంత్రి అసిఫ్ వ్యాఖ్య**
- **ఉగ్ర స్థావరాల నిర్మూలనకు పాక్‌ను చైనా ఒప్పించాలి: అమెరికా**

ఇస్లామాబాద్, జనవరి 8: అమెరికా ఇక తమకు ఎంతమాత్రం మిత్రదేశం కాదని పాకిస్థాన్ తేల్చి చెప్పింది. మిత్రదేశంగా వ్యవహరించాల్సిన తీరు ఇది కాదంటూ అగ్రరాజ్యాన్ని ఘాటుగా విమర్శించింది. ఉగ్ర స్థావరాల నిర్మూలనలో విఫలమైందంటూ పాక్‌కు అమెరికా సైనిక సాయం నిలిపివేసిన నేపథ్యంలో పాక్ స్పందించింది. ప్రముఖ దినపత్రిక 'వాల్ స్ట్రీట్ జర్నల్'తో పాక్ విదేశాంగ మంత్రి ఖ్వాజా అసిఫ్ మాట్లాడుతూ.. అమెరికాతో మైత్రి ముగింపు దశకు చేరుకుందన్నారు. 'మా మధ్య ఎలాంటి సత్సం బంధాలు లేవు. మిత్ర దేశాలు ప్రవర్తించాల్సిన తీరు ఇది కాదు' అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలకు విరుద్ధంగా... అమెరికాతో స్నేహ సంబంధాలు కొనసాగుతాయని పాక్ విదేశాంగ కార్యదర్శి తెహ్మీనా జంజువా పేర్కొనడం గమనార్హం. దక్షిణాసియాపై తీవ్ర ప్రభావం చూపగల అగ్రదేశం కావడంతో అమెరికాతో వీలైనంత వరకూ సత్సంబం ధాలు కొనసాగించాలన్నదే పాకిస్థాన్ అభిమ తమన్నారు. పాక్‌లోని ఉగ్ర స్థావరాల్ని నిర్మూలించేలా.. ఆ దేశాన్ని మిత్ర దేశమైన చైనా ఒప్పించగలదని అమెరికా ఆశాభావం వ్యక్తం చేసింది. ఉగ్ర సంస్థలపై ఉక్కుపాదం మోపడం చైనా జాతీయ విధానమైం దున.. ఆ దేశం స్పందించాలని వైట్‌హౌస్ అధికారి సూచించారు. పాక్‌లో ఉగ్ర స్థావరాల ధ్వంసంతో దక్షిణాసియాలో సుస్థిరత సాధ్యమవుతుందన్నారు. ఇదిలా ఉండగా, అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సైనిక చర్య చేపట్టడం మంచిదేనని, అయితే అది విఫలమైతే అమెరికాతో పాటు పాక్‌కు కూడా ఊహించని రీతిలో పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని 'డాన్' పత్రిక హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అమెరికా చాలా జాగ్రత్తగా చర్యలు ప్రారంభించాలని కూడా ఆ పత్రిక తన సంపాదకీయంలో సూచించింది.

పాక్‌లో విస్తరిస్తున్న ఐసిస్

ఇస్లామాబాద్, జనవరి 8: పాకిస్థాన్ భూభాగంలో ఉగ్రవాదాన్ని అరికట్టడంలో ఆదేశం ఘోరంగా విఫలమైందని ఓ వైపు ఆరోపిస్తుండగా.. అందుకు బలం చేకూర్చేలా ఓ నివేదిక వెల్లడైంది. ఇరాక్, సిరియాలో అంతిమ ఘడియ లను ఎదుర్కొంటున్న ఐసిస్ ఉగ్రవాద సంస్థ.. పాక్‌లో మాత్రం పుంజుకుంటోందని వెల్లడైంది. ఈ విషయం పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పీస్ స్టడీస్ (పీఐపీఎస్) అధ్యయంలో వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా సింధ్, బలూచిస్థాన్ ప్రావి న్స్‌లలో ఐసిస్ క్రియాశీలంగా ఉందని ఆ సంస్థ అధ్యయనంలో తేలింది. కొద్ది రోజుల క్రితం ఇద్ద రు చైనీయుల హత్య వెనుక ఐసిస్ ఉందని కూడా తేల్చింది. దేశవ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లను, ఉగ్రవాద కార్యకలాపాలను పరిశీలించిన అనంత రం ఈ నివేదిక రూపొందించినట్లుగా తెలిపింది. పాక్‌లో జరిగి ఉగ్రదాడుల్లో 58 శాతం వరకు తెహ్రీక్ ఇ తాలిబన్ సంస్థ పేలుళ్ల పాల్పడగా, 37 శాతం దాడులను జాతీయ తీవ్రవాదులు చేశారని ఆ నివేదిక వెల్లడించింది.

'పంచాయతీ' కేబినెట్ కమిటీలో ఎస్సీ, ఎస్టీలకు స్థానం లేదా?

- టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ

హైదరాబాద్, జనవరి 8 (మనం న్యూస్): పంచాయతీరాజ్ బిల్లు రూపకల్పనపై నియమించిన కేబినెట్ క్యాబినెట్ కమిటీలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులెవరూ లేకపోవడం దురదృష్టకరమని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ పాలన ఏ విధంగా సాగుతుందో తెలుసుకునేందుకు ఇదొక ఉదాహరణ అని ఆయన విమర్శించారు. టీటీడీపీ మండల స్థాయి కార్యకర్తలకు నిర్వహిస్తున్న నాయకత్వ శిక్షణా తరగతుల రెండో బ్యాచ్‌ను ఆయన సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో ప్రారంభించారు.

ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిలోనే జరిపించాలన్నారు. పదేళ్లు ప్రజలను వంచించిన కాంగ్రెస్‌కు, హామీలను నెరవేర్చకుండా మూడున్నరేళ్లుగా ప్రజలను మభ్యపెడుతున్న టీఆర్ఎస్ పార్టీకీ టీడీపీ సమాన దూరం పాటిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, బొట్ల శ్రీనివాస్, టీఎన్‌టీయూసీ అధ్యక్షులు బి.ఎన్.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేతి విద్యాసాగర్‌కు మాతృ వియోగం

హైదరాబాద్, జనవరి 8 (మనం ప్రతినిధి): కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాతృమూర్తి రాధమ్మ సోమవారం కన్నుమూశారు. నిమ్స్‌లో చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందారని కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విద్యాసాగర్ స్వగ్రామం నల్లగొండ జిల్లా చెరుకుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. రాధమ్మ మృతిపట్ల మంత్రులు కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.



జనం కోసం 'మనం'

- క్యాలండర్ ఆవిష్కరణలో
- ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు

మందమర్రి, జనవరి 8, (మనం న్యూస్): 'మనం' పత్రిక జనం కోసం, జనహితం కోసం పాటుపడుతోందని ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు శ్లాఘించారు. . మందమర్రిలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'మనం' పత్రిక నూతన సంవత్సర క్యాలండర్‌ను విప్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ఒక మహత్తర ఆశయంతో పత్రిక ముందుకు పోతోందని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ పత్రిక సముచిత పాత్ర పోషిస్తున్నదని కొనియాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు పని చేస్తున్నందు వల్లే పల్లెల్లో అభివృద్ధి ఫలాలు చేరుతున్నాయని తెలిపారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు నోముల ఎల్లాగౌడ్, వైద్యం ప్రసాద్, పైడిమల్ల నర్సింగ్, రాంసురేశ్, వాసాల సంపత్, 'మనం' పత్రిక మంచిర్యాల ప్రతినిధి పార్వతి సురేశ్, ఆర్‌సీ ఇంచార్జి కె.లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ కార్మికుల ధర్నా



హైదరాబాద్, జనవరి 8 (మనం న్యూస్): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో టీఎస్ఆర్టీసీ కార్మికులు మంగళవారం ధర్నా చేపట్టనున్నారు. కార్మికులకు 62 శాతం ఫిట్‌మెంట్ గతేడాది ఏప్రిల్ నుంచి అమలు చేయాలని, బలవంతపు డ్యూటీలను వేయొద్దని, వేతన సవరణలో డ్రైవర్లకు మూడు సర్వీసు వెయిటేజీలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. పదోన్నతుల విషయంలో, పని భారాన్ని తగ్గించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ కనీసం రూ.10 వేలు నిర్ణయించాలని, కార్మికుల పట్ల గుదిబండగా మారిన సర్క్యులర్-1ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బస్‌భవన్ వద్ద ధర్నాకు ఎన్ఎంయూ పిలుపునిచ్చింది.

జానపద కళ.. గంగిరెద్దుల ఆట


- ఆటాడిస్తే అరెస్టులు ఉండవ్: ఎంబీసీ చైర్మన్

హైదరాబాద్, జనవరి 8(మనం ప్రతినిధి): గంగిరెద్దుల ఆట అనేది జానపద కళ అని గంగిరెద్దుల సంచార కుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు సీతయ్య, రాష్ట్ర అధ్యక్షుడు జె.నర్సింహా పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ భవన్‌లో సోమవారం నాడు గంగిరెద్దుల ఆటను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్‌కు వినతిప్రతం అందజేశారు. గంగిరెద్దుల ఆటలాడితే ఇక నుంచి పోలీసులు అరెస్టు చేయరని తెలిపారు. పోలీసుల అరెస్టు విషయమై మంత్రులు ఈటల రాజేందర్, జోగు రామన్నలను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. తరతరాలుగా పర్వదినాల సమయంలో గంగిరెద్దుల ఆటలడిస్తున్నామని పేర్కొన్నారు. గంగిరెద్దుల ఆట భిక్షాటన కాదని సంఘం నేతలు తెలిపారు. గంగిరెద్దుల వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ జీవనాధారం కల్పించాలని కోరారు. ఆటో, ట్రాలీల్లో గిన్నెలు, స్టీల్ వస్తువులు, ఇతరత్రా వస్తువులు అమ్ముకునేందుకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. దళిత, గిరిజనులకు ఇచ్చినట్టుగా తమకు మూడెకరాల భూమి అందజేయాలని కోరారు. మంత్రులు చేసిన విజ్ఞప్తి మేరకే సీఎం స్పందించారని ఎంబీసీ చైర్మన్ తెలిపారు. ఆయనకు గంగిరెద్దుల వారు, సంఘం నేతలు ధన్యవాదాలు తెలిపారు.

చీఫ్ పదవి ఆశించింది నిజమే..

- ఎవరున్నా కలిసే పనిచేస్తాం: వెంకటరెడ్డి

హైదరాబాద్, జనవరి 8(మనం ప్రతినిధి): టీపీసీసీ చీఫ్ పదవి ఆశించింది నిజమే అయినా.. ఆ స్థానంలో ఎవరున్నా అంతా కలిసే పనిచేస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌ను కొనసాగిస్తున్నట్లు ఏఐసీసీ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం కోమటిరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అధ్యక్ష రేసులో ఉండి భంగపడ్డ నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడిగా ఎవరున్నా అందరం కలిసే పనిచేస్తామని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావటమే తమ లక్ష్యమని చెప్పారు. తలా కొన్ని నియోజకవర్గాల బాధ్యతలను చేపట్టి పార్టీని గెలిపించడానికి కృషిచేస్తామని వివరించారు. బస్సుయాత్ర, పాదయాత్ర ఏదైనా, అధిష్టానం సూచనల మేరకు నడుచుకుంటామని తెలిపారు.



సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు

మందమర్రి, జనవరి 8, (మనం న్యూస్): సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తోందని ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు అన్నారు. గతంలో ప్రభావిత ప్రాంతాలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ప్రాంతాల అభివృద్ధికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు (డీఎంఎఫ్‌టి)ను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మందమర్రి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంచిర్యాల జిల్లా నుండి బొగ్గు, సున్నపురాయి, ఇసుక తరలిపోతోందని ఆయన అన్నారు. దీని మూలంగా ఈ ప్రాంతంలో జరుగుతున్న నష్టాన్ని నివారించి ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని ఆయన తెలిపారు. జిల్లాలో సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ప్రాంతాల అభివృద్ధికి 130 కోట్ల నిధులకు కేటాయించిందన్నారు. బొగ్గు గనులకురెండు కిలోమీటర్ల పరిధిలోఉన్న గ్రామాలు,పట్టణాల అభివృద్ధికి నిధులను వెచ్చించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభావిత ప్రాంతాలలో తాగునీరు, పర్యావరణ పరిక్షణ, విద్యాభివృద్ధి, మహిళలు, పిల్లల, వృద్ధులు, వికలాంగుల సంక్షేమంతో పాటు నీటి పారుదల, విద్యుత్ సరఫరా, వాటర్ షెడ్‌ల నిర్మాణం పనులను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య, మేనేజర్ గంగాధర్, ఏఈ అచ్యుత్, సింగిల్ విండో చైర్మన్ ఎస్.ప్రభాకర్‌రావు, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.ప్రభాకర్, జె.రవీందర్, వివిధ వార్డుల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతిపై అబద్ధాలు

- ఇసుక మాఫియావల్లే సాయిలు మృతి
- గవర్నర్ సహా మంత్రులు బురదజల్లుతున్నారు
- సాయిలు కుటుంబాన్ని ఆదుకోవాలి
- రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలి: ఉత్తమ్
- టీపీసీసీ చీఫ్‌ను కలిసిన సాయిలు కుటుంబసభ్యులు

హైదరాబాద్, జనవరి 8 (మనం ప్రతినిధి): ఇసుక మాఫియాకు బలైన వీఆర్ఏ సాయిలు మృతిపై గవర్నర్ సహా మంత్రులు బురద జల్లుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఇసుక మాఫియాకే సాయిలు బలి అయ్యాడని పేర్కొన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఉత్తమ్‌ను సాయిలు కుటుంబసభ్యులు కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇసుక ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన సాయిలు కుటుంబానికి ప్రభుత్వం రూ. 25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పిల్లలకు ప్రభుత్వం ఉచిత విద్య అందించాలన్నారు. గతంలో జరిగిన నేరళ్ల ఘటన సందర్భంగానూ అధికారులు వికృతంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇప్పుడేమో మంత్రులు, అధికారులు, ఇసుక మాఫియా కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఇసుక ట్రాక్టర్ యజమానిపై మర్డర్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసులు, గవర్నర్ కుమ్మక్కవటం సమాజానికి ప్రమాదమన్నారు. సాయిలు ముమ్మాటికి వీఆర్ఏ అనేది నిజమన్నారు. జీతం తీసుకున్న రశీదులు కూడా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ రాజకీయాలు చేయటం లేదని, బాధితులకు న్యాయం చేయాలనిదే తమ లక్ష్యమన్నారు. కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





సంక్రాంతి తర్వాత కొత్త పీసీసీ

ప్రతి కాంగ్రెస్ కార్యకర్త మా కుటుంబసభ్యులేనని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో 2019లో తమ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏ కష్టమొచ్చినా కార్యకర్తలు తనకు ఫోన్ చేయాలని సూచించారు. రాష్ట్రం నుంచి ఏఐసీసీలో ప్రాతినిధ్యం ఉంటున్నారు. మేడారం జాతరను దృష్టిలో పెట్టుకుని రాహూల్ పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓయూలో రాహూల్ సభకు ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. సంక్రాంతి తర్వాత కొత్త పీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్టు స్పష్టం చేశారు. ప్రచార, మ్యానిఫెస్టో కమిటీలు ఉంటాయన్నారు. టీఆర్ఎస్ మునిగే నావ అని జనం అంటున్నారని తెలిపారు. సర్పంచ్‌ల ఎన్నికలు నేరుగా ఉండాలి లేదంటే ప్రజాస్వామ్యం లేకుండా పోతుందని విమర్శించారు. త్వరలో తెలంగాణలో బస్‌యాత్ర ఉంటుందని తెలిపారు. డీలిమిటేషన్ తీసుకురావాలని టీఆర్ఎస్ వత్తిడి తెస్తుందన్నారు. తనను టీపీసీసీ అధ్యక్షులుగా కొనసాగిస్తూ ఆదేశాలిచ్చిన ఏఐసీసీ అధ్యక్షులు రాహూల్‌గాంధీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులుగా కొనసాగిస్తున్నట్టుగా అధిష్టానం ప్రకటించిన అనంతరం గాంధీభవన్‌కు వచ్చిన ఆయనకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

దేశమంతా తెలంగాణవైపు చూస్తోంది

- పెట్టుబడి పథకం నేరుగా రైతుకు చేరాలి
- సబ్ కమిటీ భేటీలో పోచారం వెల్లడి



హైదరాబాద్, జనవరి 8(మనం ప్రతినిధి): రైతుల సంక్షేమంకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలతో దేశమంతా తెలంగాణవైపు చూస్తోందని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రకటించిన ప్రతి సీజన్‌లో ఎకరాకు 4 వేల పథకాన్ని ఎలాంటి ఇబ్బందిలేకుండా రైతులకు చేర్చాలనే అంశంపై మంత్రులు చర్చించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ... రెవెన్యూ ప్రక్షాళన తర్వాత కేటగిరి ఏ కింద రాష్ట్రంలో 71.75 లక్షల మంది రైతు ఖాతాలు ఉన్నట్టు లెక్క తేలిందన్నారు. మొదటి సమావేశంలో అందరి అభిప్రాయాలను తీసుకున్నామని, ఈ నెల 10న మరోసారి సమావేశం కానున్నట్టు తెలిపారు. కమిటీ సభ్యులు గ్రామాల్లో సభలు, సమావేశాల ద్వారా రైతులు, ప్రజానిధుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే పంట పెట్టుబడి పథకం నగదు నేరుగా రైతులకు చేరాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు ఉన్న బ్యాంకు ఖాతాల్లోనే ఈ నగదును జమచేసినట్టయితే పాత బకాయిల కింద జమకడతారని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని, దీనికోసం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ అభిప్రాయాన్ని అడిగామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్, కేటీఆర్, సీఎస్ రాజీవ్ శర్మ, వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ శాఖ కమిషనర్ ఎం.జగన్మోహన్, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


'టీఆర్టీ'లో తప్పుల సవరణ

- ఆన్‌లైన్‌లోనే అవకాశం: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, జనవరి 8 (మనం న్యూస్): టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)కు దరఖాస్తు గడువు ముగిసింది. 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఆన్‌లైన్ అప్లికేషన్‌లోని బయోడేటాలో తప్పులు ఉంటే సవరించుకోవాలని టీఎస్‌పీఎస్సీ అధికారులు సూచించారు. ఒక్కసారి మాత్రమే తప్పులు సరిచేసుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఓ సారి సవరణ జరిగిన చేసి, సబ్మిట్ చేశాక మరోసారి ఎడిట్ చేసుకునే అవకాశం ఉండదని తెలిపారు.

ఆ అవకాశం 30 మంది అభ్యర్థులకే

'టీఆర్టీ' అర్హత మార్కులపై హైకోర్టు



హైదరాబాద్, జనవరి 8 (మనం లీగల్ ప్రతినిధి): ఉపాధ్యాయ నియామకాల పరీక్ష (టీఆర్టీ)కు హాజరయ్యే అభ్యర్థులు డిగ్రీ ఓపెన్ క్యాటగిరీలో 45 శాతం, ఎస్సీ,ఎస్టీ,బీసీ,వికలాంగ రిజర్వేషన్ల కేటగిరీల్లో 40 శాతం మార్కులు పొందిన వారి దరఖాస్తులను అనుమతించాలని టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం మధ్యంతర ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే.. కోర్టుకు ఆశ్రయించిన 30 మంది అభ్యర్థులకు మాత్రమే ఈ అవకాశం కల్పించాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తాము వెలువరించే తుది తీర్పు లోబడి పిటిషనర్ల దరఖాస్తుల ఫలితం ఉంటుందని బెంచ్ స్పష్టం చేసింది. డిగ్రీలో ఆ మార్కులను ఓపెన్ క్యాటగిరిలో 50,రిజర్వేషన్ కేటగిరీలో 45 శాతాలకు పెంపు వల్ల తాము నష్టపోతున్నామని కోర్టుకు వచ్చిన వారి వాదన.

తెలంగాణ అసెంబ్లీ దేశానికే ఆదర్శం

- ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జైపూర్‌లో 18వ అఖిల భారత విప్‌ల సదస్సు

హైదరాబాద్, జనవరి 8 (మనం ప్రతినిధి): తెలంగాణ చట్టసభలను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్‌లు అభిప్రాయపడ్డారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో 18వ అఖిల భారత విప్‌ల సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఇందులో రాష్ట్రం తరపున తెలంగాణ విప్‌లు గంప గోవర్ధన్, గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, లోక్‌సభలో టీఆర్ఎస్ విప్ నగేష్, మండలి విప్‌లు బోడకుంటి వెంకటేశ్వర్లు, పాతూరి సుధాకర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమంతో రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్.. అదే స్ఫూర్తితో బంగారు తెలంగాణ సాధనకు నడుం బిగించారని చెప్పారు. తెలంగాణ చట్ట సభలు దేశానికి ఆదర్శంగా ఉండే విధంగా నడవాలని సభా నాయకుడిగా కేసీఆర్ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్, రాజస్థాన్ సీఎం వసుంధరారాజే తదితరులు పాల్గొన్నారు.



నగర వీధుల్లో ఎలక్ట్రిక్ బస్సులు

- 3 నెలల్లో 40 బస్సుల రాక
- శబ్ద, వాయు కాలుష్యానికి చెక్
- డీజిల్ బస్సుల కన్నా బహు చౌక
- ఒక్కసారి చార్జింగ్ పెడితే 250 కి.మీ.
- బస్సుల కొనుగోలుకు 50శాతం గ్రాంటు

హైదరాబాద్, జనవరి 8(మనం న్యూస్): వాతావరణ కాలుష్యాన్ని నివారించే క్రమంలో రాజధానిలో ఓ వినూత్న రవాణా వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. శబ్ద, వాయు కాలుష్యాన్ని కాలుష్యాన్ని ఆమడదూరంలో ఉంచే ఎలక్ట్రిక్ బస్సులు త్వరలోనే నగర వీధుల్లో సందడి చేయబోతున్నాయి. మరో 3 నెలల్లో దాదాపు 40 బస్సులు హైదరాబాద్‌కు రానున్నాయి. హైదరాబాద్‌లో కాలుష్యరహిత ప్రజారవాణా వ్యవస్థ కోసం 40 ఎలక్ట్రిక్ బస్సులను ఇస్తామని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. ఎలక్ట్రిక్ వాహ నాల వాడకాన్ని ప్రోత్సహించి, వాటి ఉత్పత్తి పెంచే దిశగా ఆటోమొబైల్ కంపెనీలకు సూచనలివ్వాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రా లలో వినియోగిస్తున్న ప్రజారవాణా వ్యవస్థలో చాలావరకు డీజిల్ బస్సులే ఉండటం, వాటి వల్ల వాతావరణ కాలుష్యం బాగా పెరిగిపోవడంతో దాన్ని అరికట్టే చర్యలలో భాగంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలుచేసే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం 50 శాతానికి పైగా గ్రాంటు రూపంలో సాయం చేస్తుంది కూడా. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఓ సమావేశం నిర్వహించింది. టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీందర్ తెలంగాణ ప్రభుత్వం తరపున ఈ సమావేశానికి హాజరయ్యారు. 40 ఎలక్ట్రిక్ బస్సుల సరఫరాకు టెండర్లు పిలిచామని ఆయన చెప్పారు. డిపోలలలో ఎక్కడికక్కడ ఎలక్ట్రికల్ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తామని, ఒకసారి పూర్తిగా చార్జింగ్ చేసిన బస్సు 250 కిలోమీటర్లు ప్రయాణించగలదని వివరించారు. డీజిల్‌తో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ వ్యయం సగానికి సగం తగ్గిపోతుంది. దాంతో ఆర్టీసీ మీద ఇంధన భారం చాలావరకు తగ్గుతుంది. డీజిల్ బస్సు నడపాలంటే కిలోమీటరుకు రూ.18 వరకు ఖర్చవుతుండగా, ఎలక్ట్రిక్ బస్సుకు రూ.9 మాత్రమే ఖర్చవుతుంది. బస్సులు అందుబాటులోకి వచ్చి, వాటిని పూర్తిస్థాయిలో నడిపించాలంటే మాత్రం మరో 3 నెలలు ఆగాల్సిందే!



మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

మంగళవారం, జనవరి 9

'తెర'పడని వివాదం

విడుదలకు ముందే ఎన్నో వివాదాలు, సెన్సార్ కాకముందే ఎన్నో అడ్డంకులు, నిరసనలు వ్యక్తమై వివాదాస్పదమైన 'పద్మావతి' చిత్రం ఎట్టకేలకు సెన్సార్ నుంచి యు/ఏ సర్టిఫికెట్ పొందింది. సెన్సార్ కాకముందే ఈ చిత్రాన్ని తమ రాష్ట్రంలో విడుదలకు అనుమతించేది లేదని రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ప్రకటించాయి. అయితే, 'పద్మావతి' పేరు మార్చుకుని 'పద్మావత్'గా ఈ నెల 25వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. పలువురి ఒత్తిళ్ల మేరకు చిత్రంలో చిన్నచిన్న మార్పులు, చేర్పులు చేశారు. సంజయ్ లీలా భన్సాలీ నిర్మించిన చిత్రాన్ని నిషేధించాలని తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పూ లేదని రాజస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. రాజపుత్రులను అవమానించే రీతిలో ఈ చిత్రంలో సన్నివేశాలున్నాయని, ఈ చిత్రాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు, ఉద్యమం జరిగిన విషయం విదితమే. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్ కూడా ఉంది. అంతేగాక ఆ రాష్ట్రంలో త్వరలో అనేక చోట్ల కీలక స్థానాకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. అజ్మీర్, అల్వార్ లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు రానున్నాయి. అసలే జాట్ల రిజర్వేషన్ ఉద్యమంతో వసుంధరా రాజె ప్రభుత్వం ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇప్పుడు ఈ పద్మావత్ చిత్రం విడుదలకు అనుమతిస్తే రాజపుత్రుల వ్యతిరేకతను కూడా ఎదుర్కొనే పరిస్థితి కనిపించడం లేదు. అసలా పరిస్థితిని ఎదుర్కొనే సాహసానికి దిగడం వసుంధరా రాజెకు ఇష్టం లేదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని శ్రీరాజ్‌పుత్ర రాజ్‌సభ కూడా సమర్థించింది.

మేవాడ రాణి పద్మావతి జీవిత కథ ఆధారంగా చిత్రాన్ని నిర్మించిన సంజయ్ లీలా భన్సాలీ 'పద్మావతి'పై మొదటి నుంచి కర్ణిసేన వ్యతిరేకత వ్యక్తంచేస్తూనే ఉంది. అసలు డిసెంబర్ నెలలోనే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల కావలసిన ఈ చిత్రం విడుదల, సెన్సార్ నెల రోజుల పాటు వాయిదాపడ్డాయి. ఈ వివాదాల నేపథ్యంలో చిత్రంలో పలు మార్పులకు సీబీఎఫ్‌సీ చేసిన సూచనలను చిత్ర నిర్వాహకులు అంగీకరించారు. చివరకు చిత్రం పేరును 'పద్మావతి' నుంచి 'పద్మావత్'గా మార్పు చేయాలన్న సూచనను కూడా అంగీకరించారు. అసలు చిత్రంపై కర్ణిసేన ఎందుకు వ్యతిరేకత వ్యక్తం చేసిందో తెలిస్తే నిర్ఘాంతపోతాం. ఈ చిత్ర నిర్మాణ సమయంలో నటుడు రణ్‌వీర్ సింగ్‌ను కర్ణిసేన నేత లోకేంద్ర సింగ్ కల్వి 'విలన్‌గా నటిస్తున్నారా' అని వేసిన ప్రశ్నే ప్రధాన వివాదంగా రూపుదాల్చింది. పద్మావతి, అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్రలు రెండూ ఎక్కడా ఒకే ఫ్రేమ్‌లో కనిపించరని భన్సాలీ వివరణ ఇచ్చినా కర్ణిసేన శాంతించలేదు. చిత్రంలో పద్మావతిగా నటించిన దీపికా పదుకోనేను చంపేస్తామనేంత తారస్థాయికి వివాదం చేరుకుంది. అయితే, చిత్రం విడుదల తేదీని, సెన్సార్ చేయాల్సిన తేదీని చిత్రనిర్మాతలు వాయిదా వేసుకోవడం అప్పట్లో వివాదానికి తాత్కాలికంగా తెరపడేటట్లు చేసింది. మళ్లీ ఇప్పుడు సెన్సార్ పూర్తయి, విడుదల తేదీని ప్రకటించిన నేపథ్యంలో సమస్య మొదటికొస్తుందా, ఇక్కడితో ఆగుతుందా అన్నది తేలాల్సి ఉంది.


చరిత్రతోనూ, మరే అంశంలోనూ ఈ చిత్రం వివాదాస్పదంగా లేదని చిత్ర యూనిట్ ప్రకటించింది. అయినప్పటికీ ఈ చిత్రాన్ని చూసిన తరువాత చిత్రాన్ని ప్రదర్శించడాన్ని పూర్తిగా స్క్రీనింగ్ కమిటీ తిరస్కరించిన అనంతరం ఇక ఎందుకు ప్రదర్శించాలని పట్టుబట్టడంలో ఔచిత్యం ఏమిటని శ్రీరాజపుత్ర సభ చైర్మన్ గిరిరాజ్ సింగ్ లోత్వారా ప్రశ్నించారు. ఒకసారి చిత్రాన్ని ప్రదర్శించడం ప్రారంభిస్తే చిత్ర నిర్మాతకు, తమకు మధ్య ఏదో జరిగిందనే అనుమానాలు తలెత్తుతాయని ఆయన అన్నారు. చిత్రం సీబీఎఫ్‌సీ (సెన్సార్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్) అనుమతి పొంది ఉంటే అందులో ఉన్న అభ్యంతర సన్నివేశాలను తొలగించి ఉంటారని, అలాంటప్పుడు చిత్రం విడుదలకు అభ్యంతరం చెప్పవలసిన అవసరం లేదని రాజస్థాన్ బీజేపీ నాయకుడు అశోక్ పర్నామీ చెప్పారు. ఇక్కడ ప్రభుత్వ వైఖరి, పార్టీ వైఖరి వేర్వేరుగా ఉండడం గమనించదగిన అంశం. చిత్రం పూర్తయిన తరువాత పలు ఆసక్తికర పరిణామాల మధ్య చిత్రంపై ఆయా రాజకీయ పార్టీలు చీలిపోయి అసలు సంగతి కనుమరుగై రాజకీయం ముందుకొచ్చింది. సెన్సార్ కాకముందంటే చిత్రంపై అభ్యంతరం చెబుతున్న వారికి చూపకపోవడానికి కారణం ఉంది కానీ, సెన్సార్ పూర్తయ్యాక అయినా అభ్యంతరం చెబుతున్న వర్గానికి ప్రదర్శించి వారి అభ్యంతరమేమిటో తెలుసుకునే ప్రయత్నం సంజయ్ బన్సాలీ చేస్తే బాగుండేది. వివాదాలు సద్దుమణగాలంటే మధ్యేమార్గంగా చర్చలు తప్పవు. ఇందులో ఎలాంటి భేషజాలూ కూడవు. ప్రస్తుతం పద్మావత్‌గా పేరు మార్చుకున్న చిత్రాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందని కాంగ్రెస్, వామపక్షాలు అనుకూలంగా ప్రకటనలు ఇచ్చాయి. ఇక్కడ విచిత్రమేమిటంటే అసలు చిత్రంలో ఏముందో ఎవరికీ తెలియదు. దాంతో అసలు విషయం పక్కకు పోయింది. రాజకీయం తెరపైకి వచ్చినట్లయింది. ఈ వివాదాన్ని చక్కదిద్దడంలో రాజస్థాన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమెందని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు సచిన్ పైలెట్ ఆరోపించడం చూస్తుంటే అసలు సంగతిని పక్కకు నెట్టడంలో రాజకీయం ఎంతకైనా తెగిస్తుందని వెల్లడవుతోంది. ఈ చిత్రం వల్ల ఎవరి మనోభావాలూ దెబ్బతినవని ఆయన సర్టిఫికెట్ ఇచ్చారు. చిత్రం చూడకుండానే ఇలా ఎవరి అభిప్రాయాలు వారు వ్యక్తం చేస్తుండడమే రాజకీయ పార్టీల అసలు నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయి. దేశంలో ముస్లింలపై గోరక్షక బృందాలు దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో పద్మావతి చిత్రంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే అడ్డుపడుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో భావప్రకటన స్వేచ్ఛను నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కాలరాస్తోందనే విమర్శలకు పద్మావతి చిత్రం అంశం విపక్షాలకు ఒక అస్త్రంగా దొరికినట్లయింది. అసలు చిత్ర నిర్మాణాలు, వాటిలోని కథాంశాలు వివాదాస్పదంగా మారడం, చిత్రాలకు రాజకీయ నేపథ్యం అడ్డుపడడం ఇప్పుడు కొత్తగా ఏమీ జరగడంలేదు. అత్యవసర పరిస్థితి సమయంలో నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం ప్రఖ్యాత హిందీ గాయకుడు కిశోర్‌కుమార్ పాటల్ని దూరదర్శన్‌లోను, ఆకాశవాణిలోను ప్రసారం చేయకుండా అడ్డుకుంది. 1977లో అప్పటి జనతా పార్టీ ఎంపీగా ఉన్న అమృత్ నెహతా నిర్మించిన చిత్రాన్ని నిషేధించింది. అప్పటి కేంద్ర ప్రసారాల శాఖ మంత్రి వీసీ శుక్లాపై దాదాపు 11 నెలల పాటు అమృత్ నెహతా న్యాయపోరాటం చేసి విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించడంతో ఎన్‌టీ రామారావు చిత్రాలకు కూడా ఇటువంటి అనుభవాలే ఎదురయ్యాయి. అనవసర అంశాలతో ప్రజాసమస్యలను పక్కదారి పట్టించి దృష్టిని మరల్చే ప్రయత్నాల్లో భాగంగా వీటిని మనం భావించాల్సి ఉంటుంది.

దేశమంటే ..!


కవిత

ఆకలేస్తోంది అన్నం కావాలి
పంట పండించాలి పొలం కావాలి
నాటు వేయాలి నీరు కావాలి
ప్రాజెక్టుల పేరుతో
పార్లమెంట్ సభలెన్నో
రైతే రాజు అనే రాజకీయ నేతలెందరో
ఎన్నో సభలు జరిగిన
ఎంతమంది నేతలు మారినా...
ప్రాజెక్టులు పూర్తికావు
నాటుకు నీరు రాదు
రైతన్న రాజ్యమేలా..?
నీటికోసం బోర్లు వేసి అప్పు చేసి
బ్రతుకంతా భారంగా మారే..
రైతు మాట మూగబోయే
ఉరి తాడుకు వేలాడే..
రైతన్న రాలిపోయే
రాజకీయం రాజ్యమేలే..
రామ రాజ్యమా ఇది రాజకీయమా..?
దేశంటే మట్టి కాదోయి
దేశమంటే మనుషులోయి
అన్న గురజాడ పలుకులు
నేడా మారిపోయే
దేశమంటే మనిషి కాదోయి
దేశమంటే మట్టి గడ్డోయి..

- అమీనా
7032967040



మంచిమాట



'ఒకడు
రణరంగమందు
వేయివేల మందిని
జయించుగాక,
తనను తాను
జయించిన వాడే
నిజమైన విజేత.'

- గౌతమ బుద్ధుడు



అభివృద్ధిపై స్పీకర్ ఆసక్తి

పేదల పెన్నిధి.. దీన జనబాంధవుడు.. మనసున్న మారాజు.. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి క్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న శాసనసభ స్పీకర్ సిరికొండ మధు సూదనాచారి గొప్ప మానవతావాది. గతంలో ఎవరూ చేపట్టని రీతిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ భూపాలపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ముందునిలిపారు. 'పల్లెప్రగతి నిద్ర' పేరుతో తన నియోజకవర్గంలోని గ్రామాల్లో రాత్రి బసచేస్తున్నారు. ఊరూరా ప్రజలను కలుస్తూ పల్లె ప్రగతి నిద్రలతో ప్రత్యేక ముద్ర వేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వారి అభివృద్ధికి పాటుపడుతున్నారు. రాజ్యాంగహోదా కలిగి ఉన్నప్పటికీ ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ప్రజాసేవలో పరితపిస్తున్నారు. కుల, మత, లింగభేదాలు ఆయనకు నచ్చని అంశం. తోటి వారికి సహాయపడటం మాత్రమే మానవత్వానికి నిర్వచనం కాదనీ, సకల జీవరాశులతో ప్రేమానుబంధాన్ని పెంపొందించుకోవడంతో పాటు, ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చు కోవడం మానవత్వానికి ప్రతీక అని ఆయన చెబుతారు.

తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి భూపాలపల్లి నియోజకవర్గంలో మనసు పెట్టి పనిచేస్తుండడంతో ప్రజలు మనసారా దీవిస్తున్నారు. ప్రతి విషయాన్ని మానవీయకోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుండడంతో ప్రజల అభిమానాన్ని మరింత చూరగొన్నారు. 2014లో స్పీకర్ పదవి పొందిన 'చారిసాబ్' ఆ నియోజకవర్గ ప్రజలతోనే ఎక్కువ సమయాన్ని గడుపుతూ ప్రతి పేదవాడిని ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రం కోసం సాగిన ఉద్యమంలో పల్లె నిద్రలు చేసిన ఆయన 2017 డిసెంబర్ 27న గణపురం మండలం కర్కపల్లిలో రాజన్న కులస్తుల కోసం నిర్మించిన కమ్యూనిటీ నూతన భవనాన్ని ప్రారంభించి ఆ ఊరిలోనే పల్లెప్రగతి నిద్ర చేశారు. తెలంగాణ సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా ఆటలు, పాటలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలతో పాటు, మంగళ హారతులతో స్పీకర్‌కు ఆహ్వానం పలికారు. పలెవాసులు, ప్రజాప్రతినిధులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మరుసటి రోజు ఉదయం గ్రామస్తులతో కలిసి చలిమంటలు కాగారు. వేపపుల్లతో దంతధావనం చేస్తూ గ్రామంలో పాదయాత్ర చేశారు. గ్రామస్థులతో కలిసి అల్పాహారంతో వారి పిదప సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం అన్ని వాడల్లో కలియతిరిగి దశల వారీగా గ్రామ సమస్యలు పరిష్కరించారు. అలాగే 2018 జనవరి 3 బుధవారం రాత్రి చిట్యాల మండలం చల్లగరిగేలోని యాదవ కమ్యూనిటీ హాల్‌ల్లో నిద్రించారు. తెల్లవారు జామున గ్రామస్తులతో ముచ్చటిస్తూ చలిమంటలు కాగారు. పంట పొలాలను పరిశీలిస్తూ స్థానికులతో గడిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో పెద్దకొడుకుగా పని చేస్తూ పేద ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం పొందారు. అడవిబిడ్డలు ఆడబిడ్డల జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రతివారం ఒక ఊరిలో 'పల్లెల్లో ప్రగతి



> స్పీకర్ ఏ కార్యక్రమం చేపట్టినా విన్నూత పంథా అవలంబిస్తుండడంతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గతంలో మానవ సమాజానికి దూరంగా ఉంటున్న చెంచులు, పిట్టల, రాజన్నల, నేతకాని, నాయకపు, వీరముష్టి, బోయ, చిందు తదితర కులాలకు చెందిన వారిలో చైతన్యం తీసుకొచ్చారు.

నిద్ర' పేరిట బసచేస్తున్నారు. పల్లెల్లో ప్రగతి నిద్ర ద్వారా గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. అత్యవసర పనులకు అక్కడికక్కడే ఆదేశాలిస్తున్నారు. 'ఆన్ గోయింగ్ వర్క్స్'కు గడువు దాటొద్దంటూ అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నారు.

స్పీకర్ ఏ కార్యక్రమం చేపట్టినా విన్నూత పంథా అవలంబిస్తుండడంతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గతంలో మానవ సమాజానికి దూరంగా ఉంటున్న చెంచులు, పిట్టల, రాజన్నల, నేతకాని, నాయకపు, వీరముష్టి, బోయ, చిందు తదితర కులాలకు చెందిన వారిలో చైతన్యం తీసుకొచ్చారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఎప్పుడూ చూడని వారికి విశేషాలను దగ్గరుండి చూపించిన 'చారిసాబ్' వారిని నాగరిక ప్రపంచానికి పరిచయం చేశారు. ఇటీవల భాగ్యనగరిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు అడవిబిడ్డలను ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్లి ఆ మహాసభల ప్రారంభ వేడుకలను, పర్యాటక స్థలాలను చూపించారు.

కుందన్‌బాగ్‌లో తన అధికార నివాసంలో రాత్రి వారికి విందు ఇచ్చారు. అక్షరజ్ఞానం, పట్టణ వాతావరణం, నవీకరణ తెలియని వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి సరికొత్త అనుభూతిని మిగిల్చారు. దేశంలోనే ఏ రాష్ట్ర స్పీకర్ చేయని విధంగా అభివృద్ధికి బాటలు వేసి తన సొంత నియోజకవర్గమైన భూపాలపల్లిని ప్రగతిపథంలో నడిపిస్తున్నారు. గడిచిన మూడున్నర సంవత్సరాల్లో ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల నీరాజనాలు పొందుతున్నారు. స్పీకర్ పదవి చేపట్టగానే భూపాలపల్లి జయశంకర్ జిల్లాకు అన్ని కలిసి వచ్చాయి. గతంతో పోల్చితే చాలా మేరకు అభివృద్ధి పనులు జరిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సహా మొత్తం రాష్ట్ర మంత్రివర్గాన్ని భూపాలపల్లికి తీసుకొచ్చి అభివృద్ధి పనులకోసం వందల కోట్ల రూపాయల అనుమతులు తీసుకొచ్చారు. గతంలో పనిచేసిన శాసనసభాపతులందరికీ కంటే భిన్నంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ముక్కుసూటిగా వ్యవహరిస్తూ ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్నారు. రాజ్యాంగ పరమైన పదవిలో ఉన్నప్పటికీ సామాన్యులతో ఆయన ఇట్టే కలిసిపోతున్నారు. రాష్ట్ర శాసనసభాపతిగా మూడున్నర ఏళ్లలోనే ఎంతో పరిణతి పొంది సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ 'సహనశీలి'గా పేరు సంపాదించుకున్నారు.

ముఖ్యంగా ఆయన చేపట్టిన పల్లె ప్రగతి నిద్ర పర్యటనలో స్పీకర్ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. కూడు, గూడు, గుడ్డతోపాటు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, వైద్యపరీక్షలు అందించేలా చర్యలు తీసుకున్నారు. అంగన్‌వాడీతో పాటు, ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటుచేయించారు. సింగరేణి బొగ్గుగని కార్మికుల సంక్షేమానికి కృషిచేశారు. కొత్తపనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు, పాత పనుల్లో పురోగతి సాధించారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఇంటింటికి వెళ్లి అందించారు. బాల కార్మికులకు, ఉపాధిశిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయించారు. పీఎంకేఎస్‌వై పథకం కింద సబ్సిడీపై కరెంటు మోటార్లను పంపిణీ చేశారు. అంతేగాక మిషన్ కాకతీయ పనులు పూర్తి చేయించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు, రైతు సమస్యల పరిష్కారం కోసం రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేశారు.

గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరిస్తూ.. సందేహాలు నివృత్తి చేస్తున్నారు. చదువులో తోడుగా.. కష్టాల్లో అండగా ఉంటూ... స్వచ్ఛత దిశగా అడుగులు వేస్తున్నారు. కలప, ఇసుక, బొగ్గు అక్రమ రవాణాను నియంత్రించిన ఆయన గుడుంబాను అరికట్టారు. అలాగే ప్రైవేట్ దందాను నివారించారు. మెరుగైన ప్రజారవాణా కోసం రోడ్లు నిర్మింపజేశారు. సాగు, తాగునీరు కష్టాలు తీర్చారు. ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతులు కలిపించారు. 'డబుల్ బెడ్‌రూం' ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా కొత్త జిల్లాను సాధించిన మధుసూదనాచారి ప్రగతిదారుల్లో భూపాలపల్లి జయశంకర్ జిల్లాను అగ్రభాగాన నిలిపారు.

◆ గడ్డం కేశవమూర్తి
సీనియర్ జర్నలిస్ట్,
8008794162

వామపక్ష రాజకీయాలపై వ్యవస్థీకృత హింస

దేశంలో వామపక్ష విప్లవ ఉద్యమ శక్తులు సమానత్వం స్వేచ్ఛల ప్రాతిపదికన సామాజిక ఆర్థిక పరివర్తన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా సాధ్యం కాదు అనే కచ్చితమైన అవగాహనతో మొదలైంది. ప్రస్తుతం దానికి యాభైఏళ్ళు. దేశ రాజకీయ వ్యవస్థలో ప్రధానధారకు ప్రత్యామ్నాయ ధారగా అది మొదలైంది. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానంతో ఈ విప్లవ శక్తులు పనిచేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మొదలు పెట్టి శ్రీకాకుళం నుంచి గోదావరీ లోయ ద్వారా నల్లమలకు, కొంతమేర పశ్చిమ కనుమలకూ విప్లవోద్యమం విస్తరించింది. ప్రధానంగా తమ పోరాటం 'భూమి ఇరుసుగా' గల పోరాటంగా ఈ పార్టీలు ప్రకటించుకున్నాయి. స్థూలంగా, వ్యవసాయ ప్రధాన ఆర్థిక సామాజిక వ్యవస్థలో ఉత్పాదక వనరుల మీద ప్రజల హక్కు కోసం పోరుగా దానిని స్థూలంగా చెప్పుకోవచ్చు. భూస్వామ్యమూ, వలసవాదమూ, దానికి తోడుగా ఉన్న పెట్టుబడిదారీ విధానాన్ని కట్టడిచేసే వ్యూహాలతో, ఎత్తుగడలతో పనిలోకి దిగామనేది వారి అవగాహన. కుల దురహంకారం నిరంతరం పెరుగుతూ కుల ప్రాతిపదికన హింస నిరంతరం కొనసాగుతూ, నేటికీ ప్రతిరంగాన్ని కులం ప్రభావితం చేస్తున్న స్థితిలో పుట్టుక పునాదిగా తక్కువతనమూ, గొప్పతనమూ ఉంటాయని భావించే ఆలోచన ఆచరణలను పలచబర్చడంలో విప్లవ శక్తులు ఏ మేరకు విజయం సాధించినవి అనేదీ జవాబు ఇవ్వవలసిన ప్రశ్నే. అదేవిధంగా మెజారిటీ ప్రజలు ఏదో ఒక అతివాద మతవాదం వైపు నడవడం. 'హిందూ మత జాతీయత' పేరిట పెచ్చుపెరిగి, కింది మధ్యతరగతి, ఆపై గల సామాజిక ఆర్థిక వర్గాలలో పట్టుపెంచుకొని, అనేక పరిమితులు ఉన్నప్పటికీ దేశంలో ఇంతవరకూ ఆమోదం పొందిన ఉదారవాద మధ్యేవాద రాజకీయాలను పక్కకుతోసి, ప్రత్యక్ష సంప్రదాయవాద దక్షిణ పంథా, మెజారిటీ మత సమూహ వాద రాజకీయ శక్తులు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న స్థితిలో దాదాపు యాభై ఏండ్ల కార్యాచరణ వలన జరిగిందో పరిశీలించుకోవాల్సి కూడా ఉంది.

లౌకికవాదం అనే విలువ అనుభవంలో ప్రతి మతంలోని తిరోగామిశక్తులను సంతృప్తిపరచి వారితో ప్రయోజనాలు పొందే కాంపిటేటివ్ కమ్యూనలిజంగా మారినప్పుడు దానిని ఎదురుకునే కార్యాచరణ లేకపోవడం విప్లవ రాజకీయాల మరో బలహీనత. బహుళత్వం ఒక జీవలక్షణంగా ఉండే ఈ దేశపు వాస్తవికతలో మతం కూడా బహుళ రకాల వ్యాఖ్యానాలను, విభిన్న ఆచరణలును పొందుతుంది. మెజారిటీ ప్రజలకు ఈ దేశంలో సువ్యవస్థీకృత, ఏక రూప మత వ్యవస్థ లేదు. ఏ మతాన్ని పాటించినప్పటికీ దానికి సంబంధించి బహులతలనూ, దానిలోని సరళీకృత విలువలను పాటించే విశాలజనంతో విప్లవ రాజకీయ శక్తులు నిరంతర పరస్పర సదవగాహనను పెంపొందించ లేకపోయాయి. అందువల్ల రెండు ప్రధాన మతాలతో మత పర, అతివాద శక్తుల పట్టు పెరిగిపోయింది.

స్థానికత, దేశీయత అనేవి 'సంప్రదాయిక తిరోగామి భూస్వామిక విలువలు' అని గుణదోష విచా

> పార్లమెంటరీ రాజకీయాలు, ప్రభుత్వ నిర్వహణ దిగజారుతూ, కొనుగోలుదారీ తనమే విలువగా ఉండే సమాజమూ అవి సృష్టించే బహురూపాల వ్యవస్థీకృత దుర్మార్గాలకు, సమస్యలకూ పరిష్కారం చూపలేక పోయినా, సాయుధ రహస్య విప్లవ రాజకీయాలకు విజయంసాధించే మద్దతు లేకపోయినా, అవి ఎక్కడో ఒక చోట బతికే ఉన్నాయని తెలిపే స్థాయి మద్దతు ఉంటుంది .

రణతో సంబంధం లేని అవగాహనను పెంపొందించుకోవడంతో స్థానీయత జాతీయతలను సంప్రదాయ వాద, వర్ణకుల ఆధిపత్య శక్తులకు అప్పనంగా అప్పజెప్పడంగా మారిపోయిన స్థితి ఉన్నది.

రాజ్యానికి ఉన్న అణిచివేసే శక్తి కొత్తది కాదు, తక్కువ అంచనా వెయ్యదగిందీ కాదు. వ్యవస్థీకృత హింస, అణిచివేతలు కుల హింస, లింగ వివక్ష రూప హింస, ఎటువంటి రక్షణలేని అవ్యవస్థకత, అసంఘటిత రంగ శ్రమదోపిడీ, పలురూపాల్లో సాగే ఆధిపత్యాలు, వీటి కారకాలు, వీటిని ఎదుర్కొనే, రోజువారీ కార్యాచరణ గురించి చర్చాచర్యలలోకి దిగకపోవడం ప్రధాన అంతర్గత సమస్య. సాయుధ రహస్య కార్యాచరణనే అత్యంత ప్రధాన అనివార్యతలోకి 'బిరడాలో స్క్రూలా 'దిగబడి పోవడం మరో సమస్య'. విద్య, వైద్యం, భూమితో సంబంధం మౌలిక బతుకు దెరువులు, వృత్తి ప్రధాన బతుకుదెరువు సంక్షోభాలకు గురవుతున్న వేళ వాటికిగల కారక విశ్లేషణకు ఇచ్చిన శ్రద్ధ వాటికి క్షేత్రస్థాయి, అమలుకు నోచుకునే పరిష్కారాలు చూపకపోవడం, కనీసం అటువైపు ఆలోచించే తీరుగా జనాన్ని మలపడం చేయలేని స్థితి తీవ్ర అంతర్గత సమస్య.

నగరం, మైదానప్రాంతం, రవాణాతో ఇతర కమ్యూనికేషన్‌తో ముడిపడిన గ్రామప్రాంతం, అటవీ ప్రాంతం ఈ మూడు ప్రాంతాలలోని మనుషుల అవసరాలు, జీవితాలు ఏదో ఒక తీరు ముడిపడి ఉండినా, అవి మూడు ప్రత్యేక జీవితాలు అక్కడి సమస్యలకు అక్కడి స్థితిని బట్టి వికేంద్రీకృత, ఆలోచనాత్మక, ప్రజాభాగ స్వామిక పరిష్కారాలు అవసరం. భాగస్వామ్య రాజకీయాలను ఇష్టపడని పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని ఇరుకునబెట్టే భాగస్వామ్య (పార్టిసిపేటరీ) రాజకీయాలకు ఉంటుంది. సాయుధ విప్లవ రాజకీయ ఆచరణ లేకపోవడంతో బలహీనత తీవ్రరోగగ్రస్తత (సిండ్రోం) కిందికి మారిందనిపిస్తుంది. మధ్య భారత అటవీ-ఆదివాసీ ప్రాంతాల్లో వనరులపై పట్టుకోసం జరుగుతున్న పోరాటంలో బలమైన ఆదివాసీ మద్దతు ఉండటం వల్ల పోరాటం అక్కడ ప్రాసంగికమనిపిస్తున్నది. వనరుల విధ్వంసం బతుకుదెరువుల విధ్వంసం నిరంతరాయంగా జరుగుతూనే ఉంది, కానీ అక్కడ ప్రజలు రోజువారీగా వివిధ రూపాలలో పోరాడే దిశను అందించే స్థితిలో విప్లవ రాజకీయాలు లేవు. ఈ స్థితిలో అతివాద కొనుగోలుదారీ వ్యక్తివాదాన్ని పోషించే శక్తులూ, వారికి అనుకూలమైన, మత సాంస్కృతిక నిర్మాణాలు బలపడ్డాయి. క్రియాశీలమూ, ప్రాక్టికల్‌గా ఉండే శక్తులుగా కీర్తించబడుతున్నాయి. అవే అధికారంలో ఉన్నాయి. పార్లమెంటరీ రాజకీయాలు, ప్రభుత్వ నిర్వహణ దిగజారుతూ, కొనుగోలుదారీ తనమే విలువగా ఉండే సమాజమూ అవి సృష్టించే బహురూపాల వ్యవస్థీకృత దుర్మార్గాలకు, సమస్యలకూ పరిష్కారం చూపలేకపోయినా, సాయుధ రహస్య విప్లవ రాజకీయాలకు విజయం సాధించే మద్దతు లేకపోయినా, అవి ఎక్కడో ఒక చోట బతికే ఉన్నాయని తెలిపే స్థాయి మద్దతు ఉంటుంది .

◆ డాక్టర్ హారతి వాగీశన్
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ పొలిటికల్ సైన్స్
నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా,
హైదరాబాద్.

మన లేఖలు

లాలూకు శిక్ష అభినందనీయం

సామాన్యుడు చిన్నతప్పు చేస్తే జైలుపాలవుతున్నాడు. ప్రజలు కష్టపడి చెమట చిందిస్తూ ప్రతి పైసాను ప్రభుత్వానికి కిస్తులతో పన్నులు కడ్తుంటే నేతలు ఆఖరికి గోవులు తినే గడ్డిని కూడా తినడం సిగ్గుపడాల్సిన విషయం. లాలూ ప్రసాద్ యాదవ్ అవినీతికి జైలుశిక్ష, జరిమానా విధించడం న్యాయమూర్తికి ప్రజల తరపున అభినందనలు. అవినీతి వల్లనే దేశం ఎదగలేకపోతోంది. సీఎం కేసీఆర్ అవినీతిపై దృష్టి నిలుపుతూ, అవినీతి అధికారులను, తప్పుచేసిన వారిని శిక్షిస్తున్నారు. పురపాలక చేనేత శాఖ కేటీఆర్ అయితే లంచం అడిగే వాళ్లను చెప్పుతో కొట్టాలని పిలుపు ఇవ్వడం ద్వారా లంచం తెలంగాణలో మాయమైంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీబీ అధికారుల ఫోన్ నెంబర్లు రాయించాలని కోరుతున్నాము.

- కోలిపాక శ్రీనివాస్
తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుడు
9133135710

హామీ అమలు ఎప్పుడు?

అప్పటి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి 2000లో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లును నియమించింది. కేవలం 4 నెలల ప్రాతిపదికన 100 రూపాయల బాండ్ పేపర్ మీద 4000 రూపాయలు పని చేసినం. ప్రస్తుతం జూనియర్ కాలేజిలో 3500 మంది డిగ్రీ కాలేజ్‌లో 1100 మంది పనిచేస్తున్నారు. తమ హయాంలో కాంటాక్ట్ వ్యవస్థ ఉండదని, అందరినీ రెగ్యులర్ చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టు తీర్పునసరించి ఈ సంత్సరం జూన్ నుంచి 37,100 రూపాయలు గౌరవ వేతనంగా ఇస్తున్నారు. అన్ని అర్హతలుండి 17ఏళ్లగా 500 మంది పనిచేస్తున్నారు. కనీసం ప్రభుత్వం మానవత దృక్పథంతో 50 సంవత్సరాలు పెబడినవారికి రెగ్యులర్ కాకున్నా మినిమం టైం స్కేల్ అమలు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- శేషారావు
కాంట్రాక్టు లెక్చరర్,
కామారెడ్డి

మనం
కుటుంబం
మంగళవారం, 9 జనవరి 2018
www.manamnews.com



అజ్జూ లవ్ ఇన్నింగ్స్

క్రికెటర్, కాంగ్రెస్ నేత అజహరుద్దీన్ ముచ్చటగా మూడోసారి వివాహం చేసుకున్నట్టు ఆ మధ్య రూమర్లు తెగపుట్టుకొచ్చాయి. ఇది నిజం అయినా కాకపోయినా 54 దాటిన అజ్జూ, తన గర్ల్‌ఫ్రెండ్ షన్నన్ మ్యారీ తల్వార్‌తో చెట్టాపట్టాలు వేసుకుని అధికారికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. లాస్‌ఏంజిలెస్‌కు చెందిన ఈమె యోగా టీచర్‌గా ఢిల్లీలో ఉంటున్నారు. నోయిడాలోని ఏవీఏ క్లాతింగ్ కంపెనీకి డైరెక్టర్ కూడా.

కొంతమంది వృద్ధులు ఎప్పటికీ యువకులు అనాలేమో! తాజాగా జరుగుతున్న పరిణామాలన్నీ అలాగే కనిపిస్తున్నాయి. ఏజ్ ఈజ్ జస్ట్ నంబర్ అంటూ షష్టిపూర్తికి దగ్గర్లో ఉన్నవారు, షష్టిపూర్తి చేసుకున్నవారు తీరిగ్గా ప్రేమిస్తూ, ప్రేమపక్షుల్లా విహరిస్తూ, అంగరంగ వైభవంగా వివాహం కూడా చేసుకుంటున్నారు. హాలీవుడ్, బాలీవుడ్, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు వయసైపోయాక ఇలా నిత్య ప్రేమికులుగా, ప్రేమ పిపాసులుగా మారుతున్నారు. స్పోర్ట్స్ స్టార్స్‌తోపాటు చాలామంది ఈ జాబితాలోకి వస్తారు. రీల్ లైఫ్‌లోలా రియల్ లైఫ్‌లో ప్రేమ, పెళ్లి, విడాకులు.. ఆ తరువాత మళ్లీ ప్రేమ, పెళ్లి.. ఇలా సాగుతోంది పలువురు సెలబ్రిటీల బ్రతుకు. పాకిస్తాన్ మాజీ క్రికెటర్, ప్రస్తుతం పాకిస్థాన్ ప్రతిపక్ష నాయకుడు, మాజీ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అయిదుగురు పిల్లల తల్లి అయినా బుష్రా మనేకా అనే మహిళను ఆయన రహస్య వివాహం చేసుకున్నారని పాక్ మీడియా కోడై కూస్తోంది. దీంతో ప్రముఖులు మళ్లీ మళ్లీ పెళ్లి చేసుకోవడంపై చూపుతున్న అమితాసక్తి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



నేనొక ప్రేమ పిపాసిని

లేటు వయసు ఘాటు ప్రేమ

ఎన్టీఆర్, లక్ష్మిపార్వతి

ఏడు పదుల వయసులో మూడు ముళ్లు వేశారు నందమూరి తారకరామామావు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్‌ను ఏలిన ఎన్టీఆర్ ఇలా లక్ష్మీపార్వతి అనే మహిళను రెండో వివాహం చేసుకోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది.





డిగ్గీ రాజా ప్రేమగాథ

మాజీ సీఎం.. కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన ఘనుడు దిగ్విజయ్ సింగ్ లేటు వయసులో టీవీ జర్నలిస్టు, అమృతారాయ్‌తో పీకల్లోతు ప్రేమలో కూరుకుపోయారు. అయితే ఆ తరువాతి కాలంలో వీరిరువురు వివాహం చేసుకుని ప్రస్తుతం హ్యాపీగా ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కూడా 59 ఏళ్లలో మోడల్ మెలానియాను ప్రేమించి పెళ్లాడారు. ట్రంప్ వయసులో మూడో వంతు వయసున్న మెలీనియాది ప్రేమ వివాహం కావడం అప్పట్లో సంచలనం సృష్టించింది.




లవ్ మొఘల్ మర్డోఖ్

ఫాక్స్ న్యూస్ చానెల్ వ్యవస్థాపకుడు (స్టార్ ఇండియా వీరిదే), రూపర్ట్ మర్డోఖ్ 69 ఏళ్ల వయసులో మూడో వివాహం చేసుకుని, విడిపోయి, తాజాగా 84 ఏళ్లు నిండిన సందర్భంగా, మోడల్, నటి అయిన జెర్రీ హాల్‌తో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. జెర్రీ వయసు కేవలం 25 ఏళ్లే.



మిళింద్ సోమన్

యాక్టర్, సూపర్ మోడల్ మిళింద్ సోమన్ కూడా లేటు వయసులో ఘాటు ప్రేమలో పడ్డారు. ఫిట్‌నెస్ ప్రేమికులంతా మిళింద్ అంటే పడిచస్తారు, అలాంటి మిళింద్ మాత్రం తన రియల్ లైఫ్‌లో విఫలమై, ప్రొఫెషన్ మీదనే దృష్టి సారిస్తూ, ఈ మధ్యనే తన కూతురు వయసున్న, ఎయిర్ హోస్టెస్ అంకితా కొన్వార్ అనే అమ్మాయితో తన లివింగ్ రిలేషన్‌ను అధికారికంగా వెల్లడించారు. 52 వడిలో పడుతున్న మిళింద్, ఈ 26 ఏళ్ల అమ్మాయితో ప్రేమాయణం నడుపుతూ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా ఇంటర్నెట్‌లో నిలిచారు.



వివాహం అయి, పిల్లలు పుట్టాక, జీవితంలో స్థిరత్వం పొందాక తిరిగి ప్రేమలో పడుతున్న ప్రముఖుల సంఖ్య రోజురోజుకీ ఎక్కువ అవుతోంది. ఓవైపు కట్టుకున్నవారిని నట్టేటముంచి, కొత్తవారితో జీవితం పంచుకోవడంపై చూపుతున్న మోజు మానసిక నిపుణులకు సైతం అంతుచిక్కడంలేదు. డబ్బు, హోదా, పేరుప్రతిష్ఠలు సంపాదించుకుని, ఓ స్థితికి ఎదిగినవారి మనసు ప్రేమపై మళ్లడం నిజంగా ఆశ్చర్యకరంగా ఉంటోంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పుణ్యమా అని ఈ ప్రేమలు ఎంత వేగంగా పుడుతున్నాయో అంతే వేగంగా అంతమవుతుండడం మరో విశేషం. లెజెండరీ బాలీవుడ్ నటుడు దిలీప్ కుమార్ 44 ఏళ్ల వయసులో 22 ఏళ్ల వయసున్న హీరోయిన్ సైరా భానును వివాహం చేసుకోవడం అప్పట్లో రేపిన సంచలనం అంతా ఇంతా కాదు. సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్‌లు కూడా తమ మధ్య ఉన్న ఏజ్ గ్యాప్‌ను ఏమాత్రం లెక్కచేయకుండా వివాహం చేసుకోవడం కూడా ఈకోవలోకే వస్తుంది. ఏస్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ 44 ఏళ్ల వయసులో తన కూతురు వయసున్న 22 ఏళ్ల శుభ్రా షెట్టీతో సాగిస్తున్న అఫిషియల్ లివింగ్ రిలేషన్ ..ఇలాంటి జంటలు మనదేశంలోని సెలబ్రిటీల నయా లైఫ్‌స్టైల్‌ను తెలియజేస్తోంది. మొత్తానికి కారణాలు, పర్యవసానాలు ఎలా ఉన్నా పిల్లల సమక్షంలో, పిల్లల అంగీకారంతో ఇలాంటి వివాహాలు ప్రపంచవ్యాప్తంగా బోలెడు జరుగుతున్నాయి. వివిధ కారణాలతో వైవాహిక జీవితాన్ని సరిగ్గా ఆస్వాదించనివారు, భార్యభర్తలమధ్య విభేదాలు పొడసూపడం వంటి కారణాలతో, తాము కోరుకున్న వారిని జీవిత సహచరిగా ఎంచుకోవడానికి వయసుతో పనిలేదని చాటుతున్న సెలబ్రిటీలు ప్రపంచవ్యాప్తంగా చాలామంది ఉన్నారు.

మండేలా లవ్ స్టోరీ

నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, గాంధేయవాది, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలాది ఇదే స్టోరీ. ఇంట ఓడి రచ్చ గెలిచిన మండేలా 80వ పుట్టినరోజు సందర్భంగా రెండో వివాహం చేసుకున్నారు. మానవతావాదిగా పేరుగాంచిన గ్రాసా మాచెల్‌ను మండేలా వివాహం చేసుకుని జీవిత చరమాంకంలో సరికొత్త జీవితాన్ని తాను కోరుకున్నట్టే గడిపారు.



రొమాన్స్, ట్విస్టులతో థ్రిల్లర్ స్టోరీ

మహిళా పారిశ్రామికవేత్త అయిన సునందా పుష్కర్‌ను వివాహం చేసుకోవడంతో అప్పటి కేంద్ర మంత్రి శశిథరూర్ సృష్టించిన వివాదాలు అన్నీ ఇన్నీ కావు. ఎంత పెద్ద హోదాలో ఉన్నా తాను ప్రేమించిన సునందను వివాహం చేసుకునేందుకు వివాదాలను లెక్కచేయకుండా షష్టిపూర్తికి దగ్గర వయసులో ఉన్న శశిథరూర్ అప్పటికే 50 ఏళ్ల సునందాను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత పాకిస్తాన్ జర్నలిస్ట్ మెహర్ తరార్‌తో ప్రేమంటూ శశి-సునంద మధ్య వివాదాలు సాగుతున్న సమయంలోనే సునంద అనుమానాస్పద మృతిచెందింది. శశిథరూర్ రొమాన్స్ అంతా సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించేలా బోలెడు ట్విస్టులతో ఉండడం హైలైట్.



తొలి సూపర్ స్టార్‌దీ ఇదే కథ


బాలీవుడ్ తొలి సూపర్‌స్టార్‌గా.. అమ్మాయిలు ఈయన్ను ముట్టుకుంటే చాలని పడి చచ్చే రోజుల్లో ఎంతోమందితో ప్రేమకథలు నడిపిన రాజేష్ ఖన్నా, చివరికి డింపుల్ కపాడియాను వివాహం చేసుకున్నారు. చట్టపరంగా విడిపోకపోయినా వీరి బంధం ఏమాత్రం నిలవలేదు. దీంతో చివరి రోజుల్లో రాజేష్ ఖన్నా సహనటి అయినా అనితా అద్వానీతో సహజీవనం చేస్తూనే మరణించారు.







పాత ముగ్గే.. కొత్తగా



భోగి, సంక్రాంతి, కనుమ ఈ మూడు పండుగల రోజు ఏ ముగ్గు వేయాలా అని ఆలోచిస్తున్నారా? మీరు వేసే ముగ్గు ఏదైనా దానికి ప్రాణం పోయాలంటే రంగుల ఎంపిక, రంగులు నింపే విధానంలో ఉందని గుర్తిస్తేచాలు. మీరు వేసే ముగ్గు చిన్నదైనా, సింపుల్ ముగ్గైనా ఫర్లేదు. కంటికి ఇంపుగా, క్రియేటివ్‌గా కనిపించేలా రంగులను నింపితేచాలు మీ ఇంటిముందున్న రంగోలి అందరి దృష్టిని ఆకర్షించేలా సరికొత్తగా కనిపిస్తుంది. ఒకే రంగును ఎప్పటిలాగే నింపకుండా ముగ్గులోని డిజైన్స్‌ను బట్టి డిఫరెంట్ కాంబినేషన్లో రంగులు నింపితే ఆ ముగ్గు నిండుగా, కన్నులవిందుగా కనిపిస్తుంది. ముగ్గుల పోటీల్లో కూడా విజేతలుగా నిలవాలంటే ఇలాంటి చిన్న ట్రిక్కులు పాటిస్తే సరి. పక్క ఫొటోలోని రంగోలీలు చూస్తే మీకు విషయం అర్థమవుతుంది. అందుకే ముగ్గు ఎంపికతోపాటు రంగులు నింపడంపై కూడా కసరత్తు అవసరం.

ఆ నవ్వుకు ఎంత కష్టం!

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లడానికి అవసరమైనంత డబ్బు లేకపోవడంతో.. ఇంట్లోనే ఉండి చికిత్స చేయించుకుంటున్నారు. గుండు హనుమంతరావు పరిస్థితి తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వం.. ఆయన చికిత్స కోసం 5 లక్షల రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి విడుదల చేసింది. ఈ విషయాన్ని మంత్రి కె. తారక రామారావు తన ట్విట్టర్‌ద్వారా వెల్లడించారు. హనుమంతరావు త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా కేటీఆర్ ఆకాంక్షించారు. కాగా.. గతంలో మెగాస్టార్ చిరంజీవి కూడా గుండు హనుమంతరావుకు 2 లక్షల రూపాయల చెక్కును మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (‘మా’) అధ్యక్షుడు శివాజీ రాజా ద్వారా అందజేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరి హృదయాల్లో తనదైన ఆరోగ్యకరమైన హాస్యంతో చెరగని ముద్ర వేసిన హనుమంతరావుకు మరింత సాయం అవసరం అవుతుంది. పదిమందీ చేతులు వేసి సాయం చేస్తే ఆ ప్రాణం మరింతకాలం నిలిచి మరిన్ని నవ్వులు విరబూస్తాయి.

నేను చేసింది..ఇంకెవరూ చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పట్టుబడిన యాంకర్ ప్రదీప్ సోమవారం హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసుల కౌన్సెలింగ్‌కు తండ్రితో కలిసి హాజరయ్యాడు. గంటకు పైగా కౌన్సెలింగ్ జరిగింది. అనంతరం ప్రదీప్ మీడియాతో మాట్లాడారు. పోలీసులు ఇచ్చిన తేదీ ప్రకారమే తాను కౌన్సెలింగ్‌కు హాజరయ్యానని తెలిపారు. ఈ విషయంలో చట్టప్రకారంగా నిబంధనలన్నింటినీ అనుసరించానని అన్నారు. ‘‘పోలీసుల కౌన్సెలింగ్‌లో చాలా విషయాలు తెలుసుకున్నాను. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ఎలాంటి పరిణామాలు తలెత్తుతాయన్నది, తాగి నడపడం వల్ల శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయి? ఎందుకు తాగి నడపకూడదు అన్నది చాలా స్పష్టంగా వివరించారు. ఈ విషయాలను నాకు తోచినంత వరకు మిగతావారికి చెప్పేందుకు ప్రయత్నిస్తాను. ఈ విషయంలో నాకు సహకరించిన ట్రాఫిక్ పోలీసులు, మీడియా, కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు’’ అని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ప్రదీప్ కొద్ది రోజులుగా పోలీసుల కౌన్సెలింగ్‌కు హాజరుకాని సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రదీప్ వస్తాడా? రాడా? అన్నది తెలియక పోలీసులు సైతం అయోమయంలో మునిగిపోయిన తరుణంలో ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసుల ముందు ప్రదీప్ హాజరయ్యాడు.

నిద్రమత్తు ప్రాణాలు తీసింది

(మొదటి పేజీ తరువాయి)

కార్గో బొలేరో వాహనంలో ఏకంగా 40 మందిని ఎక్కించుకుని నడపడంతో వాహనం బోల్తాకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలవగా.. మరో 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని చిన్నపాడు గ్రామానికి చెందిన కూలీలు.. గద్వాల పట్టణంలోని జిన్నింగ్ మిల్లులో విధులు ముగించుకుని బొలెరో వాహనంలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ధరూర్ మండలం పార్చర్ల గేట్ దగ్గర ఆ వాహనం రోడ్డు కిందకు దూసుకుపోయి బోల్తా పడింది. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. వాహనంలో వస్తున్న కార్మికులంతా.. గద్వాల పత్తి జిన్నింగ్ మిల్లులో పనులు చేసుకుంటున్నారని, అక్కడి నుంచి తిరిగొస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యారని చెప్పారు. ఓ బొలేరోలో 40 మందిని నిర్లక్ష్యంగా ఎక్కించిన కారణంగానే ప్రాణనష్టం చోటు చేసుకున్నట్లుగా భావిస్తున్నారు. విషయం తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వారంతా గుండెలవిసేలా రోదించడం అక్కడివారిని తీవ్రంగా కలిచివేసింది. కూలీ చేసి బతుకులు వెళ్లదీసే ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గనేరియా.. వదలదయా!

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని పుణెలోని జాతీయ ఎయిడ్స్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలతో కలిసి ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల పరిశోధకులు కనుగొన్నారు. మందులకు లొంగని తత్వాన్ని వంటబట్టించుకోవడం వల్ల గనేరియా వ్యాధి ముప్పుగా పరిణమిస్తోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఢిల్లీ, పుణె, ముంబై, హైదరాబాద్ ప్రాంతాలలోని కొంతమంది రోగులను పరిశీలించినపుడు ఏకంగా 124 రకాల గనేరియా స్ట్రైన్స్ మందులకు లొంగని నిరోధకతను పెంచుకున్నట్లు తెలిసింది. గాంధీ వైద్యకళాశాలకు చెందిన సయీదా ఎ.ముఖీత్, ఉస్మానియాకు చెందిన జి. శశికళ తదితరులు దీనిపై పరిశోధన నిర్వహించారు. వారి పరిశోధన పత్రాలు ఇటీవల జర్నల్ ఆఫ్ మెడికల్ మైక్రోబయాలజీలో ప్రచురితమయ్యాయి. సికింద్రాబాద్‌లో 20 కేసులు, హైదరాబాద్‌లో 16 కేసులను వీరు పరిశీలించారు.

గనేరియాలోని 98% ఐసోలేట్లు సిప్రోఫ్లోక్సాసిన్‌కు లొంగడం లేదని, పెన్సిలిన్‌కు 52%, టెట్రాసైక్లిన్‌కు 56%, అజిత్రోమైసిన్‌కు 5% లొంగడం లేదని తేల్చి చెప్పారు. స్పెక్టినోమైసిన్, సెఫ్టియాగ్జోన్, సెఫిగ్జిమ్ లాంటి మందులు మాత్రం కాస్త నయం చేస్తున్నాయి. రెండు రకాల స్ట్రెయిన్స్ మాత్రం సెఫ్టియాగ్జోన్, సెఫిగ్జిమ్ వాడినా తగ్గడం లేదు. భారతదేశంలో ఇలా యాంటీ బయాటిక్ మందులకు లొంగకుండా మొండికేస్తున్న గనేరియాను తాము గమనించామని, చివరకు అజిత్రోమైసిన్‌కు కూడా ఇవి నిరోధకతను పెంచుకుంటున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

ఒక్క భారతదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా 77 దేశాల నుంచి సేకరించిన సమాచారాన్ని బట్టి చూస్తే గనేరియా ఏ మందులకూ లొంగని మొండిఘటంలా మారుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గత సంవత్సరమే హెచ్చరించింది. కండోమ్‌ల వాడకం తగ్గడం, పట్టణీకరణ, ప్రయాణాలు పెరగడం, ఇన్ఫెక్షన్‌ను త్వరగా గుర్తించే సదుపాయాలు అంతగా లేకపోవడం, చికిత్స పూర్తిగా తీసుకోకపోవడం వంటి కారణాల వల్లే గనేరియా వ్యాప్తి, దాని నిరోధకత పెరుగుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తన నివేదికలో వెల్లడించింది. గడిచిన రెండు దశాబ్దాలు గానే గనేరియా వ్యాప్తి కూడా పెరిగిందన్నది నిపుణుల అభిప్రాయం. మొదట్లో దీన్ని పెన్సిలిన్‌తోనే నయం చేసేవాళ్లు. తొమ్మిదో దశకం చివరికి ఆ మందు పనిచేయడం మానేసింది. పాశ్చాత్య దేశాల్లో కూడా పరిస్థితులు ఇలాగే కనిపిస్తున్నాయి. సెఫ్టియాగ్జోన్ మాత్రమే ప్రస్తుతం బాగా ఉపయోగపడుతోందని తెలుస్తోంది. ఇక త్వరలోనే సెఫ్టియాగ్జోన్, సెఫిగ్జిమ్ మందులకు కూడా ఇది పూర్తిగా లొంగకుండా పోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వ్యాధికి సంబంధించిన చాలా రకాలు ప్రస్తుతం లొంగుతున్నా.. కొన్ని మాత్రం సెఫ్టియాగ్జోన్ వేసినా తగ్గకపోవడాన్ని వైద్యులు ఇప్పటికే గుర్తించారు. సాధారణంగా ఆ మందును టైఫాయిడ్ సహా పలు రకాల సమస్యలకు మన దేశంలో విస్తృతంగా వాడుతారు. అలాగే సిప్రోఫ్లోక్సాసిన్, అజిత్రోమైసిన్ లాంటి మందులు సైతం ఎక్కువగా వాడేయడం వల్ల వాటికి పలు వ్యాధులు నిరోధకతను పెంచుకుంటున్నాయి. అందువల్ల గనేరియా విషయంలో రాకుండా జాగ్రత్త పడటమే మంచిదని వైద్య నిపుణులు సూచించారు. కండోమ్ వాడకం తప్పనిసరని చెబుతున్నారు. గనేరియాను తగ్గించడానికి కొత్త మందులు కనుక్కోవడం కూడా అంత సులభం ఏమీ కాదు. ఎందుకంటే ప్రస్తుతం కేవలం మూడు కొత్త మందులు మాత్రమే ఔషధ అభివృద్ధి దశలో ఉన్నాయి. అవి అందుబాటులోకి రావడానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల గనేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ నం.1

(మొదటి పేజీ తరువాయి)

స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఉద్ఘాటించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని దిగువ మానేరు జలాశయం పరిధిలోని ఉజ్వల పార్క్ వద్ద రూ. 25 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఐటీ టవర్ నిర్మాణానికి మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కేటీఆర్ మాటాడుతూ.. ‘‘ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తే. తీరని కష్టాలు వస్తాయని గత కాంగ్రెస్ పాలకులు కోడైకూస్తే.. ప్రజలు అయోమయానికి గురయ్యారు. కానీ..కేవలం మూడున్నర ఏళ్లలో కాంగ్రెస్ కుట్రలను, కుతంత్రాలను పటాపంచలు చేసి సీఎం కె చంద్ర శేఖర్‌రావు దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టారు. అసాధ్యమనుకున్న 24 గంటల కరెంటును సుసాధ్యం చేశారు’’ అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రూ. 56 వేల కోట్ల ఐటీ ఎగుమతులు ఉండగా.. ప్రస్తుతం వాటి విలువ విలువ రూ.87 వేల కోట్లకు చేరుకుందని తెలిపారు. తెలంగాణ యువతకు ఐటీలో శిక్షణ ఇచ్చేందుకు వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌లో ఐటీ టవర్లను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. భూమి కేటాయిస్తే కరీంనగర్‌లో మరో ఐటీ టవర్ నిర్మాణానికి అను మతులు ఇస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్‌లో ఐటీ టవర్ ప్రారంభం రోజే 1000 మందికి ఉద్యోగ అవకాశాలు అందుతాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా టాప్ 100 కంపనీలను మన తెలంగాణ ప్రజలే నడిపిస్తున్నారని అన్నారు.



కేంద్రమంత్రులు సీఎంను ప్రశంసిస్తున్నారు

తెలంగాణ అభివ ద్ధిని చూసి కేంద్రమంత్రులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఉద్యమ నాయకుడు, పరిపాలన దక్షుడు కేసీఆర్ అంటూ అరుణ్ జైట్లీ కొనియాడారని గుర్తు చేశారు. రెండ్రోజుల క్రితం కేంద్ర మంత్రి మహేశ్ శర్మ కూడా సీఎం కేసీఆర్ గొప్ప విజన్ ఉన్న నాయకుడు అని ప్రశంసించారని తెలిపారు. కానీ ఇక్కడున్న బీజేపీ నేతలమో ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని విమర్శిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

యువత మేధస్సుకు పదును పెట్టాలి

దేశంలో 50 శాతం జనాభా 27 ఏళ్ల లోపు యువతే ఉన్నారని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశంలో 65 శాతం జనాభా 35 ఏళ్ల లోపు వారే ఉన్నారని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీ పడే పౌరులుగా మనం తయారు కావాలని పిలుపునిచ్చారు. యువత ఉన్నతమైన, నవీన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ఉద్యోగాలు ఆశించటం మాత్రమే కాదు.. ఉద్యోగాలు కల్పించేలా యువత ఎదగాలని అన్నారు. యువత మేధస్సుకు పదును పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. యువత కోసం ప్రయివేటు రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. యువతకు నాణ్యమైన శిక్షణ కల్పిస్తే ఉపాధి కల్పన సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికే వరంగల్‌లో ఐటీ హబ్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కరీంనగర్‌లో త్వరలోనే టాస్క్‌ను నెలకొల్పుతామని కేటీఆర్ ప్రకటించారు. నీళ్లు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగమని చెప్పిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని తెలిపారు. త్వరలోనే ఇంటింటికి తాగునీరు అందివ్వబోతున్నామని స్పష్టం చేశారు.

తెలంగాణ చరిత్రాత్మక రాష్ట్రం: ఈటల

హైదరాబాద్ తర్వాత కరీంనగర్ పెద్ద ఐటి కంపెనీలకు నిలయమని ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ కంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాష్ట్రమని, చారిత్రాత్మక రాష్ట్రమని అభివర్ణించారు. ఆస్ట్రేలియా తరహాలో కరీంనగర్‌లో రోడ్ల అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వినోద్, జిల్లా ఇంచార్జి కలెక్టర్ శరత్, ఎమ్మెల్యేలు కమలాకర్, రసమయి బాలకిషన్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ తుల ఉమ, ఎమ్మెల్సీలు లక్ష్మణ్‌రావు, భానుప్రసాద్, నగర మేయర్ రవీందర్‌సింగ్, నగరపాలక సంస్థ కమిషనర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

పంట పండాలె!

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా తుమ్మిళ్ల గ్రామంవద్ద రూ.783 కోట్లతో చేపట్టిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఎంపీ మంద జగన్నాథం అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ‘‘పంటలు నిండుగా పండాలె... పాత రోజులు మల్ల యాది రావాలె... రైతన్న కళ్లల్ల మెరుపు జూడాలె’’ అని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ప్రత్యేక తెలంగాణ కోసం 2002 జూలై 22న కేసీఆర్ అలంపూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించారని గుర్తుచేశారు. ఆ సందర్భంలోనే రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్)కింద రైతులను ఆదుకునేందుకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం చేపడతామని హామీ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఆ మాట ప్రకారం 75 గ్రామాల్లో 87 వేల ఎకరాలకు సాగునీరందించేలా తుమ్మిళ్ల లిఫ్టును మంజూరు చేశామన్నారు. దీన్ని ఆరు నెలల్లో పూర్తిచేసి సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా సుంకేశుల రిజర్వాయర్ నుంచి ఆర్డీఎస్ కాల్వకు ఎత్తిపోతద్వారా ఖరీఫ్‌కల్లా సాగునీరిస్తామని ప్రకటించారు. రెండు దశల్లో సాగే ఈ పథకం కింద తొలిదశ పనులు ఇప్పటికే మొదలైనట్లు తెలిపారు. ఆర్డీఎస్ ఆయకట్టు పచ్చని పంటలతో కళకళలాడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నడిగడ్డలోని అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో ఈసారి గులాబీ జెండా ఎగురడం తథ్యమని చెప్పారు. ఆర్డీఎస్ ఆధునీకరణపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించామని, వేసవి ముగిసేలోగా ఆనకట్ట ఎత్తు పెంచేలా చూస్తామని ఆ రాష్ట్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

రాష్ట్రం వచ్చింది కాబట్టే తుమ్మిళ్ల సాధ్యమైంది

ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిరాదరణకు ఆర్డీఎస్ సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు. బచావత్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు తుంగభద్ర నది నుంచి తెలంగాణకు 15.9 టీఎంసీల వాటా రావాల్సి ఉండగా 5 టీఎంసీలు కూడా రావడం లేదని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చింది కాబట్టే తుమ్మిళ్ల లిఫ్టు సాకారమైందిగానీ, కాంగ్రెస్‌తో అయితే సాధ్యమయ్యేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఏడు దశాబ్దాలుగా కనిపించని అభివృద్ధి మూడేళ్లలో కళ్లముందు కనిపిస్తున్నా కాంగ్రెస్ నాయకులు కళ్లుండీ చూడలేని వాళ్లయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులు కట్టడానికి పదేళ్లు పట్టేదని, నేడు టీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదలతో మూడేళ్లలోనే పూర్తిచేసి నీళ్లు ఇస్తున్నామని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 4.5 లక్షల ఎకరాలమేర కొత్త ఆయకట్టు సాగులోకి వచ్చిందన్నారు. రైతుల కోసం పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2.13 లక్షల క్వింటాళ్ల ఉల్లిగడ్డను పొలంవద్దనే కొన్నట్లు గుర్తుచేశారు. అలాగే రూ. 18 కోట్లతో 30 వేల టన్నుల నిల్వ సామర్థ్యంతో గోదాములు నిర్మించామన్నారు. ఇక 24 గంటల ఉచిత విద్యుత్, ఎరువులు-విత్తనాల కొరత లేకుండా దేశంలో తొలిసారి ఎకరాకు రూ. 8వేలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు.

రైతులను ఆదుకుంటామని ఎన్నో వాగ్దానాలు చేసిన పార్టీలు ఇప్పటిదాకా చేసిందేమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరం జన్‌రెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గువ్వల బాల్‌రాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, సంపత్ కుమార్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మంద శ్రీనాథ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు బండ్ల లక్ష్మీదేవి, పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రజత్ కుమార్ సైనీ తదితరులు పాల్గొన్నారు.



పాల మూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద నిర్మిస్తున్న ఏదుల రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

పాలమూరు ప్రజల కల సాకారం

వనపర్తి: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాలమూరు ప్రజల కల సాకారమవుతుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం ఆయన వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల సరిహద్దులో పాల మూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద నిర్మిస్తున్న ఏదుల రిజర్వాయర్ పనులను పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ఇక్కడికి చేరుకున్న అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో కలసి వాహనాల్లో వెళ్లి పనులను పరిశీలించారు. అన్ని పనులూ వేగంగా సాగుతుండటంపై ఇంజనీరింగ్ సిబ్బందిని అభినందించారు. అయితే, మరింత వేగం పుంజుకోవాలని ఈ ప్రాజెక్టు పనులను సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని గుర్తుచేశారు. రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టులు కడుతుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు కోర్టుకు వెళ్లి పనులను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సకాలంలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఏదుల రిజర్వాయర్‌లో కల్వకుర్తి ఎత్తిపోతల కింద కూడా కొంత భాగం చేపట్టినట్లు ఆయన వివరించారు. ఉద్దండాపూర్ రిజర్వాయర్ పనులను మార్చిలోపు పూర్తి చేసి తొలి రిజర్వాయర్‌కు నీరందిస్తామన్నారు. ఏదుల రిజర్వాయర్ పునరావాసం కింద రెండు గ్రామాల్లో నిరాశ్రయులయ్యేవారికి కొత్త ఇండ్లు నిర్మించి తరలిస్తామని తెలిపారు. నష్ట పరిహారం కింద ఇల్లు లేదా డబ్బు ఎంచుకోవచ్చునని సూచించారు.

అంపశయ్యపై ‘బిల్ట్’

(మొదటి పేజీ తరువాయి)

మూసుకుపోయిన గేట్లు రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా తెరుచుకోవడంలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా మంగపేట మండలం కమలాపురంలో 40 ఏండ్ల క్రితం బిల్ట్ రేయాన్స్ ఫ్యాక్టరీ ప్రారంభమైంది. రూ.300 కోట్ల పెట్టుబడితో స్థాపించిన ఈ పరిశ్రమ ప్రస్తుతం అంపశయ్యపై ఉంది. 2014 వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగిన బిల్ట్ (బల్లార్‌పూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్) 2014 ఏప్రిల్ నుంచి ఉత్పత్తిని నిలిపివేసింది. గతంలోనూ (1985లో 18 నెలలు, 2009లో 6 నెలలు) ఇలా మూతపడిన సంగతి తెలిసిందే కావడంతో కార్మికులలో పెద్దగా ఆందోళన లేదు. గతంలోలానే కంపెనీ గేట్లు మళ్లీ తెరుచుకుంటాయని భావించారు. అప్పటిదాకా ఎలా జీవించాలన్న ఆందోళన రేగినా చేసేదేంలేక కంపెనీ ఎప్పుడు తెరుస్తారా అంటూ ఎదురుచూడడం ప్రారంభించారు. మొదట్లో 8 నెలల దాకా కార్మికులకు జీతాలు ఇచ్చిన యాజమాన్యం.. ఆ తర్వాత ఆ ఊసే మరిచిపోయింది. దీంతో ఉద్యోగులు, కార్మికులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కుటుంబ పోషణ పెనుభారంగా మారింది. బతుకులు దుర్భరంగా మారాయి. జీతాలు ఆగిపోవడంతో పాటు నెలలు గడుస్తున్నా కంపెనీ తెరిచే సూచనలు కనిపించకపోవడంతో కార్మికులు ఆందోళనలు, నిరసనలు చేపట్టారు.

యాజమాన్యం చెబుతున్న కారణాలు..

బిల్ట్ ప్రారంభమైనప్పటి నుంచి విజయవంతంగా నడిచింది. కోట్లల్లో ఆదాయాన్ని గడించింది. ఉమ్మడి రాష్ట్రంలోని 23 జిల్లాల నుంచి సుబాబుల్, జామాయిల్ కలప సేకరించేది. ఇక్కడ కలప గుజ్జు తయారు చేసి మహారాష్ట్రకు ఎగుమతి చేసేది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ నుంచి కలప సరఫరా ఆగిపోయింది. అదే సమయంలో విదేశాల నుంచి చౌకధరకే కలప గుజ్జు దిగుమతి అవుతుండడంతో మహారాష్ట్ర బిల్ట్‌లో ఉత్పత్తి అయ్యే కలప గుజ్జు దిగుమతి చేసుకోవడం నిలిపేసింది. అయితే నాణ్యత లేకనో, డిమాండ్ లేకనో తమ ఉత్పత్తికి మార్కెట్ లేదంటున్న యాజమాన్యం మాటల్లో వాస్తవంకన్నా నిర్లక్ష్యమే ఎక్కువగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా 2000 టన్నుల కలప గుజ్జు అవసరం కాగా ప్రస్తుతం కేవలం 300 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. దీన్ని గమనిస్తే కంపెనీ వివరణ వాస్తవ దూరమని తెలుస్తోంది. యాజమాన్యం కావాలనే ఈ విధంగా చేస్తోందనే వాదనలూ ఉన్నాయి. ఇక్కడి సహజవనరులను వాడుకుని సంపాదించిన డబ్బును ఇతర ప్రాంతాల్లో పెట్టుబడిగా పెట్టిందనీ, దీన్ని మూసేయడానికే పన్నాగం పన్నిందని కార్మికులు ఆరోపిస్తున్నారు.



యాజమాన్య నిర్లక్ష్య ధోరణి..

తమ బాధలు, ఇబ్బందుల గురించి యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో 2015లో కార్మికులు నిరాహార దీక్షలు చేపట్టారు. దాదాపు 400 రోజులు రిలే నిరాహార దీక్షలు చేసి తమ ఆవేదనను తెలియపరిచారు. దీంతో స్పందించిన కేసీఆర్ బిల్ట్ పరి శ్రమను పునః ప్రారంభించడానికి యాజమాన్యానికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఏటా రూ.30 కోట్లు మంజూరు చేస్తా మని చెప్పారు.

దీనికి సమ్మతించిన యాజమాన్యం పరిశ్రమను తెరుస్తానని చెప్పింది. కానీ ఆచరణలో నిర్లక్ష్యం కనబరిచింది. అప్పటి నుంచి ఎన్నిసార్లు, ఎన్ని చర్చలు జరిపినా హామీలు మాత్రమే ఇస్తూ వస్తోంది.

మారిన పరిస్థితులు.. కష్టాల్లో కార్మికులు..

పరిశ్రమ సజావుగా నడిచిన కాలంలో యాజమాన్యం.. కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించింది. జీతభత్యాలతో పాటు బోనస్, వైద్య సేవలు, నివాస, రవాణా నిమిత్తం బస్సు సౌకర్యం కల్పించేది. కార్మికుల పిల్లలకు అతి తక్కువ ఫీజుతో పదో తరగతి వరకు తమ పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పించింది. ఇంటర్ విద్యార్థులకు ఆర్థికసాయాన్ని అందించింది. ప్రస్తుతం ఇవన్నీ నిలిచిపోయాయి. దాంతో పూట గడవడమే కష్టంగా మారిన కార్మికులు పిల్లలను చదివించలేకపోతున్నారు. అప్పట్లో ఆదాయాన్ని బట్టి వీరికి గులాబీ రేషన్ కార్డులివ్వడంతో ప్రస్తుతం రేషన్ షాపుల్లో బియ్యం, నిత్యావసర సరుకులు దొరకడంలేదు. జీతాలు రాక, తినడానికి తిండి లేక, పిల్లలను చదివించలేక, కుటుంబ భారాన్ని మోయలేక కార్మికులు ఎదుర్కొంటున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. కొందరు కూలీ చేస్తుండగా మరికొందరు ఏదో ఒక పని వెతుక్కుంటూ వలస బాట పట్టారు.

ఆకలి బాధలు.. ఆత్మహత్యలు..

ఫ్యాక్టరీ మూతపడిన నాటి నుంచి యాజమాన్యంతో చర్చలు, సమా వేశాలు, ధర్నాలు, దీక్షలు ఇలా ఎన్నోదారుల్లో ప్రయత్నాలు చేసి కార్మికులు విసిగిపోయారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే ఇద్దరు ఆత్మహత్య చేసుకోగా 11 మంది సరైన వైద్యం అందక మృతి చెందారు. ఇటీవల మండవ శంకర్‌రావు అనే కార్మికుడు తన కష్టాలకు, చావుకు యాజమాన్యమే కారణమని సూసైడ్ నోట్ రాసి మరీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా అందరినీ కలచి వేసింది. శంకర్‌రావు ఆత్మహత్య చేసుకున్న రోజు నుంచి కార్మికులు మళ్లీ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. నేటికి ఆ దీక్షలు 31వ రోజుకు చేరుకున్నాయి.

10న సమస్య పరిష్కారమయ్యేనా..?

ఈ నెల 2న కార్మిక సంఘాల నాయకులు సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, హోం, కార్మిక శాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చందూలాల్‌లను కలిసి తమ బాధలను వెల్లడించారు. స్పందించిన ఉపముఖ్యమంత్రి కంపెనీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు ఈ నెల 9న ఒక నెల జీతం అందించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. మిగిలిన జీతభత్యాలు, బకాయిలు 10న సమావేశమై ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలన్నారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో 9, 10వ తేదీలతో తమ సమస్యలు పరిష్కారమై, కంపెనీ తెరుస్తారని కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మరొకరు చావొద్దు: మండవ మంజుల

కంపెనీ మూతపడడంతో కనాకష్టాలు పడుతున్నాం. పనీపాటా లేక పైసలు లేక కుటుంబాన్ని పోషించలేక మా ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి అఘాయిత్యం మరొకరు చేసుకోకముందే కంపెనీ తెరిపించాలి. అందరినీ ఆదుకోవాలి.

అన్యాయం: వడ్లూరి రాంచందర్, కార్మిక నేత

బిల్ట్ ఉత్పత్తికి అమ్మకాలులేవని కంపెనీ మూసేయడం అన్యాయం. ప్రభుత్వ సహాయం చేస్తానన్నా పరిశ్రమ ప్రారంభించకపోవడంతోనే యాజమాన్య ధోరణి అర్థమవుతుంది. 32 నెలలుగా జీతాలు లేక కార్మికులం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. అప్పులు పుట్టక చస్తున్నాం. ప్రభుత్వం పూనుకుని కార్మికులకు జీతాలు ఇప్పించాలి.

'స్వలింగ సంపర్కం'పై తీర్పు పునఃపరిశీలన


- సుప్రీం అంగీకారం... విస్తృత ధర్మాసనానికి బదిలీ
- సెక్షన్ 377 రద్దు కోరుతూ మరో పిటిషన్ దాఖలు



న్యూఢిల్లీ, జనవరి 8: స్వలింగ సంపర్కం నేరమేనని ప్రకటిస్తూ ఇచ్చిన ఐదేళ్ల కిందటి తీర్పు పునఃపరిశీలనకు సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనం అంగీకరించింది. ఈ మేరకు ఐదుగురు స్వలింగ సంపర్కులు వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. దీంతోపాటు భారత శిక్షా స్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 377 చెల్లదని ప్రకటించాల్సిందిగా కోరుతూ మరో వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది. అంతేకాకుండా ఈ పిటిషన్లపై స్పందన తెలపాల్సిందిగా ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీచేసింది. ఇద్దరు వయోజనుల మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడే లైంగిక సంబంధాన్ని 'అసహజ నేరం'గా సెక్షన్ 377 పరిగణిస్తుంది. పురుషులు లేదా మహిళలు 'ప్రకృతి విరుద్ధ' రీతిలో స్వచ్ఛందంగా లేదా జంతువుతో శారీరక సంబంధానికి పాల్పడితే పదేళ్లదాకా జైలుశిక్షతోపాటు జరిమానా విధించవచ్చునని ఈ సెక్షన్ నిర్దేశిస్తోంది. ఈ నేపథ్యంలో సదరు సెక్షన్‌పై లోతైన చర్చ అవసరమని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. నవతేజ్ సింగ్ జోహార్ అనే వ్యక్తి సెక్షన్ 377ను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాల్సిందిగా అభ్యర్థిస్తూ దాఖలు చేసిన తాజా పిటిషన్‌పై ధర్మాసనం విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా– లైంగిక భాగస్వామిని ఎంచుకోవడం ప్రాథమిక హక్కు కిందకు వస్తుందని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ మేరకు 'వ్యక్తిగత గోప్యత'పై పిటిషన్‌మీద విచారణ అనంతరం 9మంది జడ్జిల ధర్మాసనం నిరుడు ఆగస్టులో తీర్పు ఇచ్చిందని ఉటంకించారు. తదనుగుణంగా పరస్పర అంగీకారంతో అసహజ శారీరక సంబంధం పెట్టుకున్న వయోజనులను శిక్షించే వీల్లేదని వాదించారు. ఇదే అంశంపై 2009లో విచారించిన కేసుపై తీర్పు ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు కూడా సదరు సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసినట్లు గుర్తుచేశారు. అయితే, సదరు తీర్పును సుప్రీం కోర్టు తోసిపుచ్చుతూ సెక్షన్ 377 రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసింది. దీనిపై సమీక్ష కోరుతూ వేసిన పిటిషన్‌ను కొట్టివేయగా 'తీర్పు సంస్కరణ' పిటిషన్ దాఖలవడంతో విస్తృత ధర్మాసనానికి పంపింది. తాజా పిటిషన్లను కూడా ఆ ధర్మాసనానికే పంపాలని నిర్ణయించింది.

గాంధీజీని చంపింది గాడ్సే ఒక్కడే

- 'రహస్య వ్యక్తి' లేరు... సుప్రీం కోర్టుకు నివేదన



న్యూఢిల్లీ, జనవరి 8: మహాత్ముడిని కాల్చి చంపింది గాడ్సే మాత్రమేనని, ఈ హత్య వెనుక 'రహస్య వ్యక్తి' ఎవరూ లేరని సీనియర్ న్యాయవాది అమరేంద్ర శరణ్ సోమవారంనాడు సుప్రీం కోర్టుకు తెలియజేశారు. బాపూజీ హత్య వెనుక అంతర్జాతీయ నిఘా సంస్థ పాత్ర ఉన్నందున కేసును తిరగదోడి సమగ్ర విచారణకు ఆదేశించాలని పంకజ్ ఫడ్నిస్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. గాడ్సే పేల్చిన మూడు బులెట్లవల్లగాక రహస్య వ్యక్తి పేల్చిన నాలుగో బుల్లెట్‌తోనే జాతిపిత మరణించినట్లు అందులో పేర్కొన్నారు. గాంధీజీ హత్యకు సంబంధించి మరాఠాలపై మచ్చపడిందని, ప్రత్యేకించి వీర్ సావర్కర్‌నే అందుకు ప్రధాన కారకుడుగా చరిత్రలో ఆరోపించారని వివరించారు. ఈ రహస్యాల ముడివిప్పడం కోసం తాజా దర్యాప్తు అవసరమని నివేదించారు. తన వాదనకు సంబంధించిన ఆధారాల పేరిట ఓ పత్రాల దొంతరను కూడా జతచేశారు. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... అమరేంద్ర శరణ్‌ను 'కోర్టు సహాయకుడు'గా నియమించింది. పిటిషనర్ సమర్పించిన పత్రాలతోపాటు పాత రికార్డులను క్షుణ్నంగా శోధించి పునర్విచారణ అవసరంపై నివేదిక ఇవ్వాలని సూచించింది. ఈ నేపథ్యంలో న్యాయవాదులు సంచిత్ గురు, సమర్థ్‌ఖన్నాల సహకారంతో పిటిషనర్ సమర్పించిన పత్రాలను, హత్యపై కోర్టు విచారణకు సంబంధించిన 4వేల పేజీల రికార్డులను శరణ్ లోతుగా పరిశీలించారు. అలాగే 1969నాటి జీవన్‌లాల్ కంపూర్ విచారణ కమిషన్ నివేదికను శోధించారు. వీటి ఆధారంగా సమర్పించిన నివేదికలో– పిటిషనర్ పేర్కొన్న 'నాలుగో బుల్లెట్–రహస్య వ్యక్తి' సిద్ధాంతం పూర్తిగా నిరాధారమని తేల్చారు. అందువల్ల పునర్విచారణ అవసరమే కనిపించడంలేదని స్పష్టం చేశారు.




బ్రిటన్ పార్లమెంటులో పోర్న్ వీక్షణం

- సభ్యుల నుంచి రోజుకు 160 విజ్ఞప్తులు
- 6 నెలల్లో మొత్తం 24 వేల ప్రయత్నాలు

లండన్, జనవరి 8: ప్రజా సంక్షేమంకోసం కొత్త చట్టాలను రూపొందించేందుకు ఉద్దేశించిన పార్లమెంటులో సభ్యులు అశ్లీల వీడియోలను చూస్తున్నారంటే నమ్మగలమా.. బ్రిటన్ పార్లమెంట్ సభ్యులలో కొంతమంది చేసే పని ఇదేనని తాజాగా వెల్లడైంది. దేశం నడవడికను నిర్ణయించే ప్రదేశంలో తప్పటడుగులు పడ్డ వైనానికి సంబంధించి పూర్తి వివరాలు.. హౌజ్ ఆఫ్ పార్లమెంట్‌గా వ్యవహరించే బ్రిటన్ పార్లమెంటులో ఉన్న కంప్యూటర్ల నుంచి తమకు అశ్లీల వెబ్‌సైట్ల యాక్సెస్ ఇవ్వాలని దాదాపు 24,473 విన్నపాలు వచ్చినట్లు బ్రిటన్ ప్రెస్ అసోసియేషన్ వెల్లడించింది. ఫ్రీడమ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్(ఎఫ్ఓఐ) పేరిట బ్రిటన్ ప్రెస్ అసోసియేషన్ ఈ సమాచారం సేకరించింది. గత ఏడాది జూన్ నుంచి డిసెంబర్ వరకు అశ్లీల వెబ్‌సైట్ల యాక్సెస్ కోరుతూ రోజుకు 160 విజ్ఞప్తులు వచ్చినట్లు తెలిపింది. కాగా, వెస్ట్ మినిస్టర్‌లో ఇప్పటికే పలువురిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే! దీనిపై బ్రిటన్ ప్రధాని థెరిసా మే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తన స్నేహితుడైనా క్షమించకుండా మంత్రి డామియన్ గ్రీన్‌ను గత ఏడాది పదవి నుంచి తొలగించారు. ఆయన కంప్యూటర్లలో అశ్లీల వీడియోలు లభించినప్పటికీ పోలీసులను తప్పుదారి పట్టించారని ఆరోపణలు రావడంతో ఆయనను తొలగించారు. అయితే, తాజాగా వెల్లడైన సమాచారం ప్రకారం చాలామంది ప్రభుత్వ పెద్దలు తమ కంప్యూటర్ల నుంచి అశ్లీల వీడియోలకోసం విజ్ఞప్తులు పంపిస్తున్నట్లు వెల్లడైంది.

మనది అస్తవ్యస్త దేశమా!

- 'ఆధార్'పై వార్త రాసిన.. విలేకరిపై కేసు పెట్టడమా?
- సర్కారుపై బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా ధ్వజం



న్యూఢిల్లీ, జనవరి 8: అధికార బీజేపీ ఎంపీ, 'షాట్‌గన్'గా పేరున్న శత్రుఘ్న సిన్హా సోమవారం కేంద్ర ప్రభుత్వంపై మాటల తూటాలు పేల్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ట్విట్టర్‌లో విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ)పై ధ్వజమెత్తారు. ''మనం ఎక్కడున్నాం? భారత్ అరటిపండ్ల ఎగుమతితో బతికే అస్తవ్యస్త దేశంఎప్పుడైంది? 'ఆధార్'పై వార్త రాసినందుకు ప్రతికమీద, విలేకరిపైనా కేసు పెట్టడమేమిటి? ఇది ఏ రకం న్యాయం? ఇందులో కక్ష సాధింపు రాజకీయం మాత్రమే కనిపిస్తోంది. చివరకు సమాజం కోసం, జాతికోసం ముందడుగేసే సామాన్యులు కూడా బాధితులు కావడం దారుణం'' అని మండిపడ్డారు. ఎడిటర్స్ గిల్డ్ కూడా ఈ చర్యను ఖండిస్తూ– 'ఇది జర్నలిస్టులను కేసులతో భయపెట్టే ప్రయత్నం'గా అభివర్ణించింది. 'ఆధార్' సమాచారాన్ని కొందరు వ్యక్తులు రూ.500కే అమ్మేయడంపై 'ది ట్రిబ్యూన్' పత్రిక విలేకరి గత వారం ఓ కథనం రాశారు. దీనిపై స్పందించిన యూఐడీఏఐ అధికారులు సదరు పత్రికతోపాటు విలేకరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రజలందరి జీవసంబంధ వివరాలతో కూడిన 'ఆధార్' సమాచారం అమ్ముడయ్యే దుస్థితిని వెల్లడించినందుకు పత్రికలు, విలేకరులపైన రాజకీయ కక్ష సాధించడం ఏమిటని 'షాట్‌గన్' ప్రశ్నించారు. 'రిపోర్టర్స్ వితవుట్ బోర్డర్స్' (సరిహద్దుల్లేని పాత్రికేయులు) సంస్థ నిరుడు ప్రకటించిన 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీ'లోని 180 దేశాల జాబితాలో భారత్ మూడు స్థానాలు పతనమై 136వ స్థానానికి దిగజారడాన్ని ఈ సందర్భంగా సిన్హా ఉటంకించారు. కాగా, వాట్సప్‌లోని ఓ బృందంవారు కేవలం రూ.500కే మొత్తం ఆధార్ భాండాగారాన్ని అమ్మేశారని ట్రిబ్యూన్ పత్రిక విలేకరి తన కథనంలో పేర్కొన్నారు. ఒక ఐడీ, పాస్‌వర్డ్ కూడా ఇచ్చారని, వీటిద్వారా ఎవరి ఆధార్ వివరాలైనా అందుబాటులోకి వస్తున్నాయని అందులో వెల్లడించారు. దీనిపై వెంటనే స్పందించిన యూఐడీఏఐ– అందులో వాస్తవం లేదని ప్రజల బయోమెట్రిక్ సమాచారం భద్రంగా ఉందని తొలుత ప్రకటించింది. అటుపైన 'ఇది సమాచార దుర్వినియోగమంటూ' ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పత్రికా స్వేచ్ఛను తాము గౌరవిస్తామంటూనే విలేకరిసహా ఈ ఉదంతంలో భాగస్వాములపై చర్య తీసుకోవడం తమ విధుల్లో భాగమని చిలకపలుకులు పలికింది. పైగా ఫిర్యాదులో పేర్కొన్నవారందరూ నిందితుల కానవసరం లేదని పేర్కొంది.

క్రికెట్ మ్యాచ్‌లో పాక్ జాతీయగీతం

- పోలీసుల అదుపులో కశ్మీర్ యువకులు

శ్రీనగర్, జనవరి 8: క్రికెట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు పాకిస్థాన్ జాతీయగీతాన్ని ఆలపించిన యువకులను జమ్ము కశ్మీర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కశ్మీర్‌లోని ఆరిన్ ప్రాంతంలో ఆదివారం ఓ స్థానిక క్రికెట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు క్రీడాకారులు పాక్ జాతీయ గీతాన్ని ఆలపించగా, అందులోని నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారి కోసం గాలింపు చేపడుతున్నారు. కశ్మీర్‌లోని గాన్‌దేర్‌బల్ జిల్లాలో 2017 ఏప్రిల్‌లో కూడా క్రికెట్ మ్యాచ్ సందర్భంగా క్రీడాకారులు పాక్ జాతీయ గీతాన్ని ఆలపించారని పోలీసులు తెలిపారు.

అష్టభార్యల 'కష్ట'సఖుడు

ఎనిమిదేళ్లు... ఎనిమిది పెళ్లిళ్లు

- తమిళ 'పురుషోత్తమ్'డి కృష్ణలీల
- తొలుత ముగ్గురితో మూడుముళ్లు
- ఇద్దరి నుంచి రూ.4.5 కోట్లు స్వాహా
- ఆపై మరో నలుగురికి పసుపుతాడు

కోయంబత్తూరు, జనవరి 8: అతడు అష్టభార్యల 'కష్ట'సఖుడు... ఎనిమిదేళ్లలో ఎనిమిది పెళ్లిళ్లు చేసుకున్న 'పురుషోత్తము'డు... తొలి భార్య చనిపోయాక మొదట ఇద్దరిని ఆ'కట్టుకుని' అనురాగ ప్రదర్శనతో మాయచేసి '4.5 కోట్లు అపహరించి అదృశ్యమయ్యాడు. ఆపై మరో నలుగురికి పసుపుతాడు కట్టి కనుమరుగయ్యాడు.. మూడో భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయడంతో ప్రస్తుతం పరారీలో ఉన్నాడు... తమిళనాడులోని వెల్లలూరు వాస్తవ్యుడు పురుషోత్తమన్ కృష్ణలీలలు మీరే చదవండి... ఆదిలో అతడు ట్రక్కు రవాణా వ్యాపారం చేసేవాడు. కానీ, అది అంతగా కలిసిరాలేదు. దాంతో... 'వివాహమే వ్యాపారం'గా సరికొత్త దందా ప్రారంభించాడు. అలాగని అతడేదో పెళ్లిళ్లు చేయిస్తాడనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఒకదాని తర్వాత మరొకటిగా పెళ్లిళ్లు చేసుకున్నాడు. అలా ఎనిమిదేళ్లలో ఎనిమిది మందిని పెళ్లాడాడు. వారిలో ఇద్దరిని మాయచేసి రూ.4.5 కోట్లు దోచుకున్నాడు. ఈ సౌభాగ్యానికి భార్యా వైభోగం తోడైంది. కానీ.. పాపం పండి ఒక భార్య ఫిర్యాదుతో మాయగాడి బండారం బయటపడింది. తొలి భార్య చనిపోయాక చెన్నైకి చెందిన ఇందిరాగాంధీ (45) అనే లెక్చరర్‌ను పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్ల తర్వాత 'మనకు ఇక్కడ ఇంత పెద్ద ఇల్లెందుకు? దీన్ని అమ్మేసి, కోయంబత్తూరు స్థిరపడదాం' అని ప్రతిపాదించాడు. పెళ్లయిన నాటినుంచీ భర్త చూపుతున్న ప్రేమానురాగాల మైకంలో మునిగిన ఆమె.. రెండో ఆలోచన లేకుండా అందుకు సరేనన్నారు. తన ఇంటిని కోటిన్నర రూపాయలకు అమ్మిన తర్వాత భర్త హఠాత్తుగా అదృశ్యం కావడంతో ప్రేమ మైకంనుంచి వాస్తవ లోకంలో పడ్డారు. నిజం తెలిసేసరికే ఆమె... ఉన్నదంతా పోగొట్టుకుని, నిరాశ్రయురాలై వీధినపడ్డారు. కానీ, చాలామంది ఆడవాళ్లలా ఆమె ఏడుస్తూ కూర్చోలేదు. వెంటనే వెళ్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై వారు దర్యాప్తు ప్రారంభించగా పురుషోత్తమన్ భార్యలమంటూ మరో ఇద్దరు వెలుగులోకి వచ్చారు. వారిలో ఒకరైన కోయంబత్తూరు వాసి కుముదవల్లి అప్పటికే అతడి మాయలో పడి రూ.3 కోట్లు సమర్పించుకోవడం గమనార్హం... తన ఆస్తికి సంబంధించిన సివిల్ తగాదా కోర్టులో ఉందని, అది తేలిపోతే రూ.17 కోట్లు వస్తాయని నమ్మబలికాడు. ఆ కేసుకు భారీగా ఖర్చవుతుందంటూ నమ్మబలకడంతో కుముదవల్లి ఉన్న పొలం అమ్మేసి రూ.3 కోట్లు ముట్టజెప్పింది. అంతే... మరునాటినుంచీ అతడు కనిపిస్తే ఒట్టు... అటుపైన ఇందిరను మోసగించిన పురుషోత్తమన్... ఆ తర్వాత మరో నాలుగు పెళ్లిళ్లు చేసుకున్నట్టు తేలడంతో అందరూ అవాక్కయ్యారు. ఇక అందరూ కలిసి తమ గోడు వినిపించడంతో కోయంబత్తూరు పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.



పెళ్లిళ్ల బ్యూరో కుమ్మక్కుతో మోసాలు

బాగా డబ్బుండి, విడాకులు తీసుకున్న లేదా రెండోపెళ్లి కోసం చూస్తున్న ఒంటరి మహిళల సమాచారాన్ని ఒక పెళ్లిళ్ల బ్యూరో నిర్వాహకులు ఇతడికి అందజేసేవారు. అనంతరం వారిని మాయమాటలతో మభ్యపెట్టి మూడు ముళ్లు వేసే ఈ మోసగాడు, చల్లగా వారి సొమ్ము కాజేసి కనుమరుగయ్యేవాడు. ఇలా స్వాహా చేసిన సొమ్ములో పెళ్లిళ్ల బ్యూరో నిర్వాహకులకూ బాగా ముట్టజెప్పేవాడు. ఇతడికి గీతాంజలి (18) అనే కూతురు కూడా ఉంది. భార్య ఉషారాణి మరణించాక పెళ్లిళ్ల జాతర ప్రారంభించిన మాయగాడు ఎనిమిదేళ్ల వ్యవధిలో ఉషారాణి, సబిత, విమల (టీచర్), ఇందిరాగాంధీ (లెక్చరర్), కుముదవల్లి, శాంతిని, చిత్ర, సుశీల... వీళ్లందరినీ పెళ్లి చేసుకున్నాడు. పురుషోత్తమన్‌పై కోయంబత్తూరు సిటీ క్రైం బ్రాంచి పోలీసు స్టేషన్‌లో 18కి పైగా ఫిర్యాదులున్నాయని, అతడి కోసం గాలిస్తున్నామని మహిళా స్టేషన్ సీఐ మసుతా బేగమ్ చెప్పారు.




ప్రచారానికి వెళ్తే.. చెప్పుల దండ!

మధ్యప్రదేశ్‌లో ఓ బీజేపీ నేతకు షాక్

నీటి సమస్యను ఎలుగెత్తేందుకు దండవేసిన వృద్ధుడు

భోపాల్, జనవరి 8: మధ్యప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారానికి వెళ్లిన ఓ బీజేపీ నేతకు ఊహించని షాక్ తగిలింది. తమ ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పేందుకు ఏకంగా చెప్పుల దండ వేసి నిరసన వ్యక్తం చేశాడో వృద్ధుడు. ఊహించని పరిణామంతో సదరు బీజేపీ ఒక్కసారిగా అవాక్కయ్యారు. మధ్యప్రదేశ్‌లో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో థామ్‌నోడ్ అనే ప్రాంతంలో దినేశ్ శర్మ అనే బీజేపీ నేత ప్రచారానికి వెళ్లారు. ప్రతి ఇంటికి ఓట్లు అడిగేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఓ వ్యక్తి చెప్పులతో దండను తీసుకొచ్చి వేయబోయాడు. దీంతో ఆయన వాటిని పక్కకు పడేసేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఆ వ్యక్తి అంతే తన ప్రయత్నాన్ని కొనసాగించడంతో ఇక తప్పదని చెప్పుల దండ వేయించుకున్నాడు. అనంతరం ఆ దండ వేసిన వ్యక్తి మాట్లాడుతూ తమ ప్రాంతంలో నీటి సమస్య అధికంగా ఉందని, ఈ విషయంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఆ విషయాన్ని అందరికీ తెలియజేసేందుకే తాను ఇలా చేశానని అన్నారు. ఇక దండ వేయించుకున్న బీజేపీ నేత దినేశ్ మాత్రం ఆ చర్యపట్ల తనకు ఎలాంటి కోపం లేదని అన్నారు. అయితే, ఈ సమస్యపై తాము మాట్లాడబోతున్నామని చెప్పారు. అది వారి కోపం మాత్రమేనని, తనునుంచి వారు ఏదో కోరుకుంటున్నారని, అందుకే తమ అసంతృప్తిని అలా వ్యక్తం చేశారని అన్నారు. తానెప్పుడూ వారి బిడ్డనేనని, వారి అవసరాలు తీర్చేందుకు మరింత బాగా పనిచేస్తానని అన్నారు.



రీసెర్చ్ విద్యార్థి.. హిజ్బుల్‌లో చేరాడు!

- ఏకే 47తో కనిపించిన అలీగఢ్ వర్సిటీ విద్యార్థి

న్యూఢిల్లీ, జనవరి 8: ప్రఖ్యాత అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో అతనో రీసెర్చ్ స్కాలర్. మంచి ప్రతిభ ఉన్న విద్యార్థి కూడా. చేతిలో పుస్తకాలతో కనిపించాల్సిన ఆ వ్యక్తి.. ఒక్కసారిగా ఏకే 47 రైఫిల్‌తో కనిపించాడు. ఆరా తీస్తే అతను ఉగ్రవాద భావజాలానికి ఆకర్షితుడై హిజ్బుల్ ముజాహిదీన్ గ్రూప్‌లో చేరినట్లు తెలిసింది. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో మన్నన్ వనీ అనే యువకుడు జియాలజీ డిపార్ట్‌మెంట్‌లో గత నాలుగైదు ఏళ్లుగా అప్లైడ్ జియాలజీని ప్రత్యేక సబ్జెక్ట్‌గా ఎంచుకొని చదువు కొనసాగిస్తున్నాడు. గత ఏడాది ఉత్తర కశ్మీర్‌లోని తన సొంత పట్టణంలో రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ పద్ధతులు ఉపయోగించి వరద ప్రమాద అంచనాపై అతను చేసిన పరిశోధనలకు ప్రశంసలు లభించాయి. 2016లో భోపాల్‌లో జరిగిన ఓ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ అతను ఇచ్చిన ప్రదర్శనకు మొదటి బహుమతి కూడా లభించింది.అయితే మన్నన్ ఇటీవల ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి యూనివర్సిటీకి తిరిగిరాలేదు. ఇంతలో అతని ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చింది. అందులో ఏకే 47 రైఫిల్ ధరించి ఉన్నాడు. హిజ్బుల్ ముజాహిదీన్ గ్రూప్‌లో చేరినట్లు పేర్కొన్నాడు.

ఒకే కార్డుతో మెట్రో, బస్సు ప్రయాణం

- ఢిల్లీ ప్రభుత్వ సరికొత్త నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 8: అరవింద్ కేజ్రీవాల్ సర్కారు ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చింది. ఒకే యాక్సిక్ కార్డుతో మెట్రో రైలు, ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించే సదుపాయాన్ని ఢిల్లీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కొత్త విధానాన్ని సీఎం కేజ్రీవాల్ సోమవారం ప్రారంభించారు. అనంతరం తన మెట్రో కార్డుతో ఢిల్లీ ప్రభుత్వ బస్సులో ఆయన ప్రయాణించారు. ప్రాథమికంగా ఢిల్లీలోని 250 బస్సులకు ఈ వసతిని వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి పూర్తిస్థాయిలో ఈ సరికొత్త విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ప్రజా రవాణా వ్యవస్థలో కేజ్రీ సర్కారు తెచ్చిన ఈ విధానంపై ప్రశంసల వర్షం కురుస్తోంది.

'గోల్డెన్ గ్లోబ్'లో భారతీయుడు



భారత సంతతి టీవీ నటుడికి తొలిసారి అవార్డు

- మ్యూజికల్/కామెడీ కేటగిరీలో అన్సారీకి పురస్కారం

లాస్ ఏంజిలెస్, జనవరి 8: భారత సంతతి నటుడికి తొలిసారి గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కింది. టీవీ సిరీస్‌లో ఉత్తమ నటుడి అవార్డును 34 ఏళ్ల అజీజ్ అన్సారీ గెలుచుకున్నాడు. 'ద మాస్టర్ ఆఫ్ నన్' అనే కామెడీ సిరీస్‌లో అజీజ్ అన్సారీ నటించాడు. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ ప్రసారమవుతోంది. 2016లోనూ ఇదే సిరీస్ కోసం అన్సారీ నామినేట్ అయ్యాడు. కానీ ఈసారి అవార్డును అన్సారీ గెలుచుకోవడం విశేషం. కామిటీ క్యాటగిరీలో గోల్డెన్ గ్లోబ్ గెలుచుకున్న మొదటి ఆసియా నటుడు కూడా ఇతనే. ఆంథోనీ అండర్సన్, కెవిన్ బీకన్, విలియమ్ మాకీ, ఎరిక్ మెక్‌కార్మాక్ నుంచి అన్సారీ గట్టి పోటీ ఎదుర్కొన్నాడు. ఈ సందర్భంగా అజీజ్ అన్సారీ మాట్లాడుతూ.. గోల్డెన్ గ్లోబ్ అవార్డును గెలుచుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ''నాకు అవార్డు రాదని అనేక వెబ్‌సైట్లు పేర్కొన్నాయి. దాంతో అవార్డు వస్తుందని నేను ఏమాత్రం ఊహించలేదు. కానీ.. ఆశ్చర్యకరంగా నాకు ఈ అవార్డు వచ్చింది. ఒకవేళ నాకు ఈ అవార్డు రాకపోయిఉంటే సిగ్గుతో బాధపడేవాడిని. రెండుసారి కూడా నామినేట్ అయ్యి అవార్డు రాకుంటే ఎలా ఉంటుందో ఆలోచించండి. ఏమైనా చాలా ఆనందంగా ఉంది'' అని అన్సారీ పేర్కొన్నారు.




'త్రీ బిల్‌బోర్డ్స్'కు మూడు నాలుగు అవార్డులు

ఈ ఏడాది 'గోల్డెన్ గ్లోబ్ అవార్డుల్లో 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' హవా కొనసాగింది. ఉత్తమ కథనం, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటుడు అవార్డులు ఈ సిరీస్‌కు వచ్చాయి. ఫిల్మ్, టీవీ కేటగిరీల్లో 'గోల్డెన్ గ్లోబ్ అవార్డులను ప్రధానం చేస్తారు.

గోల్డెన్ గ్లోబ్ విజేతలు వీళ్లే..

- బెస్ట్ డ్రామా : త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిసోరీ
- బెస్ట్ కామిడీ-మ్యూజికల్ : లేడీ బర్డ్
- బెస్ట్ యాక్టర్, డ్రామా : గ్యారీ ఓల్డ్ మ్యాన్, డార్కెస్ట్ అవర్
- బెస్ట్ యాక్ట్రెస్: ఫ్రాన్‌సెస్ మెక్‌డార్మెండ్, త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్
- బెస్ట్ యాక్టర్, కామిడీ-మ్యూజికల్ : జేమ్స్ ఫ్రాంకో, ద డిజాస్టర్ ఆర్టిస్ట్
- బెస్ట్ యాక్ట్రెస్, కామిడీ-మ్యూజికల్ : సైర్సీ రోనన్, లేడీ బర్డ్
- బెస్ట్ డైరక్టర్ : గులెర్మో డెల్ టోరో, ద షేప్ ఆఫ్ వాటర్
- బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ : శ్యామ్ రాక్‌వెల్, త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిసోరీ
- బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్: అలిజన్ జెన్నీ ఐ, టోన్యా
- బెస్ట్ యానిమేటెడ్ ఫిల్మ్ : కోకో
- బెస్ట్ ఫారిన్ ఫిల్మ్ : ఇన్ ద ఫేడ్, జర్మనీ-ఫ్రాన్స్
- బెస్ట్ ఒరిజినల్ సాంగ్ : దిస్ ఈజ్ మి, ద గ్రేటెస్ట్ షోమాన్
- బెస్ట్ టీవీ డ్రామా సిరీస్ : ద హ్యాండ్స్‌మేడ్ టెయిల్
- బెస్ట్ టీవీ కామిడీ : ద మార్వెలెస్ మిసెస్ మేజల్
- బెస్ట్ యాక్టర్, టీవీ డ్రామా : స్టెర్లింగ్ కే బ్రౌన్, దిస్ ఈజ్ అస్
- బెస్ట్ యాక్ట్రెస్, టీవీ డ్రామా : ఎలిజబెత్ మోస్, ద హ్యాండ్‌మెయిడ్స్ టేల్
- బెస్ట్ మ్యూజికల్/కామెడీ : అజీజ్ అన్సారీ, మాస్టర్ ఆఫ్ నన్
- బెస్ట్ యాక్ట్రెస్ టీవీ కామిడీ : రేచల్ బ్రోస్నన్, ద మార్వెలెస్ మిస్సెస్ మేజల్
- బెస్ట్ టీవీ మూవీ, లిమిటెడ్ సిరీస్: బిగ్ లిటిల్ లైస్, హెచ్‌బీవో


'అజ్ఞాతవాసి'లో పవన్‌కల్యాణ్

మరోసారి డాన్‌గా..


• నాగార్జున

రాఘవ లారెన్స్ దర్శకత్వంలో వచ్చిన 'డాన్' చిత్రంలో డాన్‌గా నటించి అందర్నీ మెప్పించారు నాగార్జున. ఆ తర్వాత వచ్చిన 'భాయ్' చిత్రంలో కూడా నాగార్జున డాన్‌గా కనిపించారు. అయితే ఆ సినిమా విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు మూడోసారి నాగార్జున డాన్‌గా నటించబోతున్నారని వార్తలు వస్తున్నాయి. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నాగార్జున, నాని కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రంలో నాగార్జున డాన్ గెటప్‌లో కనిపిస్తారని, నాని సైకియాట్రిస్ట్ పాత్ర చేస్తున్నారని సమాచారం. వైజయంతి మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. త్వరలోనే ఈ మల్టీస్టారర్‌కి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా ప్రకటిస్తారు. ప్రస్తుతం రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం షూటింగ్‌లో నాగార్జున బిజీగా ఉన్నారు.

'నా నువ్వే' అంటున్న కళ్యాణ్‌రామ్


• తమన్నా, కళ్యాణ్‌రామ్


జయేంద్ర దర్శకత్వంలో కళ్యాణ్‌రామ్ ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం టైటిల్‌తో పాటు ఫస్ట్ గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ చిత్రానికి 'నా నువ్వే' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయగా.. గ్లింప్స్‌లో ''ప్రేమిక మనస్సుపై స్వారీ చేసేయ్ ప్రేమిక'' అంటూ సాగే గీతం కొత్తగా ఉంది. తమన్నా, కళ్యాణ్‌రామ్‌ల జోడీ కూడా ఆకట్టుకుంటోంది. చూస్తుంటే మైమరిపించే ప్రేమకథతో ఈ చిత్రం ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి శరత్ సంగీతాన్ని సమకూరుస్తుండగా.. జాతీయ అవార్డు గ్రహీత పీసీ శ్రీరామ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. వేసవి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

లెక్కలు తేలాలి

'ఎవ్వడు పడితే వాడు రావడానికి ... ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమన్నా పశువుల దొడ్డా...భాగమతి అడ్డా.... లెక్కలు తేలాలి... ఒక్కడ్ని పోనివ్వను....' అంటూ భాగమతి అనుష్క డైలాగ్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. అనుష్క టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'భాగమతి'. యు.వి.క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రాన్ని జనవరి 26న విడుదల చేస్తున్నారు. వంశీ, ప్రమోద్ నిర్మాతలు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''బాహుబలి' చిత్రం తర్వాత అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. ఈ చిత్రాన్ని మా బ్యానర్‌లో చేయడం ఆనందంగా ఉంది. ట్రైలర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. కథకు తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మది సినిమాటోగ్రఫీ, తమన్ అందించిన పాటలు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాకు ఎసెట్ అవుతాయి. గణతంత్ర దినోత్సవ కానుకగా జనవరి 26న అత్యధిక థియేటర్లలో 'భాగమతి' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం'' అని అన్నారు.


• అనుష్క

నటుడు శ్రీవల్లభ వ్యాస్ కన్నుమూత



లగాన్, సర్‌ఫరోశ్, అభయ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, విరాసత్, సంకట్ సిటీ సహా 60 చిత్రాల్లో వివిధ పాత్రలు పోషించిన శ్రీవల్లభ వ్యాస్ ఆదివారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో కన్ను మూశారు. ఆయన వయసు 60 సంవత్సరాలు. 2008లో ఓ సినిమా షూటింగ్‌లో ఉండగా ఆయనకు పక్షవాతం వచ్చింది. 2013లో ఆయనను జైసల్మేర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వైద్యానికి అయ్యే ఖర్చులు భరించే పరిస్థితి లేకపోవడంతో జైపూర్‌కి తరలించారు. చిత్ర పరిశ్రమకు సంబంధించిన అసోషియేషన్‌గానీ, టెలివిజన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌గానీ వ్యాస్‌కి ఆర్థిక సహాయం అందించలేదు. మనోజ్ బాజ్‌పాయ్, ఆమిర్ ఖాన్, ఇర్ఫాన్ ఖాన్ వంటి నటులు తమను ఆదుకున్నారని వ్యాస్ భార్య శోభ తెలిపారు.

మిలియనీర్‌గా..


• లావణ్య త్రిపాఠి

వి.వి.వినాయక్ దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా 'ఇంటెలిజెంట్' పేరుతో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటిస్తోంది. అటు వినయ్‌తోనూ.. ఇటు సాయిధరమ్‌తోనూ లావణ్య చేస్తున్న తొలి చిత్రమిదే కావడం గమనార్హం. కాగా, ఈ చిత్రంలో ఓ మిలియనీర్‌కి కూతురిగా.. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డ అమ్మాయిగా కనిపించబోతోంది లావణ్య. వరుసగా నాలుగు పరాజయాలతో రేసులో వెనకబడ్డ లావణ్యకి ఈ చిత్రమైనా విజయం అందిస్తుందేమో చూడాలి. ఫిబ్రవరి 9న ఈ సినిమా తెరపైకి రానుంది.

హెబ్బా కొత్త చిత్రం

'అలా ఎలా'తో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ హెబ్బా పటేల్. తర్వాత తెలుగులో 'కుమారి 21 ఎఫ్', 'ఈడోరకం ఆడోరకం', 'ఎక్కడికిపోతావు చిన్నవాడా' చిత్రాలో వరుస వియాలను సొంతం చేసుకుంది. ఆ తర్వాత హెబ్బాకు ఆశించిన మేర విజయాలు దక్కలేదు. గతేడాది హెబ్బా పటేల్ నటించిన 'ఏంజెల్' సినిమా కూడా ఆమెను నిరాశకు గురి చేసింది. ఇప్పుడు హెబ్బా చేతిలో అవకాశాలు పెద్దగా లేవు. అయితే రీసెంట్‌గా ఓ తెలుగు సినిమా కోసం హెబ్బా సంతకం చేసిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. 'మిణుగురులు' తెరకెక్కించిన దర్శకుడు అయోధ్య కుమార్ ఈ సినిమాను తెరకెక్కిస్తారు. 'ఇంద్ర' చిత్రంలో బాల చిరంజీవిగా నటించిన తేజ సజ్జ ఇందులో హీరోగా నటించనున్నారు.





లవర్స్‌కు మంచి ట్రీట్

రామ్ ఎంటర్‌టైనర్స్ పతాకంపై తరుణ్, ఓవియా హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం 'ఇది నా లవ్‌స్టోరీ'. రమేష్ గోపీ దర్శకులు. ఎస్.వి.ప్రకాష్ నిర్మాత. హీరో తరుణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో విడుదల చేశారు. చిత్ర నిర్మాత ఎస్.వి.ప్రకాష్ మాట్లాడుతూ ''సినిమా చాలా బాగా వచ్చింది. ఫిబ్రవరి 14న విడుదల చేస్తున్నాం'' అన్నారు. డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ ''మనసున్న మనుషులందరికీ ఫిబ్రవరి 14న విడుదలయ్యే ఈ సినిమా తప్పకుండా నచ్చుతుంది. తరుణ్ గత హిట్ చిత్రాలు 'నువ్వే కావాలి', 'నువ్వే నువ్వే' కంటే ఈ సిని మా పెద్ద హిట్ అవుతుంది. తెలుగు సినిమాల్లో ఇదొక డిఫరెంట్ లవ్‌స్టోరీ. లవర్స్‌కు మంచి ట్రీట్ అవుతుందని గర్వంగా చెప్పగలను'' అన్నారు. దర్శకుడు గోపి మాట్లాడుతూ '''అంజలి', 'నువ్వేకావాలి' చిత్రాల కంటే ఈ సినిమా తరుణ్‌కి పెద్ద హిట్‌గా నిలుస్తుంది. సినిమాను చూసే ప్రేక్షకుడు ఇది నా లవ్‌స్టోరీ అని తప్పకుండా ఫీల్ అవుతాడు'' అన్నారు. హీరో తరుణ్ మాట్లాడుతూ ''ఇది రెగ్యులర్ ప్రేమకథ కాదు. ఇందులో మూడు గెటప్స్‌లో నేను కనపడి ఉంటాను. మరి ఇందులో ట్రిపుల్ రోల్ చేశానా? లేదా మూడు షేడ్స్ ఉన్న పాత్ర చేశానా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. డైలాగ్స్, స్క్రీన్‌ప్లే, సినిమాటోగ్రఫీ, మంచి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇలా అన్ని చక్కగా అమరాయి. హీరోయిన్ ఓవియా చాలా చక్కగా నటించింది'' అన్నారు.

జీవితంలో అది ఓ భాగం మాత్రమే


• కత్రినా కైఫ్

ఈమధ్య వరస ఫ్లాపులతో వెనకబడ్డ కత్రినా కైఫ్ 'టైగర్ జిందా హై' ఘనవిజయం సాధించడంతో ఊపిరి పీల్చుకుంది. 'బార్ బార్ దేఖో', 'జగ్గా జాసూస్' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో కలత చెందింది కైఫ్. సల్మాన్ ఖాన్, కైఫ్ జంటగా నటించిన 'టైగర్ జిందా హై' వారం రోజుల్లోనే 300 కోట్ల రూపాయలు వసూలు చేసింది. ఈ సినిమా విజయంతో ఉత్సాహంగా ఉన్న కత్రినా తన వ్యక్తిగత విషయాల గురించి తెలియజేస్తూ ''ప్రతి అమ్మాయి జీవితంలో పెళ్లి చేసుకోవాల్సిన సమయం, పిల్లల్ని కనాల్సిన సమయం వస్తుంది. కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కెరీర్ పరంగా వెనకపడిపోతాం. ప్రస్తుతం నాకు పెళ్ళయిపోయిందనే భావిస్తున్నాను. ఎందుకంటే సినిమాలే నా జీవితం. పెళ్ళి అనేది జీవితంలో ఓ భాగం మాత్రమే. మన జీవితంలోకి వచ్చే వ్యక్తి కోసం మనల్ని మనం కోల్పోకూడదు అనేది నా అభిప్రాయం'' అన్నారు.

కర్ణుడి పాత్రలో..


• విక్రమ్

తన విలక్షణ నటనతో కోలీవుడ్‌లోనే కాదు.. టాలీవుడ్, బాలీవుడ్‌లో కూడా అభిమానులను సంపాదించుకున్నారు నటుల్లో విక్రమ్ ఒకరు. రావణ్ తర్వాత విక్రమ్ మరోసారి బాలీవుడ్ సినిమాలో నటించబోతున్నారు. న్యూయార్క్‌కు చెందిన యునైటెడ్ ఫిలిమ్స్ కింగ్‌డమ్ నిర్మించతలబెట్టిన 'మహావీర్ కర్ణ' సినిమాలో టైటిల్ పాత్రలో విక్రమ్ కనిపించనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా విక్రమ్ ప్రకటించారు. ఈ మూవీకి ఆర్.ఎస్.విమల్ దర్శకత్వం వహించనున్నారు. ఇంతవరకు సౌత్ ఇండియన్ నటుల్లో అతి కొద్ది మంది మాత్రమే బాలీవుడ్‌లో స్థానం సంపాదించుకోగలిగారు. ఇప్పుడు ఈ సినిమాతో విక్రమ్ కూడా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటారని అభిమానులు ఆశిస్తున్నారు. కాగా, ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెలువడనున్నాయి. ప్రస్తుతం విక్రమ్ 'స్కెచ్', 'ధృవ నక్షత్రం', 'సామి స్క్వేర్' చిత్రాలు చేస్తున్నారు. ఇవన్నీ ఈ సంవత్సరంలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

‘మనం’ ప్రజాదరణ పొందాలి

- క్యాలెండర్ ఆవిష్కరించిన కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు

విజయనగరం, జనవరి 8 (మనం న్యూస్ బ్యూరో): మనం దినపత్రిక ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాలని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. సోమవారం విజయనగరంలో ‘మనం’ పత్రిక రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల ఆదరణ పొందాలని, పత్రికా రంగంలో ఉన్నతంగా ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం రాత్రి ఆయన విజయనగరం వచ్చారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ మనం ప్రతినిధి బృందం ఆహ్వానం మేరకు ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనం ప్రతినిధి సిహెచ్ సింహాద్రి (జయరాజ్), పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



జనం కళ్లలో ఆనందం చూస్తా..



హార్టికల్చర్‌పై రైతులు దృష్టి సారించాలి
సహజ వనరులు సద్వినియోగం చేసుకోవాలి
జన్మభూమి-మా ఊరు సభలో చంద్రబాబు

కొవ్వూరు/అమరావతి, జనవరి 8 (మనం ప్రతినిధి): గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించి ప్రజల కళ్లల్లో ఆనందాన్ని చూడడమే జన్మభూమి-మా ఊరు కార్యక్రమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. తాళ్లపూడిలో సోమవారం జరిగిన జన్మభూమి-మా ఊరు సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి అంశంపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు జరిగినప్పటి నుంచి నిధుల కొరత సమస్య ఉన్నప్పటికీ ప్రజాసంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చంద్రబాబు అన్నారు. రైతులకు రుణ విముక్తి కల్పించిన రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే అని చెప్పారు. గత మూడున్నరేళ్లలో వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. జన్మభూమి కమిటీ సభ్యులు సమన్వయంతో సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సహజ వనరుల సద్వినియోగంపై చర్చలు జరగాలన్నారు. ఏరువాక కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. జలసిరి, వనమహోత్సవం కార్యక్రమ ఉద్దేశాలను వివరించారు. సూర్యరశ్మిని సద్వినియోగం చేసుకుని, వ్యవసాయ అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రైతులు హార్టికల్చర్, వాణిజ్యపంటలపై దృష్టి సారించాలన్నారు. డెయిరీ, పౌల్ట్రీ, గొర్రెలు పెంపకం లాభసాటిగా మారాయన్నారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. ఈ సభకు హాజరైన పలువురు ఎన్ఆర్ఐలు మాట్లాడుతూ వివిధ దేశాల పారిశ్రామికవేత్తలను కలిసి రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్న చంద్రబాబు, నవ్యాంధ్ర ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చారని కొనియాడారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించిన ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కొత్తపల్లి శామ్యూల్ జవహర్, పితాని సత్యనారాయణ, రాజమండ్రి ఎంపీ మురళీమోహన్, రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, మాగంటి బాబు, జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం అడ్డుకునే వారికి తగిన బుద్ధి చెప్పండి

ఏలూరు, జనవరి 8 (మనం న్యూస్ బ్యూరో): పోలవరం ప్రాజెక్టు పూర్తికాకుండా అడ్డుపడుతున్న శక్తులకు ప్రజలు బుద్ధి చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. పోలవరం ప్రాజెక్టు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం స్పిల్‌వే వద్ద విలేకరులతో మాట్లాడారు. నవ్యాంధ్రను కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. 22వ సారి తాను పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిశీలనకు వచ్చానని, నిర్ణీత సమయానికి ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. ర్యాక్ ఫిల్ ఢ్యామ్ 4.9 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయ్యిందని మిగిలిన 2.3 కిలోమీటర్లు పనులు పూర్తిచేస్తామని, కాంక్రీట్ వాల్ పని 4.79 లక్షల క్యూబిక్ మీటర్ల పని జరిగిందని, యుద్ధప్రాతిపదికపై 42 గేట్ల నిర్మాణ పనులు కూడా పూర్తి చేసి 4 వేల టన్నులు బరువు ఉన్న గేట్లను అమర్చుతామన్నారు. గోదావరితోపాటు పెన్నా, కృష్ణా, నాగవళి, వంశధార నదులను కూడా అనుసంధానం చేసి ఐదు దశల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకూ ఈ నదుల అనుసంధానం ఒక మహాసంగమానికి నిదర్శమన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటివరకూ రూ.16వేల కోట్లు ఖర్చు చేశామని, ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామన్నారు. మరిన్ని నిధులు రాబట్టేందుకు చర్చలు చేస్తున్నామన్నారు. కొంతమంది చేసిన రాజకీయాల వల్లే పనులకు ఆటంకం ఏర్పడిందన్నారు. ఏడు మండలాలను పోలవరం పరిధిలోకి తీసుకువచ్చి ప్రాజెక్టు పనులు చురుగ్గా చేపడుతున్నామనానరు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట రాష్ట్రమంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పితాని సత్యనారాయణ, ఇరిగేషన్ సెక్రటరీ శశిభూషణ్, ఎంపీలు తోట సీతారామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, సమాజంలో సమూల మార్పును తీసుకువచ్చే మహా యజ్ఞంలా జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జన్మభూమి-మా ఊరు, నీరు ప్రగతి కార్యక్రమాలపై సోమవారం తన నివాసం నుంచి సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లు, అధికారులతో మాట్లాడారు. ఏడు రోజుల పాటు జన్మభూమి గ్రామ సభలు ఉత్సాహంగా జరిగాయని, మిగిలిన మూడు రోజులు అదే స్ఫూర్తిని కొనసాగించి విజయవంతం చేయాలని కోరారు. మూడో విడత రుణమాఫీ రైతులకు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు.

సమాజంలో సమూల మార్పు తెచ్చే మహాయజ్ఞంలా జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. జన్మభూమి-మా ఊరు, నీరు ప్రగతి కార్యక్రమాలపై సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లు, అధికారులతో మాట్లాడారు. 7రోజుల పాటు జన్మభూమి గ్రామ సభలు ఉత్సాహంగా జరిగాయని, మిగిలిన

పవిత్ర యజ్ఞంగా ‘జన్మభూమి’

మూడు రోజులు అదే స్ఫూర్తిని కొనసాగించి విజయవంతం చేయాలని కోరారు. రబీ సీజన్‌కు సంబంధించి పంటరుణాల పంపిణీ 50 శాతం మాత్రమే జరిగిందని, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరంలో పంటరుణాల పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశించారు. డిమాండ్ ఆధారంగా రాష్ట్రంలో పంటలను సాగు చేయాలని, అంతర్జాతీయ స్థాయిలో ఉత్పాదకత సాధించాలన్నారు. పండుగ దృష్ట్యా నిత్యావసరాల ధరలకు కళ్లెం వేయాలన్నారు.



అమరావతి నిర్మాణానికి అందరి ఆశీస్సులు కావాలి

- అశ్వమేధ గాయత్రి మహా యజ్ఞంలో సీఎం

గుంటూరు(మంగళగిరి), జనవరి 8 (మనం న్యూస్): నవ్యాంధ్ర నూ తన రాజధాని అమరావతి నిర్మాణానికి అందరి ఆశీస్సులు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మంగళగిరి సమీపంలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రి వద్ద అఖిల భారత గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో జరుగుతున్న అశ్వమేధ గాయత్రి మహా యజ్ఞంలో సోమవారం ఆ యన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ యజ్ఞ, యాగాదుల ద్వారా వచ్చే శక్తి రాష్ట్రానికి మేలు చేస్తుందన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉందన్నారు. జల వనరుల సంరక్షణ కోసం జలసిరి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో సూర్య ఆరాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. నూతన రాజధాని అమరావతిలో గాయత్రి పరివార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తే స్థలం కేటాయిస్తామన్నారు.

త్వరలో తిరుపతిలో టైమ్‌స్లాట్ కౌంటర్లు

- టీటీడీ ఈవో అనిల్ సింఘాల్

తిరుపతి, జనవరి 8 (మనం న్యూస్ బ్యూరో): శ్రీవారి భక్తులకు పూర్తి స్థాయిలో టైమ్‌స్లాట్ దర్శనం అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. ఇందు కోసం త్వరలోనే తిరుపతిలో ఈ టైమ్ స్లాట్ టోకెన్ కేటాయింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. సోమవారం తిరుపతిలో టీటీడీ సీనియర్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 18 నుంచి 23 వరకు అమలు చేసిన టైమ్ స్లాట్ దర్శనం విజయవంతమైందని, దీన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. తిరుపతిలో ఎక్కువగా భక్తుల రద్దీ ఉండే రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు, అలిపిరి తదితర ప్రాంతాల్లో ఈ టోకెన్లు జారీ చేసే కౌంటర్లను అధిక సంఖ్యలో ఈవో అనిల్ కుమార్ దిశానిర్దేశం చేశారు. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో వివిధ భాషల్లో విరివిగా మార్గ సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు.

హెరిటేజ్ కోసం చిత్తూరు డెయిరీ మూత

- స్వలాభం కోసం రైతులకు అన్యాయం
- చంద్రబాబు సీఎం అయిన ప్రతిసారి ‘సహకార’ ఫ్యాక్టరీలకు తాళం
- పాదయాత్రలో వైఎస్ జగన్

చిత్తూరు, జనవరి 8: తన స్వలాభం కోసం సీఎం చంద్రబాబు రైతుల పొట్టగొడుతున్నారని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. తన హెరిటేజ్ డెయిరీ అభివృద్ధి కోసం చిత్తూరు సహకార డెయిరీని మూతపడేలా చేశారని ధ్వజమెత్తారు. బాబు సీఎం అయిన ప్రతిసారి సహకార ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయని అన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా 56వ రోజు జగన్ చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్నారు. మొరవపాటూరు, కొండారెడ్డిపల్లి క్రాస్, తలుపులపల్లి, తిమ్మిరెడ్డిపల్లి, తోటలోపు, టీ రంగంపేట, పూతలపట్టు మీదుగా సాగిన పాదయాత్రను అనంతాపురంలో ముగించారు. ఈ సందర్భంగా పూతలపట్టులో మధ్యాహ్నం బహిరంగ సభను నిర్వహించారు. ఇక్కడ జగన్ ప్రసంగిస్తూ.. చంద్రబాబు సీఎం అయిన ప్రతిసారి సహకారం రంగంలోని ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయన్నారు. చిత్తూరు జిల్లాలో ఆరు చక్కెర ఫ్యాక్టరీలు ఉండగా.. చిత్తూరు, రేణిగుంట ఫ్యాక్టరీలు సహకార రంగంలో ఉన్నాయని, మిగిలినవి ప్రైవేటు రంగానికి చెందినవని అన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక సహకార రంగంలో ఉన్న రెండు ఫ్యాక్టరీల మూతపడ్డాయని అన్నారు. రైతులకు మద్దతు ధర కల్పిస్తూ లాభాల్లో నడవాల్సిన సహకార ఫ్యాక్టరీలు సీఎం చంద్రబాబు హయాంలోనే మూతపడడం దారుణమన్నారు. ప్రైవేటు కంపెనీలతో పోటీగా వాటిని నడిపించాల్సింది పోయి.. తన సొంత జిల్లా రైతులకే ఆయన అన్యాయం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. గతంలోనూ చంద్రబాబు సీఎంగా ఉండగా ఈ రెండు చక్కర ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ తన హయాంలో సహకార రంగంలోని చక్కెర ఫ్యాక్టరీలకు బకాయిలు చెల్లించి మళ్లీ తెరిపించారని చెప్పారు. ఆ ఫ్యాక్టరీలు పదేళ్లు నడిచాయని, రైతులకు లబ్ధి చేకూరిందని అన్నారు. కానీ చంద్రబాబు సీఎం కాగానే రెండు చక్కెర ఫ్యాక్టరీలు మూతపడడం బాధాకరమన్నారు. సీఎం చంద్రబాబు రైతులకు తోడు ఉండాల్సిందిపోయి.. తన హెరిటేజ్ డెయిరీ లాభాల కోసం చిత్తూరు డెయిరీని ఓ ప్రణాళిక ప్రకారం మూతపడేలా చేశారని వైఎస్ జగన్ ఆరోపించారు. చిత్తూరు డెయిరీ పాలకమండలిలో తనకు కావాల్సిన వ్యక్తులు నియమించుకొని.. ఒక పద్ధతి ప్రకారం రైతులకు పేమెంట్లు ఆపేసి.. రైతులు హెరిటేజ్‌కు పాలు పోసేలా చేశారన్నారు. నాలుగేళ్ల పాలనలో ఒక్క హామీ కూడా నెరవేర్చని చంద్రబాబు ఇప్పుడు ప్రజలను ఓట్లు అడగడం హాస్యాస్పదమన్నారు.



వైసీపీలో చేరిన కుంభా రవిబాబు

విశాఖ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే కుంభా రవిబాబు సోమవారం వైసీపీలో చేరారు. తన అనుచరులతో కలిసి వచ్చి చిత్తూరు జిల్లా పూతలపట్టులో పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ నాయకత్వాన్ని సమర్థించేందుకే తాను వైసీపీలో చేరానని ఈ సందర్భంగా రవిబాబు చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో తీవ్రమైన వైఫల్యాలను ఎదుర్కొంటుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో చెప్పిన ఏ ఒక్క హామీని కూడా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. సమర్థవంతమైన పాలన అందింగత సత్తా జగన్‌కు ఉందన్న నమ్మకంతోనే వైసీపీలో చేరుతున్నామన్నారు.

అంబటి రాంబాబు హౌస్ అరెస్ట్

- పింఛన్లపై చర్చకు సత్తెనపల్లి పయనం
- వెళ్లకముందే రాంబాబు గృహనిర్బంధం
- ఇలా చేస్తే సవాలెందుకు చేశారు
- వైసీపీ అధికార ప్రతినిధి అంబటి

గుంటూరు, జనవరి 8: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అంబటి రాంబాబును సోమవారం ఉదయం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వృద్ధాప్య పింఛన్ల విషయంలో జన్మభూమి కమిటీలు చేస్తున్న అక్రమాలను బయటపెట్టేందుకు సిద్ధమైన ఆయనను పోలీసులు ముందుగానే అడ్డుకున్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో పింఛన్ల జారీలో అక్రమాలపై టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న విసిరిన సవాలును స్వీకరించిన అంబటి.. చర్చకోసం బయలుదేరగా అందుకు అనుమతి లేదంటూ పోలీసులు ఆయనను గృహనిర్బంధం చేశారు. ఇందుకోసం నగరంలో భారీ ఎత్తున పోలీసులను మోహరింపజేశారు.

దమ్ముంటే చర్చకు రండి

‘‘పింఛన్ల పంపిణీలో అక్రమాల విషయమై ఓ టీవీ చర్చా కార్యక్రమంలో నేను చేసిన ఆరోపణలు తప్పని టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. ఈ విషయంలో ఎలాంటి చర్చకైనా సిద్ధమని సవాలు విసిరారు. నేను కూడా సిద్ధమేనని చెప్పాను. సోమవారం ఉదయం 10 గంటలకు సత్తెనపల్లి సెంటర్‌లో చర్చ జరగాలి. కానీ నన్ను అక్కడికి వెళ్లనీయకుండా టీడీపీ ప్రభుత్వమే అడ్డుకుంది. గృహనిర్బంధం చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. పోలీసులను పురమాయించి అరెస్టులు చేయించేవాళ్లు సవాలెందుకు చేసినట్లు? ఇప్పటికైనా దమ్ముంటే చర్చకు రావాలి’’ అని రాంబాబు అన్నారు.



సత్తెనపల్లిలో ఉద్రిక్తత

టీడీపీ నాయకులతో చర్చ కోసం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కొందరు సత్తెనపల్లికి చేరుకున్నారు. అంతలోనే అంబటి హౌస్ అరెస్టు వార్త తెలిసి.. అక్కడికక్కడే నిరసనలకు సిద్ధమయ్యారు. కానీ పోలీసులు వారిని అక్కడినుంచి పంపేశారు. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.

పోలీసు అధికారులకు రూ. 14 లక్షల జరిమానా

తిరుపతి, జనవరి 8 (మనం న్యూస్ బ్యూరో): భూవివాదంలో తలదూర్చిన నలుగురు పోలీసులకు రూ.14 లక్షలు జరిమానా విధిస్తూ తిరుపతి కోర్టు సంచలన తీర్పు చెప్పింది. తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీ వోటేరు గ్రామంలోని సర్వే నంబరు 377లోని భూమిపై న్యాయవాది కృష్ణప్రసాద్, ఎక్సైజ్ సిఐ చంద్రశేఖర్‌నాయుడు హక్కు కలిగి ఉన్నారు. ఈ భూమి తమదంటూ 2004లో అక్టోబర్ 2న కొందరు తిరుచానూరు పోలీసులను ఆశ్రయించారు. అప్పట్లో డిఎస్పీలుగా ఉన్న తిమ్మప్ప, బాలమురళి, సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ ఈ వివాదంలో జోక్యం చేసుకున్నారు. కృష్ణప్రసాద్, చంద్రశేఖర్‌నాయుడును బెదిరించడమే కాక వారిపై తప్పుడు కేసులు బనాయించారు. ఈ నలుగురు పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దీంతో కృష్ణప్రసాద్, చంద్రశేఖర్ కోర్టును ఆశ్రయించగా పోలీసులపై సివిల్, క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యాన్ని తీవ్రంగా పరిగణించిన కోర్టు, క్రిమినల్ కేసులో 2009 జూన్ 12న నలుగురికి రెండు నెలల జైలు శిక్ష విధించింది. సివిల్ కేసుకు సంబంధించి సీనియర్ సివిల్ జడ్జి రామచంద్రయ్య నలుగురు పోలీసులు బాధితులకు రూ.7లక్షల చొప్పున మొత్తం రూ.14 లక్షలు చెల్లించాలని సోమవారం తీర్పు చెప్పారు.న

సచివాలయంలో ‘సంక్రాంతి’ విందు!

- పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులకు 4 రోజులు భోజనాలు: ముఖేష్ కుమార్ మీనా

అమరావతి, జనవరి 8 (మనం ప్రతినిధి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సచివాలయ ఉద్యోగులకు నాలుగు రోజుల పాటు ప్రత్యేక తెలుగు వంటకాల విందు అందించనున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ నేతృత్వంలో సచివాలయ ఫలహారశాలలో సంక్రాంతి ఆహార పండుగ జరుపుతున్నామని తెలిపారు. మంగళవారం నుంచి నాలుగు రోజులు భోజనంతో పాటు ఒక ప్రత్యేక వంటకాన్ని పర్యాటక శాఖ తరపున అందిస్తామన్నారు. మంగళవారం రాగిసంగటి, వేరుశెనగ పచ్చడి; బుధవారం దంపుడు బియ్యం పలావ్, కుర్మా; గురువారం మెంతికూర టమాటా అన్నం, కుర్మా; శుక్రవారం బెల్లం పొంగలి, మసాలా వడ అందించబోతున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ అందించే ఈ వంటకాలకు అదనపు చెల్లింపులు అవసరం లేదన్నారు. రాష్ట్రం ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలన్న సీఎం చంద్రబాబు కోరిక మేరకు ఈ తరహా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తెలుగు వంటకాల ప్రాచుర్యానికి సహకరించాలని ముఖేష్ కుమార్ మీనా కోరారు.

ఆ విషయంలో మా జోక్యం ఉండదు

- ప్రేమోన్మాది రిట్‌ను కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, జనవరి 8(మనం లీగల్ ప్రతినిధి): ప్రేమను నిరాకరించందన్న కోపంతో బాలికను హత్య చేసిన వ్యక్తికి కింది కోర్టు విధించిన యావజ్జీవ శిక్ష విషయంలో జోక్యం చేసుకోమని హైకోర్టు స్పష్టం చేసింది. పెద్దపప్పూరు మండలం చాగల్లు గ్రామానికి చెందిన అనిత (16)ను రామప్పగారి సోమశేఖర్ (21) ప్రేమపేరుతో వేధించేవాడు. తన ప్రేమను తిరస్కరించడంతో సోమశేఖర్ 2007లో అనితను కత్తితో పొడిచి హత్య చేశారు. ఈ కేసులో అనంతపురం జిల్లా గుత్తి కోర్టు సోమశేఖర్‌కు జీవిత ఖైదు విధిస్తూ 2011లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సోమశేఖర్ హైకోర్టును ఆశ్రయించాడు. నిందితుడు ఓ పథకం ప్రకారమే హత్యకు పాల్పడ్డాన్న నిర్ధారణకు వచ్చిన న్యాయమూర్తులు చల్లా కోదండరామ్, సునీల్ చౌదరిలతో కూడిన డివిజన్ బెంచ్ సోమశేఖర్ వేసిన రిట్‌ను డిస్మిస్ చేసింది. జీవిత ఖైదును అమలు చేయాల్సిందేనంటూ తీర్పు వెలువరించింది.

కొత్త ఏడాదిలో కూడా బాబు మారలేదు

- ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి: బొత్స



హైదరాబాద్, జనవరి 8: కొత్త ఏడాదిలో కూడా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అబద్ధాలు చెప్పడం ఆపలేదని వైసీపీ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.50 వేల కోట్లు ఖర్చు చేశామంటూ కర్నూలులో చంద్రబాబు చేసిన ప్రకటనలో వాస్తవం లేదన్నారు. రైతు, డ్వాక్రా రుణ మాఫీలకు సంబంధించి చంద్రబాబు చెబుతున్న లెక్కలన్నీ తప్పు అన్నారు. అమరావతిలో ప్రపంచ స్థాయి రాజధాని కడతానంటూ కోట్లు రూపాయలను ఖర్చు చేస్తున్న చంద్రబాబు ప్రజలను మోసగిస్తున్నారన్నారు. అసలు రాజధాని ఎక్కడ ఉందో ప్రజలకు తెలియదన్నారు. ప్రజలకు పెన్షన్లు అందుతున్నాయో లేదో నేరుగా తెలుసుకునేందుకు యత్నించిన అంబటి రాంబాబును హౌస్ అరెస్టు చేయడంపై ఆయన మండిపడ్డారు. పోలవరం నిర్మాణాన్ని వైసీపీ అడ్డుకుంటుందని దుష్ప్రచారం చేస్తున్నారని, అది ఎలాగో నిరూపించాలని సవాల్ చేశారు. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటివరకు ఖర్చు చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాంత్రిక పూజలతో అధికారం నిలబెట్టుకోలేరని చంద్రబాబును ఎద్దేవా చేశారు.


ఓర్వలేకే వైసీపీ కుట్రలు

- మంత్రి అయ్యన్నపాత్రుడు

అమరావతి, జనవరి 8 (మనం ప్రతినిధి): ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి పదవి పిచ్చితోనే పాదయాత్ర చేస్తున్నారని మంత్రి అయ్యన్నపాత్రుడు విమర్శించారు. సీఎం చంద్రబాబు అపర భగీరధుడిలా పనిచేస్తుంటే.. ఓర్వలేని వైసీపీ, కుట్రలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతోందని ఆయన దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు, గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎకరాకు రూ.10 నుంచి రూ.15 లక్షలు చెల్లిస్తుంటే జగన్మోహన్‌రెడ్డి గిరిజనులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాధాన్యత క్రమంలో 28 ప్రాజెక్టులను అత్యంత తక్కువ సమయంలో పూర్తి చేసి తీరుతామని అయ్యన్నపాత్రుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరో రోజు తగ్గిన ‘జన్మభూమి’ వినతులు

- మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్



అమరావతి, జనవరి 8 (మనం ప్రతినిధి): జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో ఆరో రోజు(ఆదివారం) అన్ని జిల్లాలకు ‘సి’ గ్రేడ్ వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ వెల్లడించారు. ఆరో రోజు గ్రేడింగ్‌లో అనంతపురం జిల్లా 29 స్కోర్‌తో ముందుంటే, కడప జిల్లా 18 స్కోర్‌తో అట్టడుగున ఉందన్నారు. ప్రజల హాజరు ఐదో రోజు(6వ తేదీ) కన్నా, ఆరో రోజు 42 శాతం తగ్గిందని, వినతులు 44 శాతం తగ్గాయని వివరించారు. జన్మభూమి కార్యక్రమం ప్రారంభమైన రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు మొత్తం 56,473 గ్రామ సభలు నిర్వహించగా, మొత్తం 6,96,656 వినతులు వచ్చాయన్నారు. మొత్తం 36,18,754 మంది పాల్గొనగా 1,14,098 కొత్త రేషన్ కార్డులు, 64,999 ఫించన్లు మంజూరు చేశామని, 11,060 వైద్యశిబిరాలు నిర్వహించామని పరకాల తెలిపారు.

ప్రజా సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

- తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దినకర్

అమరావతి, జనవరి 8(మనం ప్రతినిధి): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన చేస్తున్నారని, అవినీతికి సర్వాంతార్యమిగా నాడు వైఎస్ఆర్ పాలన సాగిందని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. కృష్ణా జిల్లాలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత్ కిషోర్ లాంటి పెయిడ్ ఆర్టిస్టలతో ప్రభుత్వంపై అసత్య ప్రచారానికి వైసీపీ ఆపసోపాలు పడుతోందని ఆయన దుయ్యబట్టారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో వికలాంగుల ఫించన్ అందుకునే వ్యక్తిని కడప జిల్లా ఇడుపులపాయకు తెప్పించి ఫించన్ అందడం లేదని చెప్పించే ప్రయత్నం చేసిన జగన్ అండ్ కో దొరికిపోయారని మండిపడ్డారు.

ఏపీజేయూ అధ్యక్షునిగా చొప్పరపు

విజయవాడ, జనవరి 8: ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా ఉయ్యూరుకు చెందిన చొప్పరపు సాంబశివనాయుడు, ప్రధాన కార్యదర్శిగా చలాది పూర్ణచంద్రరావు ఎన్నికయ్యారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది వైవీ నాగభూషణరావు ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ ఎలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీజేయూ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



సెన్సెక్స్ | జనవరి 2018 | 8



పెరిగినవి	%	తగ్గినవి	%
కోల్ ఇండియా	3.26	భారతీ ఎయిర్‌టెల్	-4.43
ఇన్ఫోసిస్	2.33	ఓఎన్‌జీసీ	-0.28
సన్ ఫార్మా	2.28	ఎస్‌బిఐ	-0.18
లార్సెన్	1.80	టాటా స్టీల్	-0.18
హీరో మోటార్	1.37	ఆదాని పోర్ట్స్	-0.07

నిఫ్టీ | జనవరి 2018 | 8




పెరిగినవి	%	తగ్గినవి	%
కోల్ ఇండియా	3.12	ఐడియా సెల్యూలర్	-5.83
లుపిన్	2.57	భారతీ ఎయిర్‌టెల్	-4.38
ఇన్ఫోసిస్	2.38	ఓఎన్‌జీసీ	-0.53
సన్ ఫార్మా	2.22	పవర్ గ్రిడ్	-0.35
టెక్ మహీంద్రా	2.06	ఏషియన్ పెయింట్స్	-0.27

టాప్ గైనర్స్ | 8 జనవరి


34,352.79
బి.ఎస్.ఇ సెన్సెక్స్ ▲198.94

పాయింట్లు		%
287.85	కోల్ ఇండియా	3.26%
1035.65	ఇన్ఫోసిస్	2.33%
591.95	సన్ ఫార్మా	2.28%
1338.10	లార్సెన్	1.80%
3790.35	హీరో మోటార్	1.37%
1717.55	ఇండస్‌ఇండ్	1.12%
265.35	ఐటీసీ	0.93%
2707.75	టీసీఎస్	0.87%
1367.00	హెచ్‌యుఎల్	0.77%
1738.90	హెచ్‌డీఎఫ్‌సీ	0.75%

బులియన్| గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



లాభపడిన సూచీలు

రికార్డులు తిరగరాస్తున్న 'సెన్సెక్స్', 'నిఫ్టీ'లు

ముంబయి: 'సెన్సెక్స్', 'నిఫ్టీ'లు వరుసగా రెండవ సెషన్‌లో సోమవారం నాడు కొత్త రికార్డులు నెలకొల్పుతూ గరిష్ఠ స్థాయిల్లో ముగిసాయి. మార్కెట్లలో బడ్జెట్‌కు ముందు కనిపించే సంతోషాతిరేకాలు, కార్పొరేట్ ఫలితాలపై ఆశాభావానిదే పైచేయి అయింది. ఆర్థిక వృద్ధి అంచనాలు తక్కువగా ఉండడంతో ఏర్పడిన వెలితిని అవి భర్తీ చేసేశాయి. ప్రపంచంలో ఇతర స్టాక్ మార్కెట్లు కూడా ఇంచుమించుగా ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయిలను చేరడంతో దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ సెంటిమెంట్ పెంపొందింది. ఈ వారంలో వెలువడనున్న మూడవ త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగానే ఉండగలవనే ఊహాగానాల మధ్య పెట్టుబడి ప్రవాహాలు నిలకడగా కొనసాగడం, రిటైల్ ఇన్వెస్టర్ల కొనుగోళ్ళు విస్తృతంగా సాగడంతో, ఇన్వెస్టర్ సెంటిమెంట్ ఆశావాదంతోనే కొనసాగిందని బ్రోకర్లు తెలిపారు.

బొంబాయి స్టాక్ ఎక్చ్సేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' 198.94 పాయింట్లు లాభపడి 34,352.79 పాయింట్ల వద్ద ముగిసి సరికొత్త రికార్డు నెలకొల్పింది. నేషనల్ స్టాక్ ఎక్చ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' కూడా దానికేమీ తీసిపోనట్లుగా 64.75 పాయింట్లు లాభపడి 10,623.60 పాయింట్ల నూతన శిఖరాన్ని అధిరోహించిన స్థితిలో ముగిసింది. ఇంట్రాడేలో 'సెన్సెక్స్' ఆరోహణను కొనసాగించి ఒక దశలో 34,385.67 పాయింట్లకు చేరుకుంది. అంతకుముందు జనవరి 5న అది ఇంట్రాడేలో 34,188.85 పాయింట్ల స్థాయిని మాత్రమే చూసింది. 'నిఫ్టీ' ఇంట్రాడేలో జనవరి 5 నాటి 10,566.10 పాయింట్ల రికార్డును బద్దలు కొట్టి 10,631.20 పాయింట్ల గరిష్ఠ స్థాయిని చూసింది.



పెరిగిన ఎఫ్.పి.ఐల కొనుగోళ్ళు

తాత్కాలిక డాటా ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 581.43 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేయగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 243.13 కోట్ల విలువైన షేర్లను మాత్రమే కొనుగోలు చేశాయి. కాగా, ఆసియాలో ఇతర స్టాక్ మార్కెట్లు సోమవారం సరికొత్త రికార్డులను సొంతం చేసుకునే స్థితిలో సాగాయి.

జి.డి.పి. వృద్ధిపై తగ్గిన అంచనా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జి.డి.పి. వృద్ధి 6.5 శాతంగా మాత్రమే ఉండగలదని ప్రభుత్వం శుక్రవారంనాడు ప్రకటించింది. ఇంతకుముందు అది 7.5 శాతంగా ఉండగలదని అంచనా వేసింది.

అమెరికన్ డాలరుతో రూపాయి మారకం విలువ పెరిగి రూ. 63.24గా నమోదైంది. 2015 ఏప్రిల్ తర్వాత రూపాయి చూసిన పటిష్ఠమైన స్థితి ఇది. సోమవారంనాడు చివరగా అది రూ. 63.35గా నమోదైంది. శుక్రవారంనాడు అది రూ. 63.37గా ఉంది.

బలపడుతున్న రూపాయి

డిసెంబరుతో ముగిసిన త్రైమాసిక ఫలితాలను శుక్రవారంనాడు ప్రకటించనున్న ఇన్ఫోసిస్ లిమిటెడ్ షేర్ ధర 2.4 శాతం పెరుగుదలను చూసింది. ఇన్ఫోసిస్ నేతృత్వంలో ఐ.టి. కంపెనీల షేర్ల ధరలు పెరిగాయి. బి.ఎస్.ఇ.లోని రంగాలవారీ సూచీలలో ఐ.టి. రంగ సూచి ఎక్కువగా 1.4 శాతం లబ్ధి పొందింది. యంత్రాలు, యంత్ర పరికరాలు (1.22 శాతం), ఆరోగ్య రక్షణ (1.2 శాతం), రియల్టీ (0.87 శాతంతో) ఆ తర్వాత స్థానాలలో నిలిచాయి.

కొత్త మార్కెట్లకు ఏ.జి.సి నెట్‌వర్క్స్

ముంబయి: సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐ.టి) కంపెనీలు భౌగోళికంగా తమ ఉనికిని తగ్గింటుకుంటున్న సమయంలో ఎస్సార్ గ్రూప్ కంపెనీ ఏ.జి.సి. నెట్‌వర్క్స్ నూతన తీరాలలో అడుగుపెడుతోంది. మొదటగా ఈ ఏడాది బ్రిటన్‌లో అడుగుపెడుతోంది. ఈ సిస్టమ్స్ ఇంటెగ్రేటర్ మలేసియా, థాయిలాండ్, ఇండోనేషియాలలో కూడా సదుపాయాలు నెలకొల్పనుంది. ఎస్సార్ టెలికాంకు ఏ.జి.సి. నెట్‌వర్క్స్ అనుబంధ సంస్థ అవుతుంది. ఎస్సార్ గ్రూప్ ఇన్వెస్ట్‌మెంట్ల హోల్డింగ్ సంస్థ. ఎస్సార్ గ్రూప్ తన బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (బి.పి.ఓ) సంస్థ ఏజిస్‌ను 2017లో విక్రయించిన తర్వాత, తిరిగి ఇప్పుడు ఏ.జి.సి. నెట్‌వర్క్స్ వంటి చిన్న కంపెనీలను వృద్ధిలోకి తీసుకువస్తోంది. ''మా పోర్ట్‌ఫోలియోలో బ్రిటన్‌ను చేర్చుకుంటున్నాం. ఆసియా పసిఫిక్ దేశాలలో కొన్నింటిలో కార్యకలాపాలు పెంపొందించుకునే దిశగా మా తదుపరి ప్రయాణం సాగుతుంది. ఈ దేశాలు (మలేసియా, థాయిలాండ్, ఇండోనేషియా) పెద్ద మార్కెట్లలో కొన్నింటిగా లెక్కకొస్తాయి. చాలా కంపెనీలు వాటి నుంచి పని చేస్తున్నాయి. 2018లో ఈ ప్రాంతాలలోకి విస్తరించాలని మా పథకం'' అని ఏ.జి.సి. నెట్‌వర్క్స్ సి.ఇ.ఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ వర్మ చెప్పారు. ''కొత్త ప్రదేశాల్లో అడుగుపెట్టడం మొదలైంది. మేం దీన్ని కస్టమర్లు ఉన్న చోటికి వెళ్ళడంగా అభివర్ణిస్తాం. మా కస్టమర్లు కేంద్రాలు తెరచిన కొద్ది దేశాలలో మేం అడుగుపెట్టాం'' అని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ ఐ.టి. కంపెనీ తొమ్మిది దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీని గ్లోబల్ కస్టమర్లలో ప్రధానంగా బ్యాంకులు, భారీ టెక్నాలజీ కంపెనీలు, ఉన్నత స్థాయి గొలుసుకట్టు ఆస్పత్రుల సంస్థలు ఉన్నాయి. ఈ కేంద్రాలకు సిబ్బందిని రిక్రూట్ చేసుకోవడానికే కంపెనీ ప్రధానంగా పెట్టుబడులు పెట్టనుంది.

AGC Accelerating Business

ఉద్యోగావకాశాలు

సిబ్బందిని 20 శాతం పైగా పెంచుకోవాలని కంపెనీ భావిస్తోంది. ఏ.జి.సి. నెట్‌వర్క్స్‌లో ప్రస్తుతం 750 మంది ఉద్యోగులున్నారు. దేశం లో ఉద్యోగాల్లోకి సుమారుగా 100 మందిని, విదేశాల్లోకి 50 మందిని తీసుకోవాలని భావిస్తోంది. ''విదేశాల్లో ఉన్న మా కస్టమర్లకు ఆలం బనగా నిలిచేందుకు దేశంలోకే ఎక్కువగా ఉద్యోగాల్లోకి తీసుకుంటాం'' అని ఆయన చెప్పా రు. కస్టమర్ల పునాది విస్తరణ, కొత్త సేవల అభివృద్ధి, ఉత్పాదకతను పెంచుకోవడం ద్వారా వ్యాపారం ఈ ఏడాది సుమారు 15-20 శాతం వృద్ధి చెందగలదని కంపెనీ భావిస్తోంది. దేశీయ, గ్లోబల్ మార్కెట్లు రెండింటి నుంచి వృ ద్ధి సమ నిష్పత్తిలో ఉండగలదని భావిస్తోంది. ఈ కంపెనీ 2010లో తన ప్రయాణాన్ని ప్రారం భించింది. ఇండియాలో లిస్ట్ అయిన ఏ.జి.సి. నెట్‌వర్క్స్‌లో అమెరికాకు చెందిన అవయకున్న 59.13 శాతం వాటాను ఎస్సార్ గ్రూప్ రూ. 206.19 కోట్లకు 2010లో స్వాధీనం చేసుకుంది.

'భారత్ నెట్' రెండో దశ మొదలు

న్యూఢిల్లీ: దేశంలో 1.5 లక్షల గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ కల్పించడానికి భారత్ నెట్ ప్రాజెక్టులోని రెండవ దశ అనుకున్న సమయంకన్నా ముందే ఈ ఏడాది డిసెంబర్ నాటికే పూర్తికావచ్చనే ఆశాభావాన్ని ప్రభుత్వం వ్యక్తం చేసింది. రెండవ దశ పూర్తికావడానికి 2019 మార్చి వరకు సమయం ఉంది. సకాలంలో పనులు పూర్తి చేసిన సంస్థలకు తగిన పారితోషికాలిచ్చే విధానం ఉండాలని టెలికాం మంత్రి మనోజ్ సిన్హా చెప్పారు. అదే విధంగా, పనులు పూర్తి చేయనివారికి ఆ లోటు తెలిసేట్లు చేసే మార్గాలుండాలని ఆయన అన్నారు. కాంట్రాక్టు క్లాజులలో ఫైనాన్షియల్ ఇన్‌సెన్‌టీవ్‌లు, డిస్‌ఇన్‌సెన్‌టీవ్‌లు రెండూ ఉండాలి. ప్రాజెక్టులోని రెండవ దశను వేగంగా అమలు చేసేట్లు చూడాలని ఆయన అన్నారు. భారత్ నెట్ ప్రాజెక్టులోని మొదటి దశ పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మొదటి దశ కింద లక్ష గ్రామ పంచాయతీలకు హై-స్పీడు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ కల్పించారు. మిగిలిన 1.5 లక్షల గ్రామ పంచాయతీలను హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌తో అనుసంధానపరచే ప్రాజెక్టు రెండవ దశ పనులు ప్రారంభించినట్లు టెలికాం కార్యదర్శి అరుణా సుందరరాజన్ చెప్పారు. ''మేం రెండవ దశ పనులు ప్రారంభించాం..మంత్రివర్గం ఇదివరకే ఆమోదం తెలిపింది. అది సకాలంలో, 2018 డిసెంబర్ నాటికే పూర్తవుతుందని మేం ఆశిస్తున్నాం'' అని ఆమె అన్నారు. రాష్ట్రాలు, ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో సరసమైన ధరకు బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులు కల్పించడం ఈ మెగా ప్రాజెక్టు లక్ష్యం. భారత్ నెట్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ ప్రాజెక్టుగా టెలికాం మంత్రి అభివర్ణించారు. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలను భారీ సంఖ్యలో సృష్టించగలదని మనోజ్ సిన్హా చెప్పారు. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, నైపుణ్యాలు, ఈ-అగ్రికల్చర్, ఈ-కామర్స్ వంటి రంగాల్లో గ్రామీణ పేదలకు డిజిటల్ సర్వీసుల సమర్పణను ఈ మౌలిక వసతి పెంపొం దించగలదని భావిస్తున్నారు. రెండవ దశ పూర్తయితే, 2018 డిసెంబర్ నాటికి దేశంలో 5 లక్షల వై-ఫై హాట్‌స్పాట్‌లు సమకూరగలవని సుందరరాజన్ చెప్పారు. మొదటి దశ లక్ష్యాల సాధనలో సహకరించినవారిని టెలికాం శాఖ సత్కరించింది.



'జనాకర్షక బడ్జెట్ కాకపోవచ్చు'

న్యూఢిల్లీ: అనేక మంది భావిస్తున్నట్లుగా 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రజాకర్షక బడ్జెట్‌గా ఉండకపోవచ్చని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఇది నరేంద్ర మోదీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామిక కూటమి (ఎన్.డి.ఏ) ప్రభుత్వం సమర్పిస్తున్న కడపటి పూర్తి సంవత్సరపు బడ్జెట్ అవుతుంది. ఓట్లు కోరే విధంగా ఈ బడ్జెట్‌ను రూపొందించడానికి అవకాశాలున్నాయంటూ సమాచార సాధనాలలో కొన్ని వర్గాలు రకరకాల కథనాలు వండి వారుస్తున్నాయి. అయితే, సామాన్య మానవుని సంక్షేమాన్ని మెరుగుపరచడంపైనే బడ్జెట్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉందని రాజీవ్ అన్నారు. ''నేను ఈ సంగతిని ఎంతో గట్టిగా చెప్పగలను. ఈ ప్రభుత్వం, ప్రధాన మంత్రి వ్యవహార శైలికి సంబంధించి ఓ విశిష్ట గుణం ఉంది. వారు ఒక జనాకర్షక ఉపకరణంగా బడ్జెట్ రూపకల్పనను ఉపయోగించుకోవడానికి ఎన్నడూ అనుమతించలేదు'' అని రాజీవ్ అన్నారు. ''ఇతరుల మాదిరిగా ఓట్లు అభ్యర్థించడానికి మోదీ ప్రభుత్వం బడ్జెట్‌ను సమర్పించలేదు. అదే విషయాన్ని మీరు ఈసారి తెలుసుకుంటారు. మన జనాభా సంక్షేమ స్థాయిలను మెరుగపరచే రంగాలపై బడ్జెట్ దృష్టి పెడుతుందని నేను ఆశిస్తున్నాను. అభిప్రాయపడుతున్నా'' అని ఆయన చెప్పారు. బడ్జెట్ ప్రాథమికంగా, కనీస ఆరోగ్య రక్షణ సదుపాయాలు, ప్రాథమిక విద్య, వ్యవసాయం, మౌలిక వసతులపైన, ఆర్థిక వ్యవస్థ ఉత్పాదక సామర్థ్యాన్ని విస్తరించి, దాన్ని హెచ్చు వృద్ధి పథంలోకి తీసుకెళ్ళడంపైన దృష్టి సారిస్తుందని కూడా రాజీవ్ అభిప్రాయపడుతున్నారు. బడ్జెట్‌కు ముందు దేశంలోని 30 మంది అగ్ర శ్రేణి ఆర్థికవేత్తలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జనవరి 10న సమావేశమయ్యే అవకాశం ఉంది. ఆ సమావేశంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, నీతి ఆయోగ్ సి.ఇ.ఓ. అమితాబ్ కాంత్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్, ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ వివేక్ దేవరాయ్, ఆర్థిక సలహా మండలిలోని ఇతర సభ్యులు కూడా పాల్గొంటారు. నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేసినప్పటి నుంచి ఈ రకమైన సమావేశాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ''వీలైనంత మంది ఎక్కువ వ్యక్తుల అభిప్రాయాలు తెలుసుకోవాలని మేం కోరుకుంటున్నాం. ఈ బడ్జెట్ రూపకల్పనకు అభిప్రాయాలు, సూచనలు చాలా ముఖ్యం. దేశ ఆర్థిక కార్యకలాపంపై ప్రభావం చూపే అంశమిది'' అని రాజీవ్ అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరుగనున్నాయి. రెండవ సమావేశాలు మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు సాగుతాయి. బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న సమర్పిస్తారు.

మహిళల ప్రాతినిధ్యం పెంచిన 'ముద్ర'




జైపూర్: దేశంలోని సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల రంగంలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడంలో కేంద్రం చేపట్టిన 'ముద్ర' పథకం సఫలమైందని కేంద్ర జల వనరుల శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ చెప్పారు. దేశంలో మొత్తం మహిళల్లో 14 శాతం మంది మాత్రమే వ్యాపార, వ్యవస్థాపక సామర్థ్యాలను కనబరుస్తున్నారని, ఈ శాతం మరింత మెరుగుపడవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. మహిళల్లో నైపుణ్యం ఉందని, కానీ, వారు ఉపేక్షకు గురవుతున్నారని మంత్రి అన్నారు. ''మనం మన ఆలోచనా ధోరణిని మార్చుకుని, మహిళలకు సాధికారత కల్పించవలసి ఉంది'' అని ఆయన ఇక్కడ ఇండియా ఇండస్ట్రియల్ ఫెయిర్‌లో చెప్పారు. వ్యవసాయం, పశు సంవర్ధక రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందని వారిని వ్యాపార, వ్యవస్థాపక సామర్థ్య రంగాలలో కూడా ప్రోత్సహించవలసిన అవసరం ఉందని మేఘ్‌వాల్ చెప్పారు. మహిళలు కేంద్ర బిందువుగా కేంద్రం పథకాలు రూపొందుతున్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ చెప్పారు. నేషనల్ యు.ఎస్. ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్, అమెరికా శాఖ సి.ఇ.ఓ. పూర్ణిమా వొరియా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలపై పతంజలి ఉత్పత్తులు

న్యూఢిల్లీ: బాబా రామ్‌దేవ్ నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేద్ స్వదేశీ శ్రేణికి చెందిన ఎఫ్.ఎం.సి.జి. ఉత్పత్తుల ఆన్‌లైన్ అమ్మకాలు పెంచుకునేందుకు ఎనిమిది ప్రసిద్ధ రిటైలర్లు, అగ్రిగేటర్లతో భాగస్వామ్యం కుదుర్చుకునే అవకాశం ఉందని కంపెనీ అధికారి ఒకరు చెప్పారు. ప్రధాన ఆన్‌లైన్ రిటైలర్ల (అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం మాల్, 1ఎం.జి., బిగ్‌బాస్కెట్, గ్రాఫెర్స్, షాప్‌క్లూస్, స్నాప్‌డీల్)తో హరిద్వార్ కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ ఈ నెలలో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది. దాంతో వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలపై పంతజలి ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. ''దీనితో మారుమూలనున్న ప్రాంతాల కస్టమర్లకు కూడా మా ఉత్పత్తులు చేరతాయి'' అని పతంజలి అధికార ప్రతినిధి ఎస్.కె. టిజరవాలా చెప్పా రు. పతంజలి సంస్థకు పతంజలిఆయుర్వేద్ డాట్ నెట్ పేరుతో సొంత పోర్టల్ ఉంది. దాని ద్వారా అది ఆన్‌లైన్ అమ్మకాలు సాగిస్తోంది. వివిధ విక్రేతల ద్వారా పతంజలి ఉత్పత్తులలో కొన్ని ఇప్పటికే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలపై అందుబాటులో ఉన్నాయి. సంస్థ ఇటీవల పిల్లలు, పెద్దల డైపర్లు, ఓ మోస్త రు ధరకు లభించే శానిటరీ న్యాప్‌కిన్‌ల విభాగాలలోకి కూడా ప్రవేశించింది. సౌర విద్యుత్తుతో పనిచేసే వస్తువుల ఉత్పత్తిలోకి అడుగుపెడుతున్నట్లు అది ప్రకటించింది. వేగంగా అమ్ముడుపోయే వినియోగ వస్తువుల రంగంతోపాటు విద్య, ఆరోగ్య రక్షణ రంగాలలో కూడా కార్యకలాపాలు సాగిస్తున్న పతంజలి సంస్థ టర్నోవరు 2016-17లో రూ. 10,500 కోట్లు దాటింది.

అంచనాలకు మించి వ్యవసాయ వృద్ధి

న్యూఢిల్లీ: రబీ పంట అవకాశాలు మెరుగ్గా ఉన్నందున దేశంలో వ్యవసాయ రంగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సి.ఎస్.ఓ. అంచనా వేసిన 2.1 శాతంకన్నా ఎక్కువగానే వృద్ధి చెందగలదని వ్యవసాయ మంత్రిత్వ శాఖ పేర్కొంది. వ్యవసాయం, దాని అనుబంధ రంగం 2016-17లో సాధించిన 4.9 శాతంకన్నా చాలా తక్కువగా 2017-18 సంవత్సరంలో 2.1 శాతం వృద్ధిని మాత్రమే సాధించవచ్చని కేంద్ర గణాంకాల కార్యాలయం (సి.ఎస్.ఓ)వెల్లడించింది. వ్యవసాయ రంగ వృద్ధిలో పంటలు జోడించే స్థూల విలువ (జి.వి.ఏ) 60 శాతంగా, పశువులది 20 శాతంగా, అటవీ ఉత్పత్తులది 8.5 శాతంగా, చేపల పెంపకంది 5.5 శాతంగా ఉంటుంది. ''2017లో చక్కని ఖరీఫ్ దిగుబడికి తోడు, రబీ కూడా చాలా చెప్పుకోతగ్గ విధంగా చేతికొచ్చే అవకాశం ఉంది కనుక, హెచ్చు వృద్ధి రేటును సాధించగలమని మంత్రిత్వ శాఖ ఆశాభావంతో ఉంది'' అని ఒక అధికార ప్రకటన వెల్లడించింది. తుది అంచనా సంఖ్యలు విడుదల చేసే సమయానికి వ్యవసాయ రంగం 2017-18లో హెచ్చు జి.వి.ఏ.ని నమోదు చేయవచ్చని ఆ ప్రకటన తెలిపింది. వర్షాల రాక ఆలస్యమవడంతో 2017 ఆగస్టు నాటికి పంట వేసిన ప్రాంతం తక్కువగా ఉందని, కానీ, 2017 డిసెంబర్ నాటికి వాస్తవంగా పంటల పరిస్థితి చాలా సానుకూలంగా ఉందని, హెచ్చు వృద్ధి సాధ్యం అనుకోవడానికి కారణాలలో, అది కూడా ఒకటని చెప్పింది. తర్వాత, వర్షాలు బాగా పడడంతో ఖరీఫ్ లక్ష్యాలకు అనుగుణంగానే పంట వైశాల్యం పెరిగిందని చెప్పింది. ఖరీఫ్ పంట వైశాల్యం ఐదేళ్ళ సగటు 105.86 మిలియన్ల హెక్టార్లు కాగా, 2017లో ఖరీఫ్ వైశాల్యం చివరకు 106.55 మిలియన్ హెక్టార్లకు పెరిగిందని తెలిపింది. దానికి తోడు, ఆహారధాన్యాలు, నూనెగింజలు, వాణిజ్య పంటల దిగుబడులను కూడా లెక్కలోకి తీసుకుంటే జి.వి.ఏ. అంచనా పెరిగిగేరుతుందని పేర్కొంది. జి.వి.ఏ. మదింపులో తోటలపెంపకం నుంచి ఉండే వాటా కన్నా వాటి వాటాయే ఎక్కువ. పశువులు, చేపల పెంపకం పరిస్థితి కూడా 2017 ఆగస్టు వరకు చాలా సానుకూలంగా ఉందని తెలిపింది. రబీ పంటలను 58.6 మిలియన్ హెక్టార్లలో వేసినట్లు ప్రకటించింది. రబీ నాట్లు ఫిబ్రవరి మొదటి వారం వరకు కొనసాగగల వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుంటే, పంట వైశాల్యమూ పెరుగుతుంది. దిగుబడులూ పెరుగుతాయని ఆ ప్రకటనలో తెలిపింది.



మనం
www.manamnews.com
మందిరం
మంగళవారం, 9 జనవరి 2018



పండగంటే సంబరం. సంక్రాంతి సంబరాల్లో సంస్క ృతి వెల్లివిరుస్తుంది. ఆధ్యాత్మిక, ఆరోగ్య కోణాలతో పాటు సామాజిక స్ప ృహను కూడా పెంచే పండుగ సంబరాలు ఆధునికత వేగంలో వెనుకంజ వేస్తున్నాయి. తరాల అంతరాలతో సంక్రాంతి సంబరాల వైభవం మరుగునపడుతోంది. సంక్రాంతి అనగానే మనకు గుర్తుకు వచ్చేవి ప్రతి ఇంటి ముంగిటా మెరిసిపోయే ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దులాటలు, భోగిమంటలు, బొమ్మల కొలువులు. ఇప్పటికే మన సంక్రాంతి ఆచారాల వెలుగు తగ్గింది. అసలు పూర్తిగా మర్చిపోయిన ఆచారాలు కూడా ఎన్నెన్నో ఉన్నాయి.

సిరుల పండుగ సంక్రాంతి



అన్నిరకాల పంటలు పొలాల నుంచి ఇళ్లకు చేరే తరుణం ఇది. దానధర్మాలకు వెసులుబాటు ఉంటుంది. రకరకాల యాచకులు తమ పద్ధతుల్లో వినోదపరుస్తూ గుమ్మాల్లోకి వస్తారు. హరినామ సంకీర్తనతో పండుగ నెల పట్టినది మొదలు సాతాని జియ్యర్లు వస్తారు. తలమీది అక్షయపాత్రలను బియ్యంతో నింపుకుని వెళతారు. అంబ పలుకు జగదంబా పలుకు అంటూ డక్కా వాయిస్తూ, శుభం పలుకుతూ బుడబుడక్కల స్వామి ముంగిళ్లలో సందడి చేస్తాడు. రంగురంగుల బొంతలతో, రకరకాల పట్టెడలతో, చిరుగంటలతో అలంకరించిన గంగిరెద్దులను వెంట తీసుకువస్తారు. ''డూడూ బసవన్నా'' అంటూ ముగ్గుల్లో ఆడిస్తారు. చేటలతో ధాన్యాన్ని, పాతవస్త్రాలను ఇవ్వందే వెళ్లరు. ''శంభో మహాదేవ శంకర శివా'' అంటూ పెద్దగంట వాయిస్తూ జంగం దేవర వస్తాడు. తలపై కిరీటం, చిక్కని విబూది పట్టెలు, మెడలో పెద్దశంఖం... ఇదీ జంగందేవర వేషం.

ఎరుకల సాని

సోదోయమ్మ సోది... సోది చెబుతానమ్మ సోది... అంటూ వీధుల్లో తిరిగే ఎరుకల సాని ప్రత్యేక ఆకర్షణ. సంక్రాంతి పండుగకు పుట్టింటికి చేరిన ఆడపడుచులంతా వీధి అరుగుల మీద చేరి, సోది చెప్పించుకునే వారు. చాటలో బియ్యం పోయించి, ఆ బియ్యాన్ని మూడు భాగాలుగా చేసి, మనస్సు కేంద్రీకరించి, భవిష్యత్తు చెప్పే వాక్కును ఇవ్వాల్సిందిగా ఎరుకల సాని దేవతలను ప్రార్థిస్తుంది. 'విఘ్నేశ్వరా, వీరభద్రా, మధుర మీనాక్షి, కంచి కామాక్షి, బెజవాడ కనకదుర్గమ్మ, కన్యకాపరమేశ్వరీ... మీరెల్లరూ వచ్చి వాకీయరే.. వాకీయరే...' అంటూ ఎరుకల సాని సోది చెప్పటం ప్రారంభిస్తుంది. ఆమె చెప్పే మాటలకు అడ్డుపడుతూ సందేహాలు అడుగుతూ సోది చెప్పించుకోవటానికి ఒకరికొకరు పోటీపడటం, సోది చెప్పటం పూర్తయిన తర్వాత ఆ ముచ్చట్లతో సందడి చేయటం... సంక్రాంతి సంబరానికి కొత్త వెలుగు తీసుకువస్తుంది.




జంగమదేవర

అడుగుఎత్తులో ఉండే ఇత్తడి కిరీటం జంగదేవరది. ఒంటి నిండా విభూతి బొట్లు పెట్టుకుని, చేతిలో పెద్ద గంట పట్టుకుంటాడు. దాన్ని లయబద్ధంగా మోగిస్తూ, 'శంభో శంకర' అంటూ బిగ్గరగా శివనామాన్ని వల్లిస్తూ సంక్రాంతి పండుగ రోజుల్లో ఇల్లిల్లూ తిరుగుతుంటారు. వీరిని సాక్షాత్తు శివస్వరూపంగా భావిస్తారు. 'సంక్రాంతి పండుగ వచ్చే సిద్ధేశ్వరా... సాంబమూర్తి కరుణ కలిగే సిద్ధేశ్వరా... కలకాలం వర్ధిల్లు సిద్ధేశ్వరా...' అంటూ ఆశీర్వచనాలు పలుకుతారు.

పిట్టల దొర

చిన్నా పెద్దా అందరినీ ఆకర్షించే మాటల మాంత్రికుడు పిట్టలదొర. భుజం మీద బొమ్మ తుపాకీ, తల మీద దొరల టోపీ, పెద్ద నిక్కరు, ఖాకీ చొక్కా, మేజోళ్లు లేని డొక్కు బూట్లు వేసుకుని, ప్రపంచాన్ని ఏలేస్తానంటూ పిట్టల దొర చెప్పే కబుర్లు కోటలు దాటతాయి. ఆ మాటలకు కడుపుచెక్కలయ్యేలా నవ్వని మనిషి ఉండడు. సంక్రాంతి పండుగ రోజుల్లో ఇల్లిల్లూ తిరుగుతూ పిట్టలదొర చెప్పే వింత వింత కబుర్లకు ఇంట్లోని వారంతా ఒకచోట చేరి, హాయిగా నవ్వుకుంటూ, సరదాగా ఛలోక్తులు విసురుకుంటూ, సంక్రాంతి పండుగని నవ్వుల పండుగగా తీర్చిదిద్దుతారు.

పులివేషాలు



కళ్లు చెదిరే రంగులతో అచ్చం పులిలాగా చారలు పెట్టుకుని, డప్పు మోతలకు అనుగుణంగా అడుగులు వేస్తూ కట్టే పులివేషగాడు సంక్రాంతి పండుగకు అదనపు హంగు. సంక్రాంతికి పులివేషం కట్టటమంటే.. అదొక పెద్ద ఆడంబరం. పులివేషం వేసిన వాడు మగాడనే నానుడి కూడా ఒకప్పుడు ఉండేది. ఈ వేషాలు వెయ్యటానికి పందాలు కూడా కట్టేవారు. పులివేషం వెనుక కుర్రాళ్లంతా చేరి, డప్పులు వాయిస్తూ వీధుల్లో తిరుగుతూ సందడి చేయటం సంక్రాంతి పండుగకి పెద్ద అలంకారం.

అర్ధనారీశ్వరుడు

ఒకప్పుడు సంక్రాంతి పండుగ రోజుల్లో ఒక వెలుగు వెలిగి, నేటి తరానికి పేరు కూడా తెలియని స్థితిలో ఉన్న సంక్రాంతి కళారూపం పగటి భాగవతులు. దీన్నే అర్ధనారీశ్వర కళారూపం అని కూడా అంటారు. కూచిపూడి నృత్యనాటకాల్లో అతి చిన్న పాత్రలు ధరించే కళాకారులు సంక్రాంతి పండుగ రోజుల్లో అర్ధనారీశ్వర వేషం వేసేవారు. ఒకే మనిషి శరీరంలో సగభాగం శివుడిగా మరో సగభాగం పార్వతిగా అలంకారం చేసుకుని, ఆడ గొంతుకతోనూ అతడే మాట్లాడుతూ, ఒకే సమయంలో రెండు రకాల పాత్రల్ని అభినయించడం ఈ కళారూపం ప్రత్యేకత. శివపార్వతులిద్దరూ తాండవం చేస్తున్నట్లు కళాకారులు వీధికూడళ్లలో నృత్యం చేసేవారు. చివరగా, అర్ధనారీశ్వర వేషధారి కనికట్టు విద్యతో తల మీద నుంచి గంగను సృష్టించినట్లు నీటిని చిమ్మి, అందరినీ ఆశ్చర్యపరచేవాడు. సంక్రాంతికి వీధిభాగవతులు వస్తే... అదొక నిండుదనం.

బుడబుక్కలవాళ్లు

మోకాళ్ల కిందకి పంచె, వంటి మీద కోటు, తలపాగా, ఒక చేత్తో గొడుగు పట్టుకుని, మరో చేతితో డమరుకం మోగిస్తూ, 'అంబ పలుకు జగదంబ పలుకు, మధుర మీనాక్షి పలుకు, కంచి కామాక్షి పలుకు, కాశీ విశాలాక్షి పలుకు...' అంటూ ఇల్లిల్లూ తిరుగుతాడు బుడబుక్కల కళాకారుడు. బుడబుడమని శబ్దం చేసే వాద్యం వాయించటం వల్ల వీరికి బుడబుక్కల వాళ్లనే పేరు వచ్చింది. శకునపక్షి భాష వీరికి మాత్రమే తెలుసని, కోడి కూసినప్పటి నుంచి ఎండ వచ్చే వరకు వీరు చెప్పే మాటలు నిజమవుతాయని నమ్మిక.

కాశీకావడి

ఒక చేతిలో అద్దపు బరిణె, అందులో చిన్న తాబేలు పెట్టుకుని ఇల్లిల్లూ తిరిగే కళాకారులు వీరు. ఈ కళాకారుడి చేతిలోని కూర్మానికి అందరూ దండాలు పెట్టేవారు. అద్దపు బరిణెను కాశీ కావడి అనేవారు. ఇందులో పాపపుణ్యాల చిట్టా ఉంటుంది. ఏ పాపానికి ఏ శిక్ష, ఏ పుణ్యానికి ఏ సౌఖ్యం కలుగుతుందో ఈ కళాకారులు చెప్పేవారు.

కనకదుర్గమ్మ పెట్టె



రంగురంగుల వస్త్రాల పీలికలతో పరికిణీలు కట్టుకుని, చేతిలో కొరడా పట్టుకుని పురుషుడుంటాడు. అతని పక్కన నెత్తిన పెట్టుకున్న బుట్టలో కనకదుర్గమ్మ పటం పట్టుకుని భార్య వస్తుంది. దంపతులుగా వచ్చే కళారూపం ఇది. పంబ వాద్యాన్ని భార్య వాయిస్తుంటే, భర్త తన చేతిలో కొరడాతో తానే చెళ్లుమని కొట్టుకుంటాడు. ఒళ్లు గగుర్పొడిచేలా ఈ కళారూపం ఉంటుంది.

విప్రవినోదులు

కనికట్టు విద్యలు ప్రదర్శించటంలో వీరు సిద్ధహస్తులు. బొంతలాగా ఉండే మూటని భుజాన తగిలించుకుం టారు. రూపాయి బిళ్లను చెవిలో వేసి, ముక్కులో నుంచి బయటకు తెప్పించ టం; రాయిని కప్ప లాగా మార్చటం, చీపురు పుల్ల నుంచి రక్తం కార్పించటం వంటి కనికట్టు విద్యలు ప్రదర్శిస్తుంటారు. 'కాటికాపరి' పేరుతో కొంతమంది సంక్రాంతి సమయంలోనే ఇంటింటికీ తిరుగుతారు. వీరు కూడా కనికట్టు విద్యలు ప్రదర్శిస్తారు.

కోయ దొర, చెంచు దొర

నెమలి ఈకలు, జంతు చర్మాలు కట్టుకుని, కొండ ప్రాంతాల నుంచి ఈ కళాకారులు వస్తారు. కొండజాతి భాషలో మాట్లాడుతుంటారు. పసరు వైద్యంతో సహా మూలికలు తీసుకువచ్చి ఇస్తారు. అమ్మోరు తల్లి పలికిందంటూ భవిష్యత్తు చెబుతారు.

దీవెనల పకీరు

కిర్రున చప్పుడు చేసే కొయ్య పంఖా తిప్పుతూ అల్లా నామ స్మరణ చేస్తూ తెల్లవారు జామునే ఇల్లిల్లూ తిరుగుతూ జోస్యం చెప్పే కళారూపం ఇది. మత సామరస్యానికి ప్రతీకగా ఈ కళారూపం నిలుస్తుంది.

మాసాబత్తినవాళ్లు

చూస్తేనే భయం వేసే ఆకారం, వేషం కలిగి ఉంటారు. 'ష్... మంత్రకాళీ' అంటూ తేళ్లు, మండ్రగబ్బలు సృష్టిస్తారు. కడవలో నీళ్లు పోసి, ఆ నీళ్లలోకి కత్తి గుచ్చి, ఆ కత్తి ఆధారంగా కావడి వేలాడదీసి, ఊరేగింపు జరుపుతారు. ఒళ్లు గగుర్పొడిచే విద్యలు ప్రదర్శిస్తారు. వీరి ఊరేగింపు డప్పు వాద్యాల హోరులో జాతరగా సాగుతుంది. వీరి విద్యలు ఒక్కోసారి ఎంతో విడ్డూరం అనిపిస్తాయి.

ఇంకా, ప్రతి ఇంటికీ వెళ్లి, ఆ ఇంటి వారి పేరు, గోత్రం మొదలైన వివరాలు చెబుతూ తిరిగే 'పిచ్చుకకుంటలు'; కోతులను మచ్చిక చేసుకుని, వాటితో అనేక రకాల ఆటలు ఆడిస్తూ తిరిగే 'కోతులవాళ్లు' ఇలా మరెన్నో కళారూపాలు సంక్రాంతి సమయంలో సందడి చేస్తాయి. ఎంతో వినోదం, మరెంతో ఆహ్లాదం కలిగించే మనవైన కళారూపాల సంరక్షణతో పాటు వాటిని భవిష్యత్తు తరాలకు పదిలంగా అందించాల్సిన బాధ్యత మనమీదే ఉంది.

- డాక్టర్ కె. మారుతి

జనవరి 12, యువజనోత్సవం

వికాసమే జీవనం... సంకోచమే మరణం. మనపై మనకు విశ్వాసం, భగవంతుడిపై విశ్వాసం అనేవి పరిపూర్ణ వికాస మంత్రాలు. ముప్పై మూడు కోట్ల పౌరాణిక దేవతలపైన మీకు నమ్మకం ఉన్నా... మీపై మీకు ఆత్మవిశ్వాసం లేకపోతే నిష్క ృతి ఉండదు అని చాటిన నిత్యచైతన్య స్ఫూర్తి స్వామి వివేకానంద.

నిత్య చైతన్య స్ఫూర్తి

స్వామి వివేకానంద 1863వ సంవత్సరం జనవరి 12వ తేదీన బెంగాల్ రాష్ట్రంలో భువనేశ్వరీ దేవి, విశ్వనాథ దత్తా దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులు ఆయనకు పెట్టిన పేరు నరేంద్రనాథ్ దత్తా. నరేన్ అని పిలిచేవారు. నరేంద్రనాథ్ తాత దుర్గాచరణ్ దత్తా ఆధ్యాత్మిక సంపన్నత కలిగిన వ్యక్తి. ఆయన 25 సంవత్సరాల వయస్సులోనే వైరాగ్యంతో సర్వసంగ పరిత్యాగం చేసి సన్యాసి అయ్యారు. ఇక నరేంద్రనాథ్ తల్లి భువనేశ్వరీదేవి కూడా భక్తి పరాయణురాలు. నరేంద్రనాథ్ గర్భంలో పడేముందు శివుడు ఆమెకు స్వప్నదర్శన వేళ వరం ఇచ్చాడని చెబుతారు.

గురుదర్శనం

చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తితో ఉండేవారు నరేంద్రులు. నిరంతరం ధ్యానం చేస్తుండేవారు. కళాశాల స్థాయిలో పాశ్చాత్య భావాలను చదివిన నరేంద్రునిలో అవి విమర్శనాత్మక ఆలోచనలకు కారణమయ్యాయి. ఒకవైపు పురాతన మత సంప్రదాయాల పట్ల గౌరవం, ఇంకోవైపు విమర్శనాత్మకంగా ఆలోచించే తత్త్వం ఆయనలో చోటుచేసుకోవడంతో సంఘర్షణ ప్రారంభమైంది. భగవంతుని ఉనికి గురించి ప్రశ్నలు తలెత్తాయి. ఎందరినో కలిశాడు. సమాధానం లభించలేదు. తపన అధికం కాసాగింది. అటువంటి స్థితిలో ప్రొఫెసర్ విలియం హేస్టీ ఆయనకు శ్రీరామకృష్ణ పరమహంస గురించి చెప్పారు. అంతకుముందే రామకృష్ణుల గురించి రామచంద్ర దత్త అనే బంధువు ద్వారా కూడా వివేకానందులు వినివున్నారు. 1881లో తొలిసారిగా రామకృష్ణుని కలిసిన నరేన్ - ''మీరు దేవుణ్ణి చూశారా?'' అని ఆయనను సూటిగా ప్రశ్నించారు. అందుకు రామకృష్ణులు ''అవును చూశాను. నాముందువున్న నిన్ను చూస్తున్నట్లుగా ఆయన్ను చూశాను'' అని సమాధానం ఇచ్చారు. వారి శిష్యులయ్యారు వివేకానందులు. ధ్యానమార్గంలో రామకృష్ణుల శిష్యరికంలో ఎంతో అభివృద్ధిని సాధించారు.



రామకృష్ణ మిషన్ స్థాపన

రామకృష్ణులు తనువు చాలించాక వివేకానందులు అనేక ఆలోచనలు చేశారు. సహచరులతో చర్చలు జరిపారు. 1888లో మఠం నుంచి బయటకు వచ్చారు. 1890 నుంచి సమాజంలో వివిధ పేర్లతో సంచరిస్తూ సమాజాన్ని అధ్యయనం చేశారు. అనేకమందిని కలిశారు. 1893 మే 31వ తేదీన అమెరికాకు బయలుదేరారు. జులైనాటికి చికాగో చేరుకున్నారు. 1893 సెప్టెంబర్ 11న చికాగోలోని ఆర్ట్ ఇనిస్టిట్యూట్ విశాల భవనంలో సర్వమత మహాసభ జరిగింది. 7000ల మంది పాల్గొన్న ఆ సమావేశంలో ఆయన విశ్వజనీనమైన ప్రసంగం చేశారు. ఇతర ప్రతినిధులందరూ తమ మతాలను గురించి మాత్రమే మాట్లాడితే స్వామి మాత్రం సనాతన మతం గురించి మాట్లాడారు. అందరినీ ఆకట్టుకున్న ఆయన ప్రసంగం వివిధ దేశాల్లో స్వామి పర్యటనలకు కేంద్రబిందువయ్యింది. 1897లో రామకృష్ణ మిషన్ స్థాపించారు. ఆ తరువాత కూడా వివేకానందులు ప్రపంచపర్యటనలు చేశారు.

తొలిసారి చికాగో సభలో ''అమెరికా దేశపు సోదర సోదరీమణులారా!'' అని ప్రారంభించిన ఆయన ప్రసంగం ఆనాడు అందరినీ మంత్రముగ్ధులను చేసింది. సాధారణ సన్యాసిని మహత్తర శక్తిని చేసింది. వారి తత్త్వం విశ్వవ్యాపితం అయ్యింది. సమాజంలో, జీవితంలో వివేకానందులు స్ప ృశించని అంశమే లేదు. అన్ని అంశాలలోనూ మనిషికి కావాల్సిన కర్తవ్యబోధ చేశారు. 'మృగాన్ని మానవుడిగా, మానవుణ్ణి దైవంగా ఉన్నతస్థితికి తీసుకువెళ్లే భావమే మతం' అని చాటిన వివేకానందుడు మానవుడికి శాంతిని సుఖాన్ని కల్పించడమే మతం ప్రధాన లక్ష్యం కావాలన్నారు. మతం శాంతిని అవలంబించేలా కృషిచేయాలి కానీ మనిషిని ఉద్రేకపూరితుడిని చేయకూడదన్నారు. పవిత్రంగా ఉండడం, పరులకు మంచి చేయడం, పేదల్లో బలహీనుల్లో రోగులలో దైవాన్ని దర్శిస్తూ వారిని సేవించే వ్యక్తి నిజమైన దైవవిశ్వాసి అన్నారు.

-డాక్టర్ కె. పూర్ణప్రజ్ఞాభారతి


నారద భక్తిసూత్రాలు - 9

సాత్వికారాధన శ్రేష్ఠం

56-57 సూత్రాలు:

గౌణీ త్రిధా గుణభేదాదార్తాది భేదాద్వా ।
ఉత్తరస్వాదుత్తురస్మాత్పూర్వపూర్వా శ్రేయాయ భవతి ।

గుణభేదాలంటే సత్త్వరజస్తమో గుణాలు. వీటిలో తమోగుణం కంటే రజోగుణం దానికంటే సత్త్వగుణం గొప్పవి. భక్తిలో కూడా సాత్త్వికారాధన గొప్పది. పాపాలను తొలగించుకోవడమే పరమార్థంగా సమస్త కర్మఫలాన్ని భగవంతునికి అర్పిస్తూ కర్మలను ఆచరించడం సాత్త్విక భక్తి అవుతుంది. సాత్త్వికమార్గంలో ఉన్నవారు భగవానుని పూజించడం తమ కర్తవ్యంగా భావిస్తారు. ఇక రజోగుణం కలవారికి కీర్తికాంక్ష, ఐశ్వర్యకాంక్ష ఉంటాయి. తమోగుణం కలవారి మనసులో మాత్సర్యం, హింస ఉంటాయి. అయినప్పటికీ వారు కూడా భక్తులే. అలాగే ఉపాసనా భేదాలను బట్టి అర్థార్థి, జిజ్ఞాసువు, ఆర్తుడు అనే మూడురకాల భక్తి సాధకులుంటారు. వీరిలో మొఆదటివారికంటే తరువాతివారు ఉన్నవారు. అంటే అర్థార్థి భక్తి కంటే జిజ్ఞాసువు భక్తి గొప్పది. వారి భక్తి కంటే ఆర్తభక్తి శ్రేష్ఠమైనది.



58-60 సూత్రాలు

అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌ । ప్రమాణాంతరస్యానపేక్షత్వాత్ ప్రమాణత్వాత్ । శాంతిరూపాత్పరమానందరూపాచ్చ ।

భక్తి సర్వశ్రేష్ఠమైనది. భక్తి అలవడడానికి విద్య అవసరం లేదు. ధనం, వర్ణం ఏవీ లెక్కలోకి రావు. భగవంతుణ్ణి విశ్వసించి నిరంతరం ఆయనను స్మరించినంత మాత్రంలో అది శాంతిని పరమానందాన్ని అందిస్తుంది. భక్తి మార్గాన్ని అనుసరించిన వారికి ఇది స్వీయానుభవంలోకి వస్తుంది.

-ముకుందప్రియ

ధర్మసందేహాలు

వీధివాకిట్లో ముగ్గు వేయడంలో అర్థం ఏమిటి?




చుక్కలు లేదా గీతలను కలుపుతూ వేసేది ముగ్గు. వాకిట్లో ముగ్గు వేయడం మనకు నిత్య ఆచారం. కాలంలోని మార్పులను కూడా ముగ్గులు చూపిస్తాయి. పండగలకు ఆయా కాల, దేవ ప్రాశస్త్యాన్ని వివరిస్తాయి. వీధిలోనే కాదు, గడపలపైనా, లోగిలిలోనూ, మండువాలోనూ, గోడలపై కూడా ముగ్గులు చోటు చేసుకుంటాయి. దైవానికి నివేదన అర్పించే సమయంలోనూ ముగ్గులు వేయాలి. ఇక సంక్రాంతి పండుగకు రథంముగ్గు ప్రత్యేకం. ధనుర్మాసం నెల్లాళ్లూ వాకిట్లో ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను అలంకరిస్తారు ఆడపిల్లలు. సున్నపు ముగ్గుతో వీధిలో ముగ్గు వేయాలి. బియ్యపు పిండితో గడపపై ముగ్గు వేయాలి. శుభకార్యాల సమయంలో పసుపుతో ముగ్గు వేయాలి.

సమాధానాలు : డాక్టర్ కాకునూరి సూర్యనారాయణమూర్తి

మారేడుదళం

కార్తికేయ విలాసం



షణ్ముఖుడైన సుబ్రహ్మణ్యుడు త్రిమూర్తి స్వరూపుడు. ఆ సృష్టిస్థితిలయ కర్తలే షణ్ముఖునిగా అవతరించినట్లు పురాణాలు చెప్పాయి. వివిధ పురాణాల్లో కల్పభేదాలతో షణ్ముఖుని జననగాథలున్నాయి. విష్ణు, ఇంద్ర, విశ్వామిత్రాదులు చేసిన షణ్ముఖ స్తోత్రాలున్నాయి. యోగశాస్త్రంలోనూ సుబ్రహ్మణ్యుని ఆరాధనకు సమన్వయాలు కనిపిస్తాయి. ఇడ, పింగళనాడులు వల్లీ దేవసేనలు. వాటిమధ్యలోని సుషుమ్నా నాడి సుబ్రహ్మణ్యుడు. సుషుమ్నయే ఆజ్ఞాచక్రానికి కీలకం. తెలిసి కానీ, తెలియక కానీ ధ్యానపరులందరూ సుబ్రహ్మణ్యుని ఆరాధిస్తున్నవారే. ధూళిపాళ మహాదేవమణి రచించిన శ్రీసుబ్రహ్మణ్య చరిత్ర గ్రంథం స్వామికి సంబంధించిన ప్రతి అంశాన్ని కూలంకషంగా చర్చించింది. సుబ్రహ్మణ్య తత్త్వాన్ని ఆవిష్కరించే ఆధారగ్రంథాల సారాంశమంతా ఇందులో ఉంది. షణ్ముఖ తత్త్వం, చరిత్రతో పాటు అరుదైన స్తోత్రాలను తెలుగు వ్యాఖ్యానంతో పొందుపరిచారు. సుబ్రహ్మణ్య ఆరాధన, స్తోత్ర పారాయణ చేయదలుచుకున్న వారికి ఇంతకు మించిన పండిత పరిష్క ృత ప్రతి దొరకడం దుర్లభం.

శ్రీసుబ్రహ్మణ్య చరిత్ర

రచన : ధూళిపాళ మహాదేవమణి, పేజీలు : 232, వెల : రూ. 200/-, రచయిత చిరునామా : ఎ 2/3, వెంకటేశ్వరా అపార్టుమెంట్స్, కృష్ణనగర్, రాజమండ్రి - 14 ఫోన్ నెం. 9494002247

మీరూ రాయండి!

మందిరం పేజీపై మీ అభిప్రాయాలను, రచనలను, ధర్మసందేహాలను manammandiram@gmail.comకు పంపండి. మారేడుదళం శీర్షికలో సమీక్ష కోసం మీ ఆధ్యాత్మిక ప్రచురణలను పంపవలసిన చిరునామా : మందిరం పేజీ, మనం దినపత్రిక, 5-3-864/4/బి, ఎస్.బి.ఎన్. ఆర్కేడ్, ఫోర్త్ అండ్ ఫిఫ్త్ ఫ్లోర్, గ్రీన్ ల్యాండ్స్, గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016

మనం స్పోర్ట్స్
మంగళవారం, 9 జనవరి, 2018
www.manamnews.com

తొలి మ్యాచ్‌లో ఆంధ్రా ఓటమి

- అట్టహాసంగా ప్రారంభమైన ముస్తక్ అలీ టి20 మ్యాచ్‌లు

విశాఖపట్నం స్పోర్ట్స్, మనం న్యూస్: విశాఖపట్నం, విజయనగరంలలో సయ్యద్ ముస్తాక్ అలీ టి20 క్రికెట్ మ్యాచ్‌లు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నంలోని ఎసిఎవిడిసిఎ మైదానంలో ఆంధ్రా, తమిళనాడు మధ్య మ్యాచ్ నిర్వహించగా మధ్యాహ్నం గోవా, కర్ణాటక మధ్య నిర్వహించారు. విశాఖలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆంధ్రా, తమిళనాడు జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచిన ఆంధ్రా జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 119/7 పరుగులు చేసింది. ఈ జట్టులో విశాఖ కుర్రాడడు రిక్కి బుయి 25, సోబా మహమ్మద్ ఖాన్ 20, డిబి రవితేజ 19, డిబి ప్రశాంత్ 19 పరుగులు చేశారు. ప్రత్యర్థి జట్టుకు చెందిన కె. విగ్నేష్ 17 పరుగులకు రెండు వికెట్లు పడగొట్టాడు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన తమిళనాడు జట్టు 14.4 ఓవర్లకు 3 వికెట్ల నష్టానిఇ 122 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ జట్టులో దినేష్ కార్తిక్ 57, బి.అపరజిత్ 28 పరుగులు చేసి జట్టును విజయ తీరాలకు నడిపించారు. ఆంధ్రా బౌలర్ జిహెచ్ విహారి ఒక వికెట్ తీశాడు.

గోవాపై కర్ణాటక జట్టు విజయం...

రెండో మ్యాచ్‌లో మధ్యాహ్నం గోవా, కేరళ జట్టుల తలబడ్డాయి. ఇందులో గోవాపై కర్ణాటక జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన గోవా తొలుత పీల్డ్‌ంగ్ ఎంచుకుంది. దీంతో బరిలోకి దిగిన కర్ణాటక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 172/4 పరుగులు చేసింది. ఈ జట్టులో మయానక్ అగర్వాల్ 55, ఆర్.సమరత్ 28, మనీస్ పాండే 24, ఎస్. బన్నీ 28 పరుగులు చేశారు. గోవా బౌలర్ దర్శన్ మిషల్ 3/27 వికెట్లు పడగొట్టాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గోవా నిర్ణీత ఓవర్లలో 123/8 పరుగులు చేసింది. ఈ జట్టులో సుగన్ కమత్ 28, దర్శన్ మిషల్ 24, ఎ.సిగ్వన్ 20 పరుగులు చేశారు. కర్ణాటక బౌలర్ అరవింద్ శ్రీనాద్ 2/22 వికెట్లు తీశాడు.



- మరో సారి విఫలమైన బ్యాట్స్‌మెన్
- చెలరేగిన ఫిలాండర్
- 72 పరుగులతో దక్షిణాఫ్రికా విజయం
- భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టు

తొలి టెస్టులో టీమిండియా ఓటమి

కేప్‌టౌన్: బౌలర్లు ఆధిపత్యం చెలాయించిన మ్యాచ్‌లో చివరికి దక్షిణాఫ్రికా విజయం సాధించింది. మొదట భారత బౌలర్లు అద్భుత బౌలింగ్‌తో ఆతిథ్య ఆఫ్రికాను 130 పరుగులకే కట్టడి చేశారు. దీంతో టీమిండియా ముందు కష్టసాధ్యంకాని 208 పరుగుల లక్ష్యం నిర్దేశితమైంది. కానీ, ఈ లక్ష్యాన్ని ఛేదించడానికి కోహ్లి సేన తడబడి చివరికి ఘోర పరజయాన్ని చవిచూసింది. ప్రపంచంలోనే మేటి బ్యాట్స్ మెన్‌లతో కోహ్లీ సేన ఇంత ఘోర పరాజయం చెందుతుందని ఎవ్వరు ఊహించలేదు. ఈ ఓటమితో మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 0-1తో వెనుకబడి పోయింది. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేసింది. బదులుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో పాండ్యా (93) అద్భుత బ్యాటింగ్‌తో టీమిండియాకు గౌరవ పదమైన స్కోరును అందించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించి దక్షిణాఫ్రికా జట్టుపై భారత బౌలర్లు బుమ్రా, షమీలు విరుచుకుపడ్డారు. దీంతో సఫారీ జట్టు 130 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత ఊరించే లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీ సేన ప్రత్యర్థి బౌలర్ల ధాటికి తట్టుకోలేక 135 పరుగులకే ఆలౌటైపోయింది. విధ్వంసక బౌలింగ్ చేసిన ఫిలాండర్ 6 వికెట్లు పడగొట్టాడు.

208 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆరంభం నుంచే ప్రత్యర్థి బౌలర్లు హడలెత్తించారు. మొదట్లో స్లోగా బ్యాటింగ్ చేసిన శిఖర్ ధావన్ తర్వాత వేగాన్ని పెంచాడు. ఈ క్రమంలోనే అతను రెండు బౌండరీలు బాదాడు. అయితే మోర్నీ మోర్కెల్ తెలివైన బంతితో ధావన్ 20 బంతుల్లో 2 ఫోర్లతో 16 పరుగులను పెవిలియన్‌కు పంపాడు. దీంతో భారత్ 30 పరుగులు వద్ద తొలి వికెట్ కోల్పోయింది. ఆ వెంటనే టీమిండియాకు మరో షాక్ తగిలింది. అదే స్కోరు వద్ద మరో ఓపెనర్ మురళీ విజయ్‌ను ఫిలాండర్ అద్భుత బంతితో ఔట్ చేశాడు. ఇక్కడి నుంచి భారత పతనం మొదలైంది. మురళీ విజయ్ 32 బంతుల్లో 2 ఫోర్లతో 13 పరుగులు చేశాడు. అనంతరం భారత సారథి విరాట్ కోహ్లీ, చేతేశ్వర్ పూజారతో కలిసి భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. కానీ, సఫారీ బౌలర్లు నిప్పులు చెరిగే బంతులతో విధ్వంసం సృష్టించారు. మరోసారి విజృంభించిన మోర్కెల్ భారత్‌కు మరో షాకిచ్చాడు. కుదురుగా ఆడుతూ కోహ్లీకి అండగా నిలిచిన పూజారా 13 బంతుల్లో 4 పరుగులను పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో టీమిండియా 39 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతూ కష్టల్లో పడింది. ఆ తర్వాత వచ్చిన రోహిత్ శర్మతో కలిసి కెప్టెన్ కోహ్లీ భారత ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరూ మరోవికెట్ చేజారకుకుండా జాగ్రత్తగా ఆడుతూ స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. ఈ క్రమంలోనే టీమిండియ 70 పరుగుల మార్కును పూర్తి చేసుకుంది. కానీ, ఆ తర్వాత ఫిలాండర్ మరో సారి భారత్‌కు ఎదురుదెబ్బ తీశాడు. కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న భారత సారథి విరాట్ కోహ్లీను ఎల్బీడబ్లూగా ఔట్ చేశాడు. దీంతో కోహ్లీ 40 బంతుల్లో 4 ఫోర్లతో 28 పరుగులు చేశాడు. అనంతరం రోహిత్ శర్మ (13)కూడా వెనుదిరిగాడు. హార్దిక్ పాండ్యా కూడా (1) పరుగుకే ఔటయ్యాడు. తర్వాత సాహా (8) కూడా వెనుదిరిగాడు. అయితే చివర్లో అశ్విన్ అద్భుత బ్యాటింగ్‌తో మ్యాచ్‌లో తిరి గి ఆసక్తిని పెంచాడు. ఇతనికి భువనేశ్వర్ అండగా నిలిచాడు. వీరిద్దరూ 8వ వికెట్‌కు 49 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని ఏర్పర్చారు. అనంతరం అశ్విన్ 53 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులను ఫిలాండర్ ఔట్ చేశాడు. తర్వాత షమీ (4), బుమ్రా (0)లను కూడా ఫిలాండర్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో భారత్ ఇన్నింగ్స్ (42.4 ఓవర్లలో) 135 పరుగులకు ముగిసింది. ఆఫ్రికాలో చెలరేగి బౌలింగ్ చేసిన ఫిలాండర్ 6 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు మోర్నీ మోర్కెల్, రబడ చెరో రెండు వికెట్లు తీశారు.



సోమవారం 65/2 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు భారత బౌలర్లు హడలెత్తించారు. దీంతో ఒక్క పరుగు వ్యవధిలోనే హాషీం అమ్లా (4)ను షమీ పెవిలియన్‌కు పంపాడు. ఆ వెంటనే రబడ (5)ను కూడా షమీ ఔట్ చేశాడు. అనంతరం వచ్చిన దక్షిణాఫ్రికా సారథి డుప్లిసీస్ కూడా (0) ఖాతా తెరువకుండానే బుమ్రా బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఈ క్రమంలోనే డికాక్ (8)ను బుమ్రా, ఫలిందర్ (0)న షమీ ఔట్ చేశారు.దీంతో ఆఫ్రికా వరుస వికెట్లు కోల్పోతూ పోయింది. ఒక వైపు వికెట్లు పడుతుంటే మరోవైపు డివిలియర్స్ మాత్రం నిలకడగా ఆడుతూ జట్టు స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. అవకాశం చిక్కినప్పుడల్లా బౌండరీలు సాధిస్తూ పోయాడు. దీంతో ఆఫ్రికా 100 పరుగుల మార్కును దాటింది. అయితే చివర్లో బుమ్రా అద్భుత బంతితో డివిలియర్స్‌ను కూడా పెవిలియన్‌కు చేర్చాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన డివిలియర్స్ 50 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 35 పరుగులు చేశాడు. చివర్లో మహరాజ్ (15) పరుగులు కొద్ది సేపు పోరాటం చేసిన ఆఖరికి భువనేశ్వర్ ఇతనిని ఔట్ చేశాడు. మోర్నె మోర్కెల్ (2)ను భువనేశ్వర్ పెవిలియన్‌కు పంపాడు. స్టెయిన్ (0) నాటౌట్‌గా మిగిలాడు. దీంతో దక్షిణాఫ్రికా (41.2 ఓవర్ల)లో 130 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీలు తలో మూడు వికెట్లు పడగొట్టారు. మరోవైపు భువనేశ్వర్ కుమార్, హార్దిక్ పాండ్యాలు చెరో రెండు వికెట్లు తీశారు.

స్కోరుబోర్డు

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286 ఆలౌట్

ఇండియా తొలి ఇన్నింగ్స్: 209 ఆలౌట్

సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్య 34, ఎల్గార్ (సి) సాహా (బి) పాండ్య 25, రబడ (సి) కోహ్లీ (బి) షమీ 5, హాషీం ఆమ్లా (సి) రోహిత్ (బి) 4, డివిలియర్స్ (సి) భువనేశ్వర్ (బి) బుమ్రా 35, డూప్లేసిస్ (సి) సాహా (బి) బుమ్రా 0, డికాక్ (సి) సాహా (బి) బుమ్రా 8, ఫిలాండర్ (ఎల్బీడబ్లూ) (బి) షమీ 0, మహారాజ్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 15, మోర్నీ మోర్కెల్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 2, స్టేయిన్ (నాటౌట్) 0; మొత్తం 41.2 ఓవర్లలో 130 ఆలౌట్; వికెట్ల పతనం: 1-52, 2-59, 3 66, 4-73, 5-82, 6-92, 7-95, 8-122, 9-130, 10-130; బౌలింగ్: భువనేశ్వర్: 11-5-33-2, బుమ్రా: 11.2-1-39-3, షమీ: 12-3-28-3, పాండ్య: 6-0-27-2, అశ్విన్: 1-0-3-0.

ఇండియా రెండో ఇన్నింగ్స్: మురళీ విజయ్ (సి) డివిలియర్స్ (బి) ఫిలాండర్ 13, ధావన్ (సి) (సబ్) మోరీస్ (బి) మోర్కెల్ 16, పుజారా (సి) డికాక్ (బి) మోర్కెల్ 4, విరాట్ కోహ్లీ (ఎల్బీ) (బి) ఫిలాండర్ 28, రోహిత్ శర్మ (బౌల్డ్) (బి) ఫిలాండర్ 10, సాహా (ఎల్బీ) (బి) రబడ 8, పాండ్యా (సి) డివిలియర్స్ (బి) రబడ 1, అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 37, భువనేశ్వర్ (నాటౌట్) 13, షమీ (సి) డూప్లేసిస్ (బి) ఫిలాండర్ 4, బుమ్రా (సి) డూప్లేసిస్ (బి) ఫిలాండర్ 0; ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం 42.4 ఓవర్లలో 135 ఆలౌట్; వికెట్ల పతనం: 1-30, 2-30, 3-39, 4-71, 5-76, 6-77, 7-82, 8-131, 9-135, 10-135; బౌలింగ్: ఫిలాండర్: 15.4-4-42-6, మోర్కెల్: 11-1-39-2, రబాడ: 12-2-41-2, మహారాజ్: 4-1-12-0.



ఆస్ట్రేలియా ఘన విజయం

- చివరి టెస్టులోనూ ఓడిన ఇంగ్లండ్
- యాషెస్ సిరీస్ 4-0తో కైవసం



సిడ్నీ: ప్రతిష్ఠాత్మక యాషేస్ సిరీస్‌ను ఆసీస్ కైవసం చేసుకుంది. ఇక్కడ జరిగిన చివరి టెస్టులో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 123 పరుగులతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. దీంతో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 4-0తో గెలుచుకుంది. నాలుగో టెస్టు మ్యాచ్ డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. చివరి టెస్టులో టాస్ గెలిచిన ఇంగ్లండ్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. ఆసీస్ బౌలర్ కమిన్స్ ధాటికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకు ఆలౌటై పోయింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌లో కెప్టెన్ జోయ్ రూట్ (83), మలాన్ (62) పరుగులు చేయడంతో ఇంగ్లండ్ జట్టు ఆ మాత్రం స్కోరును చేయగలిగింది. అద్భుత బౌలింగ్ చేసిన కమిన్స్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాలో ఉస్మాన్ ఖాజా (171), షాన్ మార్ష్ (156), మిచెల్ మార్ష్ (101), డేవిడ్ వార్నర్ (56) పరుగులతో చెలరేగారు. దీంతో ఆసీస్ భారీ స్కోరును సాధించి మొదటి ఇన్నింగ్స్‌ను 649/7 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. దీంతో ఇంగ్లండ్‌పై ఆసీస్ 303 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించింది. అనంతరం భారీ లోటుతో రెండో ఇన్నిం గ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌కు మరో సారి కమిన్స్ నిప్పులు చెరిగే బంతులతో హడలెత్తించాడు. అకాశమే హద్దుగా చెలరెగి బౌలింగ్ చేయడంతో ఇంగ్లండ్ కేవలం 180 పరుగులకే కుప్పకూలి ఇన్నింగ్స్ 123 పరుగులతో భారీ ఓటమిని మూటకట్టుకుంది. చెలరేగి బౌలింగ్ చేసిన కమి న్స్ నాలుగు వికెట్లు పడగొట్టగా, అతనికి అండగా నిలిచిన లియోన్ మూడు వికెట్లు తీశాడు. ఒంటరి పోరాటం చేసిన ఇంగ్లండ్ కెప్టెన్ జోయ్ రూట్ (58) పరుగుల వద్ద గాయంతో వెనుదిరిగాడు. 180 పరుగుల వద్ద 9వ వికెట్ కోల్పోయిన ఇంగ్లండ్ అనంతరం గాయపడ్డ రూట్ తిరిగి బ్యాటింగ్ రాలేకపోయాడు. దీంతో అంపైర్లు ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను ఇక్కడే ముగించి ఆసీస్ గెలిచినట్లు ప్రకటించారు. రెండు ఇన్నింగ్స్‌లలో చెలరేగి బౌలింగ్ చేసి ఇంగ్లండ్‌ను కట్టడి చేసిన కమిన్స్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. కెప్టెన్‌గా ముందుండి జట్టును విజయాలను అందించిన

అలెస్టర్ కుక్ రికార్డు..

ఇంగ్లండ్ ఆటగాడు అలెస్టర్ కుక్ టెస్టుల్లో 12 వేల పరుగుల మైలురాయి దాటి అరుదైన రికార్డు సాధించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన చివరి ఐదో టెస్టులో 10 పరుగులు చేయడం ద్వారా ఈ ఘనతను సాధించిన ఆరో క్రికెటర్‌గా దిగ్గజాల సరసన చేరాడు. టెస్టుల్లో అత్యధిక పరుగుల రికార్డు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరున ఉంది. ఇతను 15921 పరుగులతో మొదటి స్థానంలో ఉన్నాడు. సచిన్ తర్వాతి స్థానంలో ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు రికీ పాంటింగ్ ఉన్నాడు. 13289 పరుగులతో మూడో స్థానంలో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ జాక్ కలిస్, 13288 పరుగులునాలుగో స్థానంలో మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్, 12400 పరుగులతో ఐదో స్థానంలో శ్రీలంక బ్యాట్స్‌మన్ సంగక్కర ఉన్నాడు.



ఆసీస్ సారథి స్టివ్ స్మిత్‌కు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు లభించింది.

మూడవ స్థానంలో ఆసీస్..

5 మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను 4-0తో గెలుచుకున్న ఆస్ట్రేలియా 104 పాయింట్లతో తాజా ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో 3వ స్థానానికి ఎగబాకింది. మరోవైపు చెత్త ప్రదర్శన చేసిన ఇంగ్లండ్ ఐదో స్థానానికి పడిపోయింది. పాయింట్ల పట్టికలో అత్యధిక పాయింట్లు 124తో భారత్ అగ్ర స్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా 111 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ 100 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతొంది. తర్వాతి వరుసా స్థానాల్లో ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్తాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, జింబాబ్వేలు ఉన్నాయి.

ఐపీఎల్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న దక్షిణాఫ్రికా?



న్యూఢిల్లీ: మరోసారి ఐపీఎల్ దేశం బయట నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐతే ఇది ఈ ఏడాది జరిగే సీజన్ కాదు వచ్చే ఏడాది. ఔను 2019 ఐపీఎల్ సీజన్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించేందుకు చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఇంతకీ ఎందుకో తెలుసా.. వచ్చే ఏడాది దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఐపీఎల్-12వ సీజన్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించాలని యోచిస్తున్నారు. ఇందుకు సఫారీ బోర్డుతో నిర్వాహకులు చర్చలు జరపగా సానుకూల స్పందన వచ్చినట్లు సమాచారం. 2009లోనూ ఎన్నికల కారణంగా ఐపీఎల్-3వ సీజన్‌కు దక్షిణాఫ్రికా ఆతిథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఐపీఎల్-11వ సీజన్ ఏప్రిల్ 4న ప్రారంభమై మే 31తో ముగియనుంది. ఈ నెల 27, 28 తేదీల్లో ఆటగాళ్ల వేలం బెంగళూరులో జరగనుంది.

టీ20 సిరీస్‌లో స్టోక్స్‌కు చోటు



లండన్: ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ మరోసారి జట్టులో స్థానం దక్కించుకున్నాడు. స్థానం అయితే దక్కించు కున్నాడు కానీ ఈ సారైనా ఆడతాడా లేదా అని అభి మానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. యాషెస్ సిరీస్, ఆ తర్వాత ఆసీస్‌తో వన్డే సిరీస్ కోసం ఎంపిక చేసిన ఇంగ్లండ్ జట్టులో చోటు సంపాదిం చుకున్న స్టోక్స్ ఆ తర్వాత యాషెస్‌లో ఆడని సంగతి తెలిసిందే. అలాగే వన్డే సిరీస్ జట్టు నుంచి అతన్ని తప్పిస్తున్నట్లు తాజాగా ఇంగ్లండ్, వేల్స్ బోర్డు ప్రకటించిన సంగతి తెలిసిందే.

గత ఏడాది వెస్టిండీస్‌పై విజయం అనంతరం బ్రిస్టల్‌లో ఓ బార్‌కు వెళ్లిన స్టోక్స్ అక్కడ ఘర్షణ వివాదంలో చిక్కుకున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. పోలీసుల నుంచి ఎలాంటి క్లియరెన్స్ రాకపోవడంతో స్టోక్స్ జట్టులో స్థానం దక్కించుకున్నా.. మ్యాచులు ఆడలేకపోతున్నాడు. తాజాగా ఇంగ్లండ్-ఆసీస్-న్యూజిలాండ్ మధ్య ఫిబ్రవరి 7 నుంచి ముక్కోణపు టీ20 సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ కోసం ఇంగ్లండ్ స్టోక్స్‌కు జట్టులో స్థానం కల్పించింది. సిరీస్ జరిగే సమయంలో విచారణ ఉంటుందో లేదో 48 గంటల్లో స్టోక్స్‌కు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు. దీంతో జట్టులో చోటు దక్కించుకున్న స్టోక్స్ పరిస్థితి గందర గోళంగానే ఉంది. స్టోక్స్ ఐపీఎల్‌కు అందుబాటులో ఉంటాడని ఆ దేశ బోర్డు తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.